
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
**కందర్ప రామచంద్ర రావు**
**ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డాక్టర్ తుమ్మూరి**
**సి.వి. శ్యామల రావు**
**డి.వి.ఆర్. మూర్తి**

సంపుటి 9 - సంచిక 10
ఫిబ్రవరి 2009

**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722


## యుగశక్తి లీలలు

యుగం మారాలంటే భూమిమీద ప్రతియుగంలోను యుగశక్తి ఆవిర్భవిస్తుంది. ఆ యుగంలోని సమస్యలను నివారించడం తన రహస్యమయమైన దైవ శక్తివల్లనే చేస్తుంది. తన అఖండమైన అజేయశక్తి సామర్థ్యాలతోనే సమస్యలతో క్షీణించిపోయిన యుగంనుండి 'నవయుగం' ప్రకటితమౌతుంది. రకరకాల సమస్యలను అనుసరించి దీనిలోకూడ అనేకరూపాలు కనిపిస్తాయి. ఒకసారి బ్రహ్మర్షి విశ్వామిత్రుని చేతనలో అవతరించిన వేదమాత మర్యాదా పురుషుడైన శ్రీరామునికి మహాకాలుని పిలుపును వినిపిస్తుంది. ఒకసారి వామనుడి విరాట్రూపము ధరించి దేవత్వానికి ఓదార్పునిస్తుంది. శ్రీకృష్ణుని విశ్వరూపంలో ఇదే ఆదిమాత యొక్క యుగలీలలు కనిపిస్తాయి. ఈ త్రిగుణాత్మకమైన మహామాయను ఉపాసించడానికే యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి ప్రేరేపిస్తాడు. **"తస్మాత్ యుద్ధ్య స్వ భారత!"** (అర్జునా! అందుకే యుద్ధం చెయ్యి).

ప్రతియుగంలో అవతరించే ఆయుగశక్తి ఈ యుగసంధిలో యుగ ఋషి మన ఆరాధ్యదైవం పరమ పూజ్యగురుదేవుల ఆధ్యాత్మిక చేతనలో అవతరించింది. హిమాలయాలనుండి దివ్యఋషి సత్తా ఆయన అంతరంగంలో బ్రహ్మబీజాలను నాటింది. దానినుండే ఈ యుగంలో వేదమాత అనేకరూపాలలో కనిపిస్తోంది. ఈనాడు జాతీయ, అంతర్జాతీయ దృష్టిలో జరుగుతున్న ఘటనలు, జరుగుతున్న అల్లకల్లోలం మొదలైనవన్నీ ఆశక్తియొక్క రహస్యమయ లీలలే.

ఈ యుగప్రత్యావర్తన లీలలు దృశ్యాదృశ్యరూపాలలో అనేకం. కనిపించే దృశ్యాలు తీవ్రంగా అనిపిస్తే, కనిపించని దృశ్యాలు తీవ్రాతి తీవ్రం. మనందరి ఆరాధ్యదేవత యుగదేవతగా ఆవిర్భవించి ఆజగన్మాత యొక్క లీలల సందేశాన్ని వినిపిస్తూ ఉంది. పరమపూజనీయ గురుదేవుల స్వరంనుండి మనందరి కొరకు మహాకాలుని ఆహ్వానమంత్రం వినిపిస్తూ ఉంది. 24 అక్షరాల గాయత్రీమంత్రంలో ఆమె అవతారలీలలోని 24 కళలు కనిపిస్తూ ఉన్నాయి. గాయత్రీ జయంతి పర్వదినాన ఆతల్లియొక్క పిలుపును విని, యుగశక్తి యొక్క సూక్ష్మ లీలలకు సూత్రధారుడై వెళ్లిపోయారు. అయినప్పటికీ ఇప్పుడు కూడ యుగశక్తి ప్రత్యావర్తన లీల మిగిలే ఉన్నది. దానిలో మనమందరం భాగస్వాములం కావాలి.

★★★

చెడును విస్మరించు-మంచిని సంస్కరించు.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** యుగశక్తి లీలలు 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం :** నీ అమరత్వాన్ని గుర్తించు 2
4. **వేద మంత్రం :** నిజాయితీలో సాత్వికత 3
5. **వర్తమాన భారతం :** వానప్రస్థాన్ని ప్రోత్సహిద్దాం 4
6. **ముఖచిత్ర కథనం**
సూర్యసాధన మహత్యం అర్థంచేసుకోండి-లాభంపొందండి 7
7. **ధారావాహిక : హనుమత్ కథామృతం-10**
మునిజనుల ఆశీస్సులు 9
8. **సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గాయత్రీ సాధనలు** 11
9. **ధారావాహిక : భక్తి గాథ-15**
భక్తుని జీవితం నిర్ద్వంద్వం-సహజం 14
10. **బోధకథ :** చిన్నపని చేయకూడదా? 16
11. **ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-20**
కర్మకాండ-పూజాపద్ధతులు 17
12. **తత్వచింతన :** మానవ జీవనం-ఈశ్వర విశ్వాసం 19
13. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-38**
కళాసాధన 21
14. **సంస్కృతీమూర్తి-పరమపూజ్యగురుదేవులు**
పండుగలకిచ్చారు చైతన్యాన్ని-సుసంస్కారాన్ని 23
15. **ఆచరణలో అధ్యాత్మ :** నైతిక మూల్యాలు-సర్వాంగీణత 25
16. **ప్రత్యేక వ్యాసం:** కంచిమీదుగా నా అరుణాచలయాత్ర-2 26
17. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-58**
మెరిసింది సరికొత్త వెలుగు-1 29
18. **మనం-మన ఆరోగ్యం**
పంచ మహాభూతాలు-వాయుతత్వం-ఆయుర్వేదం-2 32
19. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-29**
శక్తిపీఠాలస్థాపన-1 34
20. **సద్గుణ సంపద-1**
భౌతికతకు నైతికత తోడైతే ధార్మికత నిలుస్తుంది 36
21. **రోగనిర్మూలన-యోగసాధన** 38
22. **నావారితో నామాట-1**
శతజయంతి ఉత్సవాలరూపురేఖలు 40
23. **సద్గురులీలామృతం**
గురుదేవుల అభయహస్తమే నన్ను నడిపించింది
అదే అసలైన పెద్ద కారణం 43
24. **ఏ పుస్తకంలో ఏముంది?** 44
25. **వార్తలు** 45




# సద్గురు వచనామృతం

## పనిగా పరిణమించాలి ఆలోచన

ఆలోచనలకూ, పనులకూ మధ్యగల పొంతన చెడిపోతే, మనిషి మనస్సుకు సమతూకం తప్పుతుంది. భూమిమీద తన ఆలోచనలకు అనుగుణమైన పరిస్థితులు అతడికి కానరావు. ఆ దోషాన్ని అతడు సమాజంపై రుద్దుతాడు. లోలోపల ఒక ద్వేషాన్ని పెంచుకుంటాడు. దోషం సమాజానిది కాదు. అతడు బయటికి ఏమీ చెప్పలేడు. ఫలితంగా అతడి మనస్సు మండుతూ ఉంటుంది, సుడులుతిరుగుతూ ఉంటుంది. క్షోభిస్తూఉంటుంది. అతడి జీవితం స్తంభించిపోతుంది. అతడికి జీవితం ఒక విషమ సమస్యగా పరిణమిస్తుంది. అతడు తనకు ఇష్టమైన ఊహలను నిజంచేయలేడు. వాస్తవంతో పోరాడే సామర్థ్యం అతడికి ఉండదు. అతడు సమాజాన్ని దిగజార్చలేడు. ఆ స్థితిలో అతడి జీవితం మోయలేనిబరువు అవుతుంది. శాపం అవుతుంది.

మరోప్రక్క-బుద్ధికుశలుర ఆలోచనా విధానం సమతూకంలో ఉంటుంది. వారి ఆలోచనలకూ, పనులకూ మధ్య సమన్వయం ఉంటుంది. వారు జీవితాన్ని సార్థకం చేసుకుంటారు. సత్ఫలితాలను సాధించి అభినందనలను అందుకుంటారు. జీవితంలో కర్మకు ప్రాధాన్యాన్ని ఇచ్చే వ్యక్తి పెక్కు పథకాలువేయడు. ఎక్కువ పనిచేస్తాడు. పనికిమాలిన ఆలోచనలు చేయడానికి అతడికి తీరిక దొరకదు. ఒక ఆలోచన పూర్తికాగానే, దానిని ఒక లక్ష్యంగా మార్చడానికి అతడు కృషిచేస్తాడు. ఆ లక్ష్యాన్ని సాధించేవరకూ మరో ఆలోచనకు తావు ఇవ్వడు.

★★★

### పండుగలు

**ఫిబ్రవరి**

- **2** రథసప్తమి
- **18** సమర్థగురు రామదాసు జయంతి
- **23** మహాశివరాత్రి
- **27** శ్రీరామకృష్ణ పరమహంస జయంతి

**మార్చి**

- **11** హోలి
- **27** ఉగాది

జీవితాన్ని తెలియజేయలేని చదువు శ్మశానంలోని నక్కల అరుపు.

వేద మంత్రం

# ఒంటరిగా అనుభవించేవాడు దొంగ

**మోఘమన్నం విందతే అప్రచేతాః సత్య బ్రవీమి వధ ఇత్స తస్య ।**

**నార్య మణం పుష్యతి నో సఖాయం కేవలాఘో భవతి కేవలాది ॥**

**(ఋగ్వేదం 10/117/6)**

**భావార్థం :** దుర్బుద్ధిగల మనుష్యుని వద్ద ధన సంగ్రహం జరుగకుండుగాక. దానితో అతడు తన స్నేహితులకు సహాయమేమీ చేయడు. ఈ విధంగా ఒక్కడే అనుభవించేవాడు పాపాన్ని అనుభవిస్తాడు. అతడు నిశ్చయంగా దొంగయే.

**సందేశం :** ధనంతో మనస్సులో లోభం, మోహం, మదం, అహంకారం జన్మిస్తాయి. తెలివయిన వారు కూడా దీని వలలో చిక్కుకుంటారు. ఇక దుర్బుద్ధి కలిగిన వ్యక్తుల గురించి చెప్పవలసినపనేముంది? వారు ధనం రాగానే పిచ్చివారైపోతారు. ఉచితానుచితాలు ఆలోచించకుండా భోగవిలాసాలలో నిమగ్నమైపోతారు. ప్రపంచం నలువైపులా అనేక మంది పాపబుద్ధి కలిగిన వ్యక్తులవద్ద అన్నం, ధనం, నానా విధాలైన భోగసామాగ్రి ప్రోగుపడి ఉండటం చూస్తాము. పైకి వారు ధనవంతులుగా, సుఖపడుతున్నట్లు కన్పిస్తుంది. కానీ, అది వాస్తవమేనా? కాదు. వారు భోగసామాగ్రినంతటినీ అనుభవించడంలేదు. ఆ భోగసామాగ్రియే వారిని తినివేస్తుంది. అది సుందరరూపంలో వచ్చిన కాలుడే. పాపి, దుర్బుద్ధి కల వ్యక్తి వద్ద ప్రోగుపడిన ప్రాపంచిక భోగవస్తువులు అతనికి మృత్యువుతో సమానమే.

అటువంటి వ్యక్తి ఆ ధనాన్ని సద్వినియోగం చేయటంలో అసమర్థుడుగా ఉంటాడు. ధనాన్నంతా తన దేహపోషణ, విలాసాలలోనే ఖర్చు చేస్తాడు. యజ్ఞీయ భావన అతనిలో అసలు ఉండనే ఉండదు. ఆ ధనంతో ప్రాణిజగత్తు పోషణ కార్యం చేయడు. పారమార్థిక కార్యక్రమాలలోనూ వ్యయం చేయడు. యజ్ఞాది కర్మలతో ప్రపంచానికి ఉపకారం చేస్తూ యజ్ఞశేషాన్ని ఉపయోగించుకుంటే ఆ ధనసంపత్తే వ్యక్తికి అమృతంతో సమం, పవిత్రం, పుణ్య ఫలదాయకం అవుతుంది. సమాజంలో వ్యాపించిన దురాచారాలు, దుష్ట సాంప్రదాయాలు పాపకర్మల ద్వారా సంపాదించిన ధనంవల్లనే పుట్టుకువస్తాయి. దురాచారాలకు ప్రోత్సాహం లభిస్తుంది. అరాజకత వ్యాపిస్తుంది.

ఒంటరిగా అనుభవించేవాడు. ఇతరులకు పెట్టకుండానే తాను తినేవాడు కేవలం పాపాన్నే భుజిస్తున్నట్లు, నలువైపులా ఒక్కపూటకూడా తినటానికి లేక ఆకలితో నగ్నంగా గుడిసెలలో ఉంటున్నవారు అసంఖ్యాకంగా ఉన్నప్పుడు– వారి మధ్యలో కూర్చుని హల్వా పూరీ తినేవారికి, విలాస జీవితం జీవించేవారికి మించిన పాపాత్ములు ఇంకెవరు ఉంటారు? అటువంటి వ్యక్తి పైకి బాగా ఉంటున్నట్లు, సుఖిస్తున్నట్లు కన్పించినప్పటికీ– జాగ్రత్తగా గమనిస్తే కేవలం అతడు తన పాపాన్ని అనుభవిస్తున్నట్లే, పాపంలో భాగస్వామియైనట్లే. ప్రపంచంలో అతనికి అవసరమైనప్పుడు ఏ ఒక్కరూ సహాయపడరు. సమాజం నుండి వేరై, ఒంటరిగా జీవిస్తాడు. శరీరం, మనస్సు, ఆత్మలకు పుష్టికలిగించే నిజమైన భోజనానికీ (ధనానికీ) శీఘ్రవినాశనానికి చేర్చే పాపమయ భోజనానికీ మధ్య తేడా తెలుసుకొనే వివేక బుద్ధి మనకు కావాలి. పాపంతో లభించే హల్వా పూరీ తినేకంటే, కలోగంజో త్రాగడమో, ఆకలితో ఉండటమో వెయ్యిరెట్లు శ్రేష్ఠం.

ధనం మృత్యువూ కావచ్చు. అమృతమూ కావచ్చు.

★★★

తప్పును ఒప్పుకోవడం అంటే - చెడును శుభ్రపరచడమే.

వర్తమాన భారతం

# వానప్రస్థాన్ని ప్రోత్సహిద్దాం

## సంస్థలుంటే సరిపోదు-సభ్యులు కావాలి

దేశంలో సంస్థలకేమీ తక్కువ లేదు. ఈ సంప్రదాయం అనాది కాలంనుండి ఉన్నదే. కాని ఇప్పుడు అధిక సంఖ్యలో పెరిగి పోతున్నాయి. ప్రతీదానికి ఒక సదుద్దేశ్యాన్ని ప్రకటిస్తూ ఉంటారు. కాని దానిలో అధిక శాతం స్వార్థమే తొణికిసలాడుతూ కనిపిస్తుంది. ఫలానా వ్యక్తి పరోపకారి, ఫలానా వ్యక్తి సమాజసేవకుడు అని లెక్కింపబడాలనీ, ప్రజలు సన్మానాలు చేయాలనీ, ఈ గౌరవ ప్రపత్తులను అడ్డం పెట్టుకుని ధనసంపాదన చేయాలనీ, ఇంకా ఇంకా సమయోచిత లాభాలు పొందాలనీ వారి తాపత్రయం. క్రొత్త క్రొత్త సంస్థల జన్మకు మూలకారణం ఇదే. ఇటువంటి పరిస్థితుల్లో కూడ లోకకల్యాణాన్ని కోరే సంస్థలు లేకపోలేదు. వారికి వ్యక్తిగత స్వార్థం ఉండదు. స్వచ్ఛమైన మనస్సుతో పరమార్థాన్నే కోరుతుంటారు. అయినా వారి అభివృద్ధికి అప్పుడప్పుడు ఆటంకాలు వస్తూ ఉంటాయి.

కారణాన్ని లోతుగా ఆలోచించి చూస్తే ఒకే ఒక్క విషయం స్పష్టమౌతుంది. సంస్థమాత్రం ఉంది. సభ్యులే కనిపించడంలేదు. గొప్పదనం సంస్థలది కాదు. దానిని నడిపే వ్యక్తులదే. విత్తనం సర్వస్వాన్ని సమర్పించి మహావృక్షాన్ని విస్తరింప చేస్తుంది. అదేవిధంగా సర్వసమర్పణ చేసికున్న వ్యక్తుల ద్వారానే సంస్థలు వృద్ధి చెందుతాయి. వారు చేసిన త్యాగాలే దానికి ఎరువు-నీరు అవుతాయి. ఈ పునాదిపైననే సంస్థ గట్టిగా నిలువ గలుగుతుంది. గట్టి పునాది లేకపోతే ఏ సంస్థా వృద్ధిచెందలేదు. తన లక్ష్యాన్ని చేరుకోలేదు. సభ్యుల శ్రద్ధ- శ్రమ, త్యాగం- బలిదానం నిండుగా లభించాలి. అప్పుడే సంస్థ వటవృక్షంలా విస్తరించి లక్ష్యసాధనలో విజయాన్ని సాధిస్తుంది. పాఠశాలకు బల్లలుకాదు ముఖ్యం పిల్లలు. అదేవిధంగా సంస్థకు భవనం కాదు ముఖ్యం సభ్యులు. సమర్పిత భావంగల సభ్యులు. లెటర్ పాడ్‌లు, రిజిష్టర్లు కాదు ముఖ్యం లక్ష్య శుద్ధిగల, వ్యక్తిత్వంగల వ్యక్తులు.

## ప్రభుత్వాన్ని పరికిద్దాం

ప్రభుత్వం కూడ ప్రత్యేకంగా ఒక మిషనే. దానికీ ప్రజాబలమే కావాలి. ప్రభుత్వ నేతలకు కూడ ఒక మిషనరీ జీల్ (ఉత్సాహం) తప్పనిసరిగా ఉండాలి, అప్పుడే కోట్లాది సంఖ్యలో ఉన్న ప్రజల యోగక్షేమాలను సరిచూడగలుగుతారు. అప్పుడే మహోన్నత స్థానానికి చేరుకో గలుగుతారు. కాని పదవులను మాత్రమే స్వీకరిస్తున్నారు. దానికి కావలసిన నైతికత నశిస్తోంది. ఈనాటి పరిస్థితుల్లో మిషనరీ తత్వం (సేవా భావం) లేకుండా ఏ సంస్థా వృద్ధి చెందడం జరుగదు. ప్రజలస్థాయిలో నడిచే ధార్మిక, సామాజిక, సైక్షిణిక మొదలైన రకరకాల మిషన్లు (సంస్థలు) నడుస్తూనే ఉన్నాయి. కాని దేశసౌభాగ్యం మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుంది. మిషన్లు (సంస్థలు) ఉన్నాయి. మిషనరీలు (సేవకులు) లేరు. సేవ పేరుతో ఆడంబరాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కాని నిజమైన సేవాభావన గగన కుసుమమై పోతున్నది. సంస్థలు ఎన్ని ఉన్నా క్రియాశీలురైన సభ్యులు లేనంత కాలం, రానంత కాలం అన్నీ వ్యర్థమే. అనుకున్న దానిలో సహస్రాంశం కూడ పూర్తి చేయలేము. ప్రగతికోసం కంటున్న బంగారు కలలన్నీ కల్లలైపోతాయి.

## సేవాక్షేత్రానికి సాధకులు కావాలి

కేవలం కీర్తి కాంక్షతో కాకుండా ఆత్మ ప్రేరణతో, పరమాత్మను పొందే కోరికతో సేవారంగంలో ప్రవేశించే సంస్థలు కావాలి. ధర్మ బద్ధులై, పవిత్రమైన మనస్సుతో దైవభక్తిలో లీనమయ్యే సంస్థలు కావాలి. త్యాగ - బలిదానాలను ఒక తపశ్చర్యగా, యోగసాధనగా నిర్వహించే వ్యక్తులు మాత్రమే విశ్వమానవ సేవను అందించగలుగుతారు.

వానప్రస్థ పరంపర మాత్రమే దీనిని పూర్తి చేయగలుగుతుంది. కనుక దానిని తిరిగి పునరుద్ధరింపచేయాలి. అప్పుడే ఖచ్చితంగా లోకసేవకుల లోటు తీరిపోతుంది. స్మశానంలా మారుతున్న ఈ సమాజం నందనవనంలా మారుతుంది.

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవీయ దుర్దశను చూచి నిజంగా దుఃఖపడుతున్నవారు, నేటిమానవ వికృతులను చూచి నిజంగా బాధపడుతున్న వారు, నవయుగ నిర్మాణానికి నిజంగా తహతహలాడుతున్నవారు తమ పవిత్రమైన కర్తవ్యాన్ని గుర్తు చేసికోవాలి. సంబంధించిన సంస్థలో సభ్యులుగా చేరిపోవాలి. వానప్రస్థాన్ని నిర్మలమైన మనస్సుతో సమర్థించాలి. వానప్రస్థులకు

**అలలు లేనిది సముద్రం కాదు - బాధలు లేనిది జీవితం కాదు.**

యోగ్యమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి. అనుభవంతో కూడిన, యోగ్యమైన, ప్రతిఫలం కోరని కర్మ నిష్ఠ కలిగిన సేవలు అందించే ప్రయత్నం చెయ్యాలి. అటువంటివారిని ఒక విశాలసేనగా ఏర్పాటు చేసుకోవాలి.

## లోభ, మోహ, అహంకారాలను వదిలివేయాలి

వానప్రస్థుల అవసరాన్ని, ప్రయోజనాన్ని వ్యాసాలద్వార, ఉపన్యాసాల ద్వార తెలియచేయడం జరుగుతూనే ఉంది. వారిని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తూనే ఉన్నాం. ప్రార్థిస్తూనే ఉన్నాం. కాని వారినింకా లోభమోహాలు వీడడంలేదు. ఆశలు చావడంలేదు. ఆధునిక సౌకర్యాలను వదలలేకపోతున్నారు. శ్రమైక జీవనానికి దగ్గరకాలేకపోతున్నారు. కుటుంబ బాధ్యతలనుండి ముక్తులై విశ్రాంతిగా జీవించాలనే భావిస్తున్నారు. సమాజాన్ని గురించి ఏమాత్రమూ ఆలోచించడంలేదు. ఎవరైనా ఆధ్యాత్మికతను గురించి ప్రస్తావిస్తే నామజపం, కథాకాలక్షేపం మొదలైన తేలికపాటి వ్యవహారాన్ని చేపడతారు. సమాజసేవను గురించి బలమైన ప్రేరణ లభించడం లేదు. అందువలన "వానప్రస్థ స్వీకారం" అన్న విషయం గాలిలో కలసిపోతోంది. ఇప్పుడు వాస్తవాలకు ఎదురు నిలవాలి. అవసరాలను సాధించడం కోసం, సాధకులసేనను తయారు చేయడం కోసం కర్తవ్య పరాయణులు శ్రమించాలి. దీనికోసం ముఖ్యంగా చేయాల్సిన పని మీ పరిధిలో ఉన్న వృద్ధుల జాబితాను తయారు చేసికోవాలి. వారిలో వానప్రస్థ స్వీకారానికి యోగ్యులైన వారిని ఎంపిక చేసికోవాలి. వారితో స్నేహం చేసికొని రాకపోకలు సాగించాలి. మెల్లమెల్లగా వానప్రస్థం గురించి ఒక్కొక్క అడుగు వేయించాలి. పరమార్థ తత్వాన్ని బోధించాలి. క్రియాశీల కార్యకర్తగా తయారు చేయాలి. ఉత్సాహాన్ని పెంపొందింప చేయాలి. లోభమోహాలకు దూరంగా నడిపించాలి.

## మనకు కావలసింది ఏమిటి?

యుగశక్తి గాయత్రి మాస పత్రికని చదివే ప్రతి ఒక్క పాఠకుడు పరివార్ కార్యక్రమాలలో అభిరుచిని కలిగి ఉండాలి. మీ స్నేహపరిధిలో ఉన్న ప్రతి పాఠకుడు పరివార్‌కు ప్రయోజనకారిగా మారాలి. సమయం దొరికినప్పుడు పత్రికలో ఉన్న వ్యాసాలపై చర్చలు జరపాలి. ఆ చర్చల ఫలితంగా అవతలివారి మనస్సు జనసేవకు అంకితమవ్వాలి. ప్రతి సభ్యుడు తమ తమ గృహాలలోని వానప్రస్థులకు తగిన ప్రోత్సాహాన్ని ఇస్తూ ఉండాలి. స్ఫూర్తిపొందిన వృద్ధులు తమ తమ బాధ్యతలను వారసులకు అప్పగించి నిశ్చింతగా బయటకు వచ్చేయాలి.

కష్టపడి సంపాదించిన డబ్బుతో బిడ్డలను విద్యావంతులను చేయాలి. అంతవరకే తన బాధ్యతగా భావించాలి. అంతే- కాని వారు, వారి బిడ్డలు కూడ తరాల తరబడి కూర్చుని తినేటంతగా ధనం సంపాదించి ఇవ్వకూడదు. అలా ఇవ్వడంవల్ల వారు సోమరులుగా మారిపోవచ్చు. అధికధనాన్ని చేజిక్కించుకుని దుర్వ్యసనాలకు లోనవుతారు. అందువల్ల బిడ్డలను స్వావలంబులుగా తయారుచేయాలంటే వారి పైనున్న బాధ్యతలు తీరిపోయాక మిగిలిన ధనాన్ని సత్కార్యాలకు (దాన ధర్మాలకు) వినియోగించాలి. బుద్ధిమంతులు చేయాల్సిన పని అదే. దీనివల్ల బిడ్డలు తమ కాళ్లపై తాము నిలబడడమేకాక సద్గుణవంతులు ఔతారు. తండ్రిని ఆదర్శంగా తీసికొని పరమార్థంకోసం తనవంతు పనిని ఎంపిక చేసికుంటారు. పై విషయాలపై చక్కని అవగాహన కల్పించాలి. వారి సమస్యలకు చక్కని పరిష్కారాన్ని సూచించాలి.

## ముందునుండే ప్రణాళిక చేసికోవాలి

ప్రతివ్యక్తీ తన వృద్ధాప్యాన్ని గురించి, అప్పుడు చేయవలసిన కార్యాలను గురించి ముందుగానే యోచించిపెట్టుకోవాలి. మొదటి నుండే ఒక నిర్ణయంమీద నిలబడగలిగితే మనస్సును దానికి అనుగుణంగా మలచుకోవచ్చు. తనతోపాటు మరికొందరిని తయారుచేయవచ్చు. ముందు జీవితంలో రాబోయే సమస్యలను, పరిష్కారాలను ఊహించుకోవచ్చు. తన భావిజీవిత నిర్ణయాలను ముందుగా తెలియచేస్తూ ఉండడంవల్ల తోటివారికి స్ఫూర్తిని కలిగించవచ్చు. కనీసం పదిమందిలో ఒక్కరికైనా మార్గదర్శకం కావచ్చు.

ఇంటి బాధ్యతల్లో గృహిణియొక్క అవసరం ఉంటే ఆమెకు ఇంటివద్దనే ఉంచి తానుమాత్రం వానప్రస్థసేవలు చేయవచ్చు.

**కష్టమూ, అవకాశమూ మరెక్కడా లేవు - మనసులోనే ఉన్నాయి.**

అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి ఇంటికి పోయివస్తూఉండవచ్చు. అటువంటి రాకపోకలకు ఎవరు అడ్డు చెప్పరాదు. ఏమాత్రం అవగాహన ఉన్న స్త్రీ అయినా తన భర్త చేసే సామాజిక సేవకు అడ్డు తగలదు. కొద్దిపాటి స్వీయసౌకర్యాలకోసం లోకకల్యాణ కార్యాలకు ప్రతిబంధకం కాలేదు. ఒకవేళ మూర్ఖంగా ప్రవర్తించినా భర్తనచ్చచెప్పుకుని ముందుకుసాగాలి. సాధు-సన్యాసులవలె ఎప్పటికీ ఇల్లు వదలివెళ్లడం లేదని వివరించి చెప్పాలి. వేసే ప్రతి అడుగు ఇంటి కార్యాలకన్నా ఎక్కువగా పారమార్థిక కార్యాలవైపుకే ఉపకరించాలి.

వానప్రస్థసేవలలో భార్యను విడిచి రావాలన్న నియమం ఏమీలేదు. సహధర్మచారిణి సహకరిస్తే ఇద్దరూ కలసికట్టుగా రావచ్చు. కలసి పనిచేయవచ్చు. ఇద్దరూ ఒకేచోట ఉన్నట్లైతే రెట్టించిన ఉత్సాహంతో రెట్టింపుపని చేయవచ్చు. ప్రారంభంనుండే భార్యను సేవాకార్యాలకు సుముఖురాలిగా చేసికున్న వారికే ఇది సాధ్యపడుతుంది.

ఈ విధమైన ముందుతయారీ వల్ల అనుకున్న కార్యం చాల సులభంగా నెరవేరుతుంది. అన్నింటికన్నా ముఖ్యమైన తయారీ ఏమంటే స్వార్థాన్ని దగ్గరకు రానీయరాదు. సంకీర్ణ భావాలను దూరం చేసికోవాలి. నరనరాలతో పెనవేసికొని పోయిన మోహబంధాలను ఒక్క బలమైన ఆలోచనతో త్రెంచుకోగలగాలి. సేవాధర్మంలో ఉన్న మహత్తును అర్థం చేసికోగలగాలి. ప్రక్కవారికి అర్థం చేయించగలగాలి. తాను ఒక్కడు చేయడంకన్నా పదిమందిచేత చెప్పిచేయించ గలిగినవాడే నిజమైన ప్రజాసేవకుడు. భజనలు చేయడం, ముక్తి కోసం ప్రార్థించడం లోకసేవ అనిపించుకోదు. ఒక రకంగా ఇలాంటివన్నీ బాల్యక్రీడలుగా చెప్పవచ్చు. ఇలాంటి దైవసేవలోనే గడిపేవానికి 'సేవ' అన్న పదానికి అర్థం తెలియనట్లే లెక్క. ఆత్మ పరిశీలన, ఆత్మ పరిష్కారం, ఆత్మ నిర్మాణం అనేవి ఆతని మనస్సులోనికి ఏనాడూ ప్రవేశించవు. ఆత్మవికాసం అన్నది ఆతని దరిదాపులకు కూడ రాదు.

వృద్ధాప్యంతో చివికిపోయిన వ్యక్తి లోకసహజంగా ఇంటివారితోనే సేవలు పొందాల్సి ఉంటుంది. అంతేకాని తన భారాన్ని ఏదైనా వృద్ధాశ్రమానికి అప్పచెప్పకూడదు. ఇది లోకసేవ అనిపించుకోదు సరికదా, సమాజంపైన అధిక భారాన్ని వేయడమే అవుతుంది. "పూర్తిగా శరీరం, మనస్సు సహకరించకుండా పోయిననాడు మాత్రమే నేను సేవాకార్యక్రమాలకు దూరంగా ఉంటాను." అన్న దృఢమైన సంకల్పం ప్రతీ వ్యక్తీ ముందునుండే తీసికోవాలి.

## ఈ పరంపరను జీవింపచేద్దాం

పైన తెలిపిన సత్యాలను అహర్నిశం గుర్తుచేసికుందాం. మనకు ఉపకరించే వ్యక్తులను సమీకరిద్దాం. వారికి తగిన విధంగా ప్రేరణనిద్దాం. మనదేశంలో అనాదికాలంగా అద్భుత సేవలను అందించిన వానప్రస్థ పరంపరను పునరుద్ధరింపచేద్దాం. ఇది నెరవేరాలంటే ఏంచేయాలి? వారికి ప్రాథమిక ప్రశిక్షణ ఇవ్వాలి. ప్రశిక్షణకోసం మూడు నెలలు కేటాయించాలి. శాంతికుంజ్‌కు సాదరంగా ఆహ్వానించాలి. భోజనం-వసతి మొదలైనవి ఉచితంగా సమకూర్చాలి. శారీరకంగా, మానసికంగా శిక్షణ తీసికోలేనివారు ఆర్థికంగా సహకరించాలి. వారికిబదులుగా వారి ధనం సేవాకార్యాలకు ఉపయోగపడుతుంది.

మానవుని ఆయుర్దాయం నిండునూరేళ్లు. పూర్వార్ధం అయిన 50 సంవత్సరాలు కుటుంబ జీవనానికి ఉపయోగించుకోవచ్చు. ఉత్తరార్థమైన 50 సంవత్సరాలు వానప్రస్థ-సన్యాసాశ్రమాలకు వినియోగించుకోవచ్చు. ఇదీ మన ఆశ్రమ నియమావళి. 50 సంవత్సరాలు నిండగానే వానప్రస్థాన్ని స్వీకరించుమనడంలో గొప్ప అర్థమున్నది. సహజంగా ఆ వయస్సునాటికి ఇంటి బాధ్యతలు తీరిపోతాయి. శరీరం కూడ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోదు. మనస్సు కూడ ధనార్జన నుండి, పుత్రవ్యామోహం నుండి, కీర్తికాంక్షల నుండి కొంతలో కొంత వైరాగ్యాన్ని సంతరించుకుంటుంది. అన్ని విషయాలలో ఒకరకమైన అదుపు స్థిరపడిపోతుంది. కనుక లోకకల్యాణం కోసం ప్రేరణ లభించిందంటే దానిలో నిమగ్నమైపోతారు. ఆనందంగా సేవాకార్యక్రమాలు చేబట్టగలుగుతారు. అందుకే మన పెద్దలు వయోవిభజన చేసి చెప్పారు.

సాంసారిక సుఖాల మీద విముఖత, సామాజికసేవ మీద ఆసక్తిగల వారికి, కుటుంబ బాధ్యతలు బాధించని వారికి వయస్సుతో నిమిత్తమే లేదు. వారు తలచుకున్నవెంటనే వానప్రస్థులు కావచ్చు. యోగ్యమైన సేవలను అందించవచ్చు. అందరికీ స్వాగతం పలుకుతున్నాం.

★★★

***ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.***

**రాత్రిపూట సూర్యుని కోసం కన్నీళ్లు పెట్టుకుంటే - నక్షత్రాలయినా కనిపించవు.**

ముఖచిత్రకథనం

# సూర్యసాధన మహత్యం అర్థంచేసుకోండి-లాభం పొందండి

సూర్యుడు ఈ సమస్త సౌరమండలానికి ధృవకేంద్రంగా భావించబడతాడు. ఈ కారణంగానే విభిన్న ధర్మాల, సాంప్రదాయాల ప్రజలు అతనిని దైవీశక్తిరూపంగా భావించి పూజలు, అర్చనలు చేస్తారు.

ఈజిప్టు దేశంలోని పౌరాణిక ప్రామాణికతలను అనుసరించి 'హీలియోపోలిస్' సూర్యుని రాజధానిగా చెప్పబడింది. నేపాల్, యూనాన్, రోమ్ నివాసీయుల ఆరాధ్యదైవం మరియు ఇష్టదైవం సూర్యుడే. మరి పురాణాల ప్రామాణికతల ననుసరించి సూర్యుని పుత్రుడు 'పీథన్' ఆగ్నేయరథాన్ని ఆకాశమార్గంలో నడిపే ప్రయాస చేశాడు. దాని ఫలితంగానే అది పృథ్వియొక్క కక్ష్యకు సమీపానికి వచ్చింది. అప్పటినుండే తన అస్తిత్వాన్ని పరిచయం ఇవ్వడం జరిగింది. క్రైస్తవుల ధర్మగ్రంథమైన 'ఓల్డ్‌టెస్ట్‌మెంట్' ప్రకారం 'జోశుఆ' కు సూర్యప్రాసాదంలోనే అంత్యక్రియలు జరిగాయి. 'పాదరీజాబ్' అను మహనీయుడు సూర్యోదయ సమయంలోమాత్రమే తన దగ్గరికి వచ్చేవారికి ఉపదేశాలిచ్చేవాడు. అనగా ప్రాతఃకాల సూర్యుని బంగారు కిరణాలు ఉన్నప్పుడు జరిపిన సత్సంగం పూర్తి లాభాన్నిస్తుంది. వారు తన నివాసానికి 'వేథ్‌రోమేష్' అనగా సూర్యభవనం అని పేరుపెట్టారు. అతి పురాతనమైన 'ఇన్కా' సంస్కృతిని గమనిస్తే దాని రాజధాని అయిన 'కున్కో'లో ఒక విశాలమైన సూర్యదేవాలయం నిర్మించబడిఉంది. వారి ఆరాధ్యదైవం సూర్యుడు అని తెలుస్తుంది. మెక్సికో దేవాలయాలలో ఈనాటికీ సూర్యోపాసన గమనార్హం. బ్రెజిల్, న్యూజిలాండ్ నందలి ఆదివాసులు సూర్యుని ఒక విరాట్‌ఆత్మగా భావిస్తారు. సూర్యుడు అవసరాన్నిబట్టి మానవశరీరాన్ని ధరించి మానవజాతికి కళ్యాణమార్గాన్ని ప్రశస్థం చేస్తాడని వారి నమ్మకం. అమెరికాలోని కొన్ని జాతులవారు సూర్యుడిని తమ దేవతగా గౌరవించి పూజలు, అర్చనలు చేస్తారు. అజ్ఞానాంధకారంలో మునిగిఉన్న ప్రాణులను భవసాగరం నుండి దాటిస్తాడు అని వారు విశ్వసిస్తారు. ధృవప్రదేశంలోని ఎస్కిమోజాతివారు సూర్యనృత్యంపట్ల అధికమైన ఇష్టాన్ని కలిగిఉన్నారు. క్రైస్తవ ధర్మానుయాయులు ఆదివారాన్ని తమ ధార్మికదినంగా భావిస్తారు.

సూర్యుడు అగ్నియొక్క ఒక ప్రచండగోళం, ప్రాణశక్తి యొక్క శ్రేష్టమైన భాండాగారం. దీనియందు అంతర్నిహితంగా ఉన్న శక్తుల వలన విధ్వంసాత్మకమైన లేదా సృజనాత్మకమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మానవుని బుద్ధిమీదనే ఆధారపడిఉంది. యూనానీ ప్రజలు సూర్యుని 'అపోలో' అనే పేరుతో పిలుస్తారు. 'హీలియోస్' అని కూడ పిలుస్తారు. ఆంగ్లభాషలో హీలియం శబ్దం ఉత్పత్తి దీనిద్వారానే జరిగింది. పలురకాలుగా జీవితానికి ఉపయోగపడే తత్వాలకు సూర్యుడే ఉద్గమకేంద్రం అని ఒప్పుకొనితీరాలి. సంపూర్ణవిశ్వాన్ని అనగా చర-అచర అన్నింటికీ జీవితాన్నిచ్చేది, ప్రాణాన్నిచ్చే శక్తి సూర్యుడే అని భారతీయశాస్త్రాలు, ధర్మగ్రంథాలు స్పష్టంగా చెప్పాయి.

ఋగ్వేదం 10.37.4.5లో సూర్యుడు సంపూర్ణవిశ్వానికి వెలుగు నందించేవాడేకాక తన కిరణాలద్వారా ఆరోగ్యాన్నందించి దోషాలను నివారణ చేసే అభూతపూర్వమైన శక్తితో నిండినవాడు. వాని ఉపాసనతో దుస్వప్నాల వలన కల్గిన బాధ, నవగ్రహాలవలన కల్గిన కష్టం నివారణం అవుతుంది. రాక్షసులనుండి, దుష్ప్రవృత్తుల నుండి బయటపడటానికి కావల్సిన శక్తి సూర్యకిరణాలలోనే ఉంది.

ఋగ్వేదం 1.115.1.6లో ఈవిధంగా ఉన్నది. 'ఓ ప్రకాశకిరణములారా! సూర్యోదయ సమయంలో మీరు అంతటా వ్యాపించి మమ్మల్ని పాపాలనుండి బయటపడవేయండి. ప్రపంచంలోని దుఃఖాలనుండి మమ్మల్ని రక్షించండి'. అనగా సూర్యకిరణాలలో సమస్తరోగాలు, శోకాలు పోగొట్టే శక్తి ఉన్నది అని. సూర్యుడు తన ప్రకాశంతో, తేజస్సుతో అందరికీ వెలుగునిస్తాడు. యజుర్వేదంలో సూర్యుడు సంపూర్ణభువనానికే వెలుగునిచ్చేవాడుగా చెప్పబడ్డాడు. అథర్వణవేదంలో ఈ వెలుగుకిరణాలు హృద్రోగాలను దూరం చేస్తాయి అని ఉన్నది. సూర్యకిరణాలు భూమిమీద ఉన్న తడిపదార్థాలను ఎండబెడతాయి. సముద్రజలాలను బాష్పీకృతం చేసి ఆ నీరు త్రాగటానికి యోగ్యంగా మన కందిస్తాయి. సూర్యకిరణాలలో కుష్ఠురోగ నివారణకు కావల్సిన అపూర్వమైన శక్తి ఉంది. శ్రీకృష్ణుని ద్వారా శపించబడ్డ అతని పుత్రుడైన సాంబుడు తన కుష్ఠువ్యాధిని

**దాన, యజ్ఞాల జ్ఞానాన్ని ఇచ్చేదీ, ముందుకు నడిపించేదీ స్వాధ్యాయం.**

సూర్యోపాసన ద్వారా నివారణ చేసుకున్నాడు. ఈ ప్రకాశకిరణాలను సేవించుట ద్వారా అతని వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. సూర్యశతకం అనే అద్భుతమైన సూర్యస్తోత్రాన్ని పఠించి ఏడవ శతాబ్దికి చెందిన ఒక మహాకవి మయూరుడు సూర్యోపాసన ద్వారా తనకు వచ్చిన కుష్టువ్యాధినుండి నివారణ పొందాడు.

మత్స్యపురాణంలో 67-69లో 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అనగా ఆరోగ్యం కోరేవారు భాస్కరుని ఆరాధన చెయ్యాలి అని వున్నది. రామచరితమానసంలో 'నయన దివాకర్ కచఘనమాల' కంటికి సంబంధించిన వ్యాధులన్నీ సూర్యకిరణాల ద్వారా నివారణ చెందుతాయి అని ఉన్నది. యోగవిద్యానిపుణులు ఏమని చెపుతారంటే 'శరీరంలో వున్న సూక్ష్మచక్రాలను ప్రభావితం చేయటానికి రంగుల ధ్యానం అవసరం' అని. ఉదాహరణకు 'సోలార్‌ప్లెక్సస్' అనగా మణిపూరకచక్రం అగ్నితత్త్వమే ప్రధానంగా కలది. దీనిని జాగృతం చేయటానికి స్వర్ణిమపసుపురంగు కమలాన్ని ధ్యానించాలి.

భౌతికవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రొ॥ హెండర్సన్ ఈవిధంగా చెబుతున్నారు. 'సూర్యుడు, అతని కిరణాలే బ్రహ్మాండమునందు సర్వోత్తమమైనవి. ఈ కిరణాలు ప్రతీ సెకండుకి 18,6000 మైళ్ళ వేగంతో ప్రయాణం చేసి పృథ్వికి చేరి జీవధారులలో, వృక్షవనస్పతులలో నూతన జీవితాన్ని నింపుతాయి. ఈ కిరణాలలోని ప్రాణశక్తి ఆధారంగానే విశ్వబ్రహ్మాండంలోని జడ-చేతనాల ఉత్పత్తి జరుగుతుంది.

సూర్యోపనిషత్తులో ఈ చరాచరజగత్తు ఉత్పత్తికి ఒకే కారణం సూర్యుడు అని చెప్పబడిఉన్నది. ఆయనే సంపూర్ణజగత్తుకు ఆత్మ, బ్రహ్మ అనికూడ ఉన్నది. పతంజలిమహర్షి 'భువనజ్ఞానం సూర్యేసంయమాత్' సూర్యునిలో సంయమనం చేయుట వల్ల సంపూర్ణవిశ్వానికి సంబంధించిన జ్ఞానం స్పష్టం అవుతుంది అనిచెప్పారు. ప్రసిద్ధిచెందిన థియోసాఫిస్ట్ లెడ్‌బీటర్ తన గ్రంథం 'మైండ్ విజిబుల్ అండ్ ఇన్‌విజిబుల్' లో-ప్రపంచములో ఏడులోకాలున్నాయని, అదేవిధంగా మానవశరీరం ఏడుస్థాయిలలో పనిచేస్తుందని. అవి - ఫిజికల్, ఆస్ట్రల్, మెంటల్, బుద్ధిక్, నిర్వాణిక్, పరానిర్వాణిక్, మహాపరానిర్వాణిక్ - అని రచించారు.

జ్యోతిర్విజ్ఞానానికి చెందిన చైనా జ్యోతిష్కులు 4 వేల సంవత్సరాలనుండి భవిష్యద్వాణులు చెపుతూవచ్చారు. ప్రజలకు రాబోయే ప్రమాదాల గురించి ముందే హెచ్చరిస్తూ ప్రకోపాలనుండి రక్షిస్తూవచ్చారు. యూనాన్‌కు చెందిన బెలీజ్ అను అతడు సూర్యగ్రహణం గురించి తెలుసుకొని రెండు దేశాల మధ్య జరిగే ఒక గొప్ప యుద్ధాన్ని ఆపాడు. ఒకవేళ మీరు యుద్ధం చేస్తే సూర్యుడు మిమ్మల్ని శపిస్తాడు అని ఆయన చెప్పగా అందుకు భయపడిన రాజులు యుద్ధాన్ని ఆపివేశారు.

వశిష్ఠమహర్షి సూర్యవంశీయ రాజు బృహద్బలునికి సూర్యుని వైభవాన్ని గురించి వర్ణించాడు. ఆస్ట్రియాకు చెందిన థియోడోర్ తన రచనలో ఇలా వర్ణన చేశారు. సూర్యునినుండి వచ్చే కిరణాలలో 400 కిరణాలు నీటిని వర్షింపచేస్తాయనీ, 30 కిరణాలు మంచును ఉత్పత్తి చేస్తాయనీ, ఈ కిరణాలద్వారా ఓషధులలో శక్తి పెరుగుతుందని ఉన్నది. అగ్నిలో ఇవ్వబడే ఆహుతులు సూర్యుని చేరి ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. యజ్ఞం ద్వారా పర్జన్యం, పర్జన్యం ద్వారా అన్నం లభించుట శాస్త్రప్రసిద్ధం మరియు లోకప్రసిద్ధం.

గాయత్రీ ఉపాసన వలన లభించే స్థూల లాభాలన్నీ సూర్యదేవుడు అందించే చమత్కారాలు. సూర్యుని ధ్యానించినవారికి ఆ కిరణాలలో మనస్సు స్నానం చేస్తుంది. తద్వారా అతని యందు శ్రేష్ఠమైన శక్తి నిశ్చయంగా లభిస్తుంది. సూర్యభగవానుని ధ్యానం వల్ల మానసిక శుద్ధి ఆత్మిక పవిత్రత పెరుగుతుంది. సూర్యుడే సృష్టికి ప్రాణం. ప్రాణాలను ఉపేక్షించిన మానవజీవనం యొక్క అస్తిత్వాన్నే రక్షించుకోలేం. సూర్యుని, సూర్యకిరణాలను ఉపాసించుటద్వారా మనం ఆరోగ్యాన్ని, బలాన్ని, ఆత్మికప్రగతిని పొంది రోగరహిత జీవనాన్ని గడుపగలం.

పూజ్య గురుదేవులు సర్వమానవాళికి అందించిన గాయత్రి మంత్ర సాధకుని సూర్యునితో జోడింపచేస్తుంది. గాయత్రి మంత్రాధి దేవత సవితగా పేర్కొనబడింది. సవిత అనగా భౌతిక సూర్యుని అంతరంగంలో ఉన్న శక్తి. అందువల్లనే గాయత్రి జపసమయంలో ఉదయిస్తున్న సూర్యుని ధ్యానం చెయ్యాలన్నారు. మానవునికి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలున్నట్లే సూర్యునికి కూడా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలున్నాయి. కాని వీటిస్థాయి అనూహ్యం. ఆయన విరాట్ స్వరూపం. అందువల్ల ఈ మూడు శరీరాలను అధి భౌతికస్వరూపం, అధి దైవిక స్వరూపం, ఆధ్యాత్మిక స్వరూపంగా చెప్పబడ్డాయి.

భారతీయ ఋషులు కనిపెట్టిన ఈ సాధనా పద్ధతి భారతీయులదే గాక సర్వమానవాళికి చెందింది. సూర్యుడు సర్వ మానవులకు ఆరాధ్యదైవమే. అంతేగాక గాయత్రి విద్య ద్వారా సౌరవిజ్ఞానాన్ని అభ్యసించాలి. ఇంజనీరింగ్, మెడిసిన్ వలె గాయత్రి విద్య కూడా రాబోయే రోజులలో పాఠ్యాంశం ఔతుంది. అవ్వాలికూడ.

★★★

**స్వాధ్యాయం ఒక తపస్సు.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-10

# మునిజనుల ఆశీస్సులు

'హనుమాన్' అన్న పేరు చెవిని పడగానే అక్కడ ఉన్న వారందరికీ నోట్లో పటిక బెల్లం ముక్క పడ్డట్లే అనిపించింది. ఆ పేరు మననం చేసిన కొద్దీ మరింత మధురంగా మారిపోయింది. 'హనుమాన్' అంటూ స్పష్టంగా ఉచ్చరించిన కొద్దీ ఒకానొక అస్పష్ట స్వరం పాంచభౌతిక తలాన్ని దాటుకుంటూపోయి అంతరాంతరాలలో నిలచిపోయింది. మతంగ మహర్షికి కొద్దిదూరంలో ఆయన శిష్యుడు సువ్రతుడు నిలబడిఉన్నాడు. గురుదేవుని నోటినుండివెలువడ్డ ఈ నామం ఆతనికి మహామంత్రంలా ధ్వనించింది. సువ్రతునికి తమ గురుదేవుని మనోభావాలు చక్కగా అర్థమౌతాయి. నామకరణ సమయంలో గురువుగారి విలక్షణస్వరాన్ని, ఆయన పులకించిపోతున్న తీరుతెన్నులు గమనిస్తూనే ఉన్నాడు.

మతంగ మహర్షి వైరాగ్యతత్వం సువ్రతునికి బాగా తెలుసు. మోహంఅనేది ఆయనదరిదాపులకురాదు. అంజనీ పుత్రుని గురించిన ఆయన భావాలు మిక్కిలి గంభీరంగా కనిపించసాగాయి. తన ఆరాధ్యదైవమైన సదాశివునితేజస్సును బాలునిముఖంలో చూచి, ఆయన మురిసిపోతున్నాడు. అంతా గమనిస్తున్న సువ్రతుని మనస్సును ఒక ఆధ్యాత్మికస్ఫూర్తిఆవరించింది. పసివాని ముఖాన్ని తిలకిస్తూనే "ఓం హనుమతే నమః" అని అస్పష్టంగా ఉచ్చరించాడు. ఈ నామమంత్రాన్నిజపిస్తూనే సువ్రతుని శరీరమంతా నూతన విద్యుత్ ప్రసరించింది. అంతఃకరణలో భక్తి అలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి.

అంజనీదేవి అక్కడవిచ్చేసిఉన్నవారిఆలోచనలను, భావాలను గ్రహించేస్థితిలోలేదు. ఆమె ఈ లోకాన్నే మరిచిపోయింది. ఆమెకళ్లకు కుమారునిముఖంతప్ప ఏమీ కనిపించడంలేదు. మనస్సు నిండా ప్రేమరసమే ప్రవహిస్తోంది. ఇది ఒక విచిత్రమైనఅనుభవం. జాగ్రదావస్థలోనే సమాధిమగ్న అయిపోయింది. ఆమెకు ఈ నిర్వికల్ప భావసమాధిలో అందమైన కుమారుని ముఖమే దర్శనమిస్తోంది. ప్రక్కనే ఉన్న కేసరి మాత్రం ఎంతఆనందంలో మునిగితేలుతున్నా, కార్యక్రమ వ్యవస్థను గురించే శ్రద్ధ చూపుతున్నాడు. అక్కడ నిలబడి ఉన్నా తన బాధ్యతను విస్మరించలేదు. పనివారిని సైగల ద్వారా హెచ్చరిస్తూనే ఉన్నాడు. అవసరమైన సూచనలిస్తూనేఉన్నాడు. మధ్య మధ్య అతిథులను పలకరిస్తూనే ఉన్నాడు.

"అమ్మా! అంజనీ! నీ పుత్రుని ఒడిలో భద్రంగాఉంచుకో తల్లీ!" మతంగ మహర్షి మాటకు అంజని ఉలిక్కిపడి ఈ లోకంలోకి ప్రవేశించింది. కొద్దిగా సిగ్గుపడుతూ కుమారుని ఒడిలోకి తీసుకుంది. బాలుని చిన్నారిమూతిని, శిరస్సును మృదువుగా ముద్దాడింది. మెల్లగా హనుమాన్! హనుమాన్! అంటూ ప్రేమగా పిలిచింది. మధురానుభవంతో ధన్యురాలై మురిసిపోయింది.

అతిథులంతా తమతమ కానుకలను సమర్పించి తిరిగి వెళ్లాలన్న తొందరలోఉన్నారు. మునులు తమతమఆశ్రమాలను చేరుకోవాలని త్వరపడుతున్నారు. వచ్చిన పని నామకరణం పూర్తి అయింది. కొందరు మునులకు వదలివచ్చిన అనుష్ఠానం గుర్తుకు వచ్చింది. కొందరు ఋషులకు తమగురుకులాలలో శిక్షణా కార్యక్రమాలు గుర్తుకు వచ్చాయి. అందరి అలోచనా ఒక్కటే. త్వరగా వెళ్లిపోవాలి.

అతిథి అభ్యాగతులందరు కేసరి దంపతులకు అమూల్యమైన బహుమతులను ఇవ్వడంమొదలుపెట్టారు. చిత్రవిచిత్రాలైన కానుకలు వస్తున్నై. కొన్ని రచనాత్మకంగా, కొన్ని కళాత్మకంగా ఉన్నాయి. కొన్ని ప్రకృతిసౌందర్యాన్ని పుణికిపుచ్చుకున్నాయి. వీటిని వనవాసులు స్వయంగా తయారు చేసి తెచ్చారు. కేసరి దంపతులు ప్రసన్నంగా, కృతజ్ఞతా పూర్వకంగా అందుకుంటున్నారు. అందరి హృదయాలలో హనుమాన్ సైగల ప్రేమనుగమనించి మురిసిపోతున్నారు.

**సిద్ధులకు మూలం స్వాధ్యాయం.**

ఋషి జనులకు శిశువు పైగల ప్రేమవిలువ వారి ఆశీర్వచనాలలోనే స్పష్టమౌతోంది. అందరూ ఆయుర్దాయానికి ఆరోగ్యాన్ని జోడించి పలికారు. వారి ఆశీస్సుల్లో సురక్ష, శుభం కలగలసి ఉన్నాయి. ఋషిమునులంతా ఈ ఆశీర్వచనాలలో తమతమ తపోబలాన్ని మిళితంచేసి అందించారని కేసరి దంపతులకు బాగా తెలుసు. అదే అతిపెద్ద కానుకగా భావించి, మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

వీరందరికీ దూరంగా నిలబడ్డ మతంగ మహర్షి ఇప్పటివరకు మౌనంగా ఉన్నాడు. మధ్య మధ్య ఆకాశం వైపు చూస్తున్నాడు. ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుగా ఉన్నది. బహుశా తన మౌనభాషలో ఎవరినో ఆహ్వానించి ఉండవచ్చు. ఇప్పుడు జవాబుకై ఎదురు చూస్తుండవచ్చు. కొద్దిక్షణాల్లో అదేజరిగింది. ఆ వాతావరణంలో నారద మహర్షి వీణా ఝుంకారం వినిపించింది. సామవేదగానం చేస్తూ దేవర్షి వచ్చి చేరాడు. ఈ సంఘటన అందరి మనసులనూ ఊపివేసింది. వానరదంపతుల సంగతి సరేసరి. వారి ఆనందానికి అవధుల్లేవు.

మతంగ మహర్షి మహోల్లాసంతో ఎదురేగి స్వాగతిస్తూ– "దేవర్షి! అంజనీపుత్రుడు మీఆశీర్వచనంకోసం ఎదురు చూస్తున్నాడు. అనుగ్రహించండి." అన్నాడు. వెంటనే కేసరి, అంజనీ దేవి పుత్రసహితంగా వచ్చి నమస్కరించారు. ప్రార్థనా పూరకంగా దృష్టిని సారించారు. నారదుడు అనుగ్రహదృష్టిని ప్రసరింపచేశాడు. మతంగుని వైపు చూచి– "మహర్షీ! నీకు అంజనా పుత్రుని జన్మ రహస్యం పూర్తిగా తెలుసు. వరదాతకే వరములివ్వడం ఎవ్వరి తరం కాదు. కాని లోకాచారం ప్రకారం ఈ శిశువుకు ఆశీర్వాదం ఇవ్వక తప్పదు. ఇస్తాను." అంటూ అంజనివైపు తిరిగాడు. "అంజనీ! నీ పుత్రుడు హనుమాన్ భక్తికి, గుణానికి, బలానికి, బుద్ధికి పెట్టింది పేరుగా వృద్ధిలోనికి వస్తాడు. ఇతడు రాజభక్తిలో శ్రేష్ఠుడవుతాడు. అన్నింటికన్నామిన్నగా శ్రీరామభక్తిసాధన చేయవలసిందిగా ఆశీర్వదిస్తున్నాను. ఈతని శ్రీరామభక్తిసాధన యుగయుగాలవరకు శాశ్వతంగా నిలచి ఉంటుంది.

★★★

## నవజాగరణ జరగాలి

*అంతటా గాయత్రీ యజ్ఞం జరగాలి*
*అందరిలో నవజాగరణ జరగాలి ॥అం॥*

1. *గాయత్రిమాత మంత్రముచదివి*
*జ్ఞానజ్యోతులను వెలిగించాలి*
*మానవులంతా శ్రీరామశర్మ*
*సాహిత్యమునే చదవాలన్నా ॥అం॥*

2. *ప్రతివాడు మన భారతమాతకు*
*పేరు కీర్తులు తేవాలన్నా*
*తల్లిదండ్రుల నిత్యసేవలతో*
*జాతికి గౌరవం తేవలన్నా ॥అం॥*

3. *బ్రహ్మముహూర్తమున మేల్కొని మనము*
*మూడు మాలలు చేయాలన్నా*
*నిత్యము మనము నియమం తప్పక*
*గాయత్రి మంత్రం జపించాలన్నా ॥అం॥*

4. *ప్రేమను పెంచి కలతలుమాని*
*మానవత్వమనే మార్గంచేత*
*పదము పలుకుతు పాటపాడుతు*
*గాయత్రి గీతం పాడాలన్నా ॥అం॥*

5. *మానవులంతా ఒకటనేభావన*
*అందరిలో మనము పెంచాలన్నా*
*కోపతాపములను అంతము చేసి*
*యజ్ఞ సమిధలు కావాలన్నా ॥అం॥*

6. *గాయత్రి మంత్రం నిత్యం జపిస్తే*
*సత్‌బుద్ధి మనకూ కలుగోయమ్మా*
*గాయత్రి యజ్ఞం చేస్తే నిత్యం*
*సత్‌కర్మలేమో కలుగోయన్నా ॥అం॥*

– జిల్లా వెంకటనారాయణ

**స్వాధ్యాయం అంటే ఆత్మశిక్షణ.**

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గాయత్రీ సాధనలు

గాయత్రిని కల్ప వృక్షమని, కామధేనువని, పరసువేదియని పూజ్య గురుదేవులు వర్ణించారు. ఈ గాయత్రిసాధన ప్రతినిత్యం చేస్తున్నప్పటికి అనేక మందిని కొన్ని రకముల ఇబ్బందులు, బాధలు పీడిస్తుంటాయి. ఇటువంటి సమస్యలను పరిష్కరించుకోవటానికి, కోరికలు తీర్చుకొనుటకు పూజ్య గురుదేవులు కొన్ని ప్రత్యేకమైన, సాధనలు మనకు అందించారు. ఈ సాధనలలో కొన్నిచోట్ల బీజాక్షరములు ఉపయోగించబడ్డాయి. సాధకులు ఈ పద్ధతులను ఉపయోగించుకొని సత్వర నివారణ పొందగలరు. ముందుగా స్త్రీలకు ఉపయోగపడే సాధనలు ఇవ్వబడ్డాయి.

**మనోనిగ్రహం :**

ఈ సాధన ముఖ్యముగా స్త్రీలకు అవసరమవుతుంది. అనేక కుటుంబాలలో అత్తమామలు, ఆడపడుచులు భర్త వేధించడం జరుగుతుంటుంది. ఈ సమస్య నివారణ ఇలా చేసుకోవచ్చు. రోజు ఎంత జపం చేసుకుంటారో అంతే ముందుగా చేసి దీని తరువాత వృషభవాహనంమీద శ్వేత వస్త్రధారిణియై, చతుర్భుజములు కలిగి, ఒక చేతిలో మాల, ఒక చేతిలో కమండలం, ఒక చేతిలో పుస్తకం, ఒక చేతిలో కమలం కలిగి ఉండి ప్రసన్న ముఖంతో ఉన్న గాయత్రీ దేవిని ధ్యానం చేస్తూ కనీసం 24సార్లు గాయత్రి మంత్ర జపం చేయాలి. ఎప్పుడు వీలయితే అప్పుడు ఈ వృషభారూఢ, శ్వేతాంబరధారి మాల, పుస్తకం, కమండలం, కమలం ఆయుధములుగా ఉన్న చతుర్భుజిగా గాయత్రి స్వరూపమును మనోనేత్రంతో దర్శించుకుంటూ ఉండాలి. గాయత్రీ మాత మన ప్రక్కన ఉన్నట్టు భావన చేయాలి. ఈ విధముగా చేసినట్లయితే పరిస్థితులు అనుకూలంగా మారతాయి.

**వివాహము :**

కుటుంబములో కన్యలుంటారు. వివాహం కావటంలేదు. రాబోయే వరుడు ఎలాంటివాడో ఈ కాలంలో నిర్ణయించడం కష్టం. అందువల్ల ఆస్తికులైనటు వంటివారు కన్యల చేత ఈ సాధన చేయిస్తే వాళ్ళ భవిష్యత్తు చాల శుభప్రదంగా ఉంటుంది.

ఈ సాధనలో గాయత్రీమాత ఫొటోగాని ప్రతిమగాని స్థాపించుకుని గంధం, ధూపం, దీపం, అక్షతలు, పుష్పాలు, జలం, నైవేద్యం మొదలైన వాటితో అర్చించాలి. కనీసం 24 సార్లు గాయత్రి జపం చేయాలి. వీరు ఏ పని చేస్తున్నా, చదువుకుంటున్నా, ఉద్యోగం చేస్తున్నా ఆ మాత్రం టైముంటుంది. ఇలా చేస్తున్న కన్యల భవిష్యత్తు ఆనందంగా సుందరంగా తీర్చిదిద్దబడుతుంది.

**ఇతర గృహ సమస్యలు :**

ఒక్కొక్కచోట భర్త అనేక వ్యసనాలకు లోనయి ఉంటాడు. ఇంటికి టైముకు రాడు. ఇంటిలో ఒక యుద్ధ వాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి. సింహ వాహనంపై పసుపు వస్త్రములతో, త్రిశూలం డమరు ఆయుధములుగా కలిగిన గాయత్రీదేవిని ధ్యానం చేస్తూ, ఆశీర్వాదం లభిస్తున్నట్లు భావన చేయాలి. రోజూ కనీసం 24 సార్లు గాయత్రీ మంత్ర జపం చేయాలి "అధికస్య అధికం ఫలం"

వీలయితే పసుపు రంగు బట్టలు ధరించి సాధన చెయ్యాలి. వీలు కాకపోతే ఒక తెల్లని బట్ట పసుపులో ముంచి దానిని ప్రక్కన పెట్టుకోవచ్చు. వీలునుబట్టి ప్రతిరోజు ఒక పసుపురంగు పదార్థము ఆహారంగా తీసికుంటే మంచిది. శనగపిండితో చేసిన పదార్థాలను పసుపు పదార్థాలుగా స్వీకరించవచ్చు. ప్రతి పౌర్ణమినాడు ఉపవాస ముండాలి. ఈ పీతవర్ణ గాయత్రీసాధన దాంపత్య జీవన సుఖానికి పరమోత్తమం. ఒక నెలరోజుల పాటు చేసికుంటే మంచి ఫలితాలు లభిస్తాయి.

**సంతానం కొరకు :**

కొంతమంది సంతానం లేక బాధ పడుతుంటారు. డాక్టర్ల అభిప్రాయం ఎలా ఉన్నా ఈ సాధన చేస్తే మంచి ఫలితాలనిస్తుంది.

సూర్యోదయ సమయంలో సూర్యుడు ఎర్రరంగులో ఉన్నప్పుడు స్నానం చేయాలి. కటి ప్రదేశానికి క్రింది భాగం తడిగా ఉండాలి. ప్రశాంతంగా కొద్దిసేపు కూర్చుని, గాయత్రి మంత్ర జపం చేసికుంటూ, సూర్యుని కిరణాలు, తేజస్సు యోని మార్గంగా గర్భంలోకి ప్రవేశిస్తున్నట్లూ, గర్భధారణకు అనుకూలమైన పరిస్థితులు కలుగజేస్తున్నట్లూ భావన చెయ్యాలి. యద్భావం తద్భవతి. ఇష్టమున్న వారు బీజాక్షర సహితంగా అంటే **ఓం భూర్భువః స్వః యం యం యం తత్ సవితుర్ వరేణ్యం భర్గో దేవస్య ధీమహి**

సత్సంగంవల్ల బందిపోటుదొంగ వాల్మీకిగామారాడు.

**ధియో యోనః ప్రచోదయాత్** జపం చేసుకోవచ్చు. కేవలం 24 సార్లు గాయత్రి జపం చేస్తే అద్భుతమైన ఫలితాలనిస్తుంది. ఈ సాధన ఒక సంవత్సర కాలం పట్టవచ్చు. మాటిమాటికి గర్భస్రావమవుతున్నా, పుట్టిన శిశువులు మరణిస్తున్నా, ఈ గాయత్రీసాధన మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఈ సాధన పెళ్ళికాని కన్యలు చేయరాదు.

**పిల్లల ఆరోగ్యం :**

పిల్లల ఆరోగ్యం సవ్యంగా లేనప్పుడు బిడ్డను ఒడిలో ఉంచుకొని, హంస వాహనంపై శంఖ చక్ర ధారిణియై, గులాబి పూలతో అలంకరించుకొని ఉన్న గాయత్రీ దేవిని ధ్యానిస్తూ గాయత్రి మంత్రజపంచేయాలి. తల్లి చేసే జపప్రభావం ఒడిలో ఉన్న బిడ్డపై పడుతుంది. బిడ్డలో ఆశ్చర్యజనకమైన మార్పునుచూడవచ్చు. చిన్నబిడ్డ అయితే సాధనాసమయంలో పాలిస్తూ ఉండాలి, పెద్ద వాడయినట్లయితే అతని తలపై, శరీరంపై నిమురుతూ ఉండాలి.

**రోగనివారణ :**

శీతాకాలంలో చల్లదనం వల్ల వచ్చే రోగాలకు '**ఐం**' బీజమంత్రంతో కూడిన గాయత్రీమంత్రం ఉపయోగించాలి. వృషభవాహనంపై ఆకుపచ్చని వస్త్రాలు ధరించి, చేతులలో డమరు, త్రిశూలం ఆయుధాలుగా ధరించిన గాయత్రి మాతను ధ్యానిస్తూ **ఓం భూర్భువః స్వః ఐం ఐం ఐం తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్** జపం చెయ్యాలి. రోజుకి 24 సార్లు చేసిన చాలు. దీనితో పాటు మిరియాలపొడి, తులసి ఆకులు నీళ్లతోగాని, పాలతోగాని కలిపి రెండు మూడు గంటలకు ఆరోగ్య తీవ్రతను బట్టి ఇస్తూ ఉంటే లాభదాయకం.

అజీర్ణం, గాస్ట్రిక్ ట్రబుల్స్, గాస్ట్రిక్ అల్సర్స్ ఉంటే వృషభ వాహనంపై ఆకుపచ్చ వస్త్రాలతో డమరు, త్రిశూలం ఆయుధాలుగా ధరించిన గాయత్రీ దేవిని ధ్యానిస్తూ **"హుం"** బీజ మంత్రంతో కూడిన గాయత్రీమంత్రజపంచెయ్యాలి. **ఓం భూర్భువః స్వః హుం హుం హుం తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్** రోజుకు 24 సార్లు జపించాలి. ఇక్కడ కూడా పైన చెప్పిన విధంగా మిరియాలు, తులసి ఉపయోగించాలి.

**పిల్లల చదువు కొరకు :**

పిల్లలకు పరీక్షలలో సవ్యంగా మార్కులు రావడం లేదు. అలాంటి పరిస్థితిలో సమస్య నివారణకు రెండు మార్గాలున్నాయి. 1) నలుచదరపు మామిడి చెక్క తీసుకొని పిల్లవాని తల మీద పెట్టాలి. దానిపై మామిడి పుల్లతో కొట్టాలి. నొప్పి పుట్టేటట్లు కొట్టకూడదు. ఆ విధంగా కొన్ని రోజులు చెయ్యాలి. 2) సూర్యోదయపు వేళలో జుట్టు తడిపి, సూర్యకిరణాలు తలపై పడేటట్లు కొద్దిగా తలనువంచి, 108 సార్లు గాయత్రి మంత్రం చెప్పించాలి. ఇక్కడ గాయత్రి మంత్రానికి మూడు ఓంకారాలు చేర్చి జపించాలి. **ఓం ఓం ఓం భూర్భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్.** ఈ విధంగా చెయ్యడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి, బుద్ధి వికసించి చదువులో మంచి ప్రగతిని సాధించగలుగుతారు.

ఎవరైతే బుద్ధి తీవ్రత పెరగాలి అనుకుంటున్నారో వారు రెండు అరచేతులు సూర్యుని వైపు పెట్టి 12 సార్లు పైన చెప్పిన మూడు ఓంకారములతో కూడిన గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించి, అరచేతులను ఒక దానితో ఒకటి వేడిపుట్టేదాక రుద్దుకోవాలి. ఆ వెచ్చని అరచేతులతో ముఖం, నేత్రాలు, నాశికలు, కంఠం, చెవులు మొదలైన సమస్త శిరోభాగాలను స్పృశించాలి.

**రాజకీయ సఫలత :**

రాజకీయ సఫలత అంటే M.L.A గాని, M.P గాని అవుతాడని కాదు. ప్రభుత్వంతో జరగవలసిన పని అని అర్థం చేసుకోవాలి. ఏదో ఒక ఆఫీసుకి పనిమీద వెళ్తున్నాం. ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్తున్నాం. దానిలో విజయం లభించాలి. లోపలికి వెళ్తున్నప్పుడు ఏ స్వరం (శ్వాస) ఆడుతుందో చూచుకోవాలి. ఎడమ స్వరమైతే ఎడమ చేతి బొటనవ్రేలుమీద ఆకుపచ్చని జ్యోతిని, కుడి స్వరం ఆడుతున్నట్లయితే కుడి చేతి బొటనవ్రేలు మీద పసుపు పచ్చని జ్యోతిని ధ్యానం చేస్తూ సప్త వ్యాహృతులతో కూడిన గాయత్రీ మంత్రం **ఓం భూః భువః స్వః మహః జనః తపః సత్యమ్ తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్** అంటూ 12 సార్లు జపం చెయ్యాలి. మీ పనిలో విజయం చేకూరుతుంది.

**దారిద్ర్యం :**

దారిద్ర్యం అంటే డబ్బు లేకపోవడం కాదు. అవసరమైనపుడు ఆ వస్తువు లేకపోవడం. కోటీశ్వరులు ఉంటారు. అవసరానికి ఓ 5 లక్షలుకావాలి. దొరకదు. అవసరమైనపుడు ఆ వస్తువు లేకపోవటమే దారిద్ర్యం. రావలసిన డబ్బు సమయానికి చేతికిరాదు.

**పాఠకులకు విజ్ఞప్తి**

యుగశక్తి గాయత్రి మాసపత్రిక అందనివారు ఫిర్యాదు చేసినపుడు- చందాదారుని పేరు, పూర్తి అడ్రసు, పిన్‌కోడ్‌తోసహా, సభ్యత్వ కోడ్ (సభ్యత్వ కోడ్ కొరకు పత్రికమీద ఉన్న అడ్రసు స్లిప్ చూడండి) తెలియపరచవలసిందిగా కోరుతున్నాము.

బుద్ధిలోని సత్వగుణం వివేకం.

ఎవరికో కారుఇచ్చాం. అది తిరిగి సమయానికి రాదు. ఏదో ఇల్లు కొందామనుకుంటాం. డబ్బుంది. కాని బేరం కుదరడం లేదు. అర్హతలు అన్ని ఉంటాయి. కాని ఉద్యోగం రాదు. దారిద్ర్యం అంటే ఇలాంటి ఇబ్బందులే. ఈ దారిద్ర్య నివారణకు గజవాహనంపై, పీత వస్త్రధారి (పసుపు వస్త్రములు) అయిన గాయత్రీ మాతను ధ్యానం చేస్తూ శ్రీం బీజంతో కూడిన గాయత్రీ మంత్రాన్ని ప్రతిరోజు 24 సార్లు జపించాలి. **ఓం భూర్భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ శ్రీం శ్రీం శ్రీం.** పసుపు వర్ణం లక్ష్మీదేవికి ప్రతిరూపం. భోజనంలో కూడా పసుపు రంగు పదార్థాలను ప్రధానంగా తీసుకోవాలి. ఈ సాధనాకాలంలో అంటే ఉద్యోగ ప్రాప్తి కాని ఇంకేదైన లక్ష్యం పెట్టుకుంటే ఆ లక్ష్యం నెరవేరేంతవరకు ప్రతి శుక్రవారం నూనెలో పసుపు కలిపి రాచుకొని, తరువాత స్నానం చెయ్యాలి. ఆదివారం ఉపవాసముండాలి. ఈ విధంగా దారిద్ర్యమును దూరం చేసుకోవచ్చు. కోరినవి సాధించుకోవచ్చు.

**ఇతరులను ప్రభావితం చేయుట :**

కుటుంబంలో పరస్పరం అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురి అవుతుంటాము. అత్తగారితో సమస్య రావచ్చు. భర్తతో సమస్య రావచ్చు.వారు మనలను బాధపెడ్తూ ఉండవచ్చు. ఇలాగే ఆఫీసులో పై అధికారి వేధింపులకు గురికావచ్చు. ఇలాంటి సమస్యలకు– హంస పై గాని, వృషభం పై కాని కూర్చుని, నీలి వర్ణ వస్త్రాలతో అభయముద్ర కలిగిన గాయత్రీ మాతను ఊహించుకోవాలి. ఆమె అరచేతి అభయ ముద్రలో నీలి రంగు జ్యోతి– అక్కడ నుండి నీలిరంగు కిరణాలు ఎవరైతే మనకు సుముఖముగా లేరో వారిని చుట్టుముట్టినట్లు ఊహించుకోవాలి. ఈ సాధన మీ ఆవేదన, మీ భావాలు వారికి అర్థం అయ్యేటట్టు చేస్తుంది. ఈ విధమైన ధ్యానంతో 24 సార్లు గాయత్రీ మంత్ర జపం ప్రతిరోజు చేయాలి. సమస్య పరిష్కారమవుతుంది.

ప్రతి కార్యంలో మన ప్రయత్నంతో పాటు గురువుల ఆశీర్వాదం చాల ముఖ్యం. మీరు ఏమి కోరుకున్నప్పటికీ ఈ విద్యను మనకు అందించిన పూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య గారిని ఒక్కసారి తలచుకుని మనసారా నమస్కరించుకోవాలి. ఈ విధంగా చేసుకోవడం వల్ల మన సాధన శీఘ్రంగా ఫలప్రదం అవుతుంది.

★★★

## భూలోకంలోనే స్వర్గం-నరకం

*ఒకసారి గురుశిష్యులు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. హఠాత్తుగా శిష్యుడు ఒక ప్రశ్నవేశాడు. "గురుదేవా ! కొందరు భూలోకంలోనే నరకం అనుభవిస్తున్నారు– అని అంటూ ఉంటారు. అదెట్లా సాధ్యం? దయతో వివరించండి." గురువు కొద్ది సమయం కోసం శిష్యునికి జ్ఞాన చక్షువులు ప్రసాదించాడు. లోకాన్ని పరిశీలించి చూడుమన్నాడు. శిష్యునికి ధనమదంతో విర్రవీగుతున్న ధనవంతుడు కనిపించాడు. అతడు అంతులేని సుఖభోగాలు అనుభవిస్తూ, ఎవ్వరికీ రవ్వంత కూడ సాయం చేయకుండా జీవిస్తున్నాడు. కాని అతనితో ఆప్యాయంగా మాట్లాడేవారేకరువయ్యారు. కుటుంబ సభ్యులు కూడ విచ్చల విడిగా ధనాన్ని ఖర్చుపెడుతూ ఆయనను లెక్కచేయడంలేదు. తెలియని వంటరితనంతో మానసికంగా యమయాతన అనుభవిస్తున్నాడు. తరువాత ఆవేశపరుడైన ఒకయువకుడు కనిపించాడు. అతను తన క్రోధ స్వభావం వల్ల చీటికి మాటికి ఎవరినిపడితే వారిని కసురుకుంటున్నాడు. ప్రతి చిన్న విషయానికి కోపం తెచ్చుకుంటూ తనలోతానే దహించుకుపోతున్నాడు. అతనికి స్నేహితులేకరువయ్యారు. తరువాత పరమలోభి అయిన వ్యక్తి కనిపించాడు. అతడు తనలోభత్వంవల్ల అయిన వాళ్లకు, పరాయివాళ్లకు అందరకు విరోధి అయ్యాడు. అందరు చులకనగా చూస్తూ హేళన చెయ్యడం మొదలుపెట్టారు. ఈ నీచమైన పరిస్థితిని అతడు భరించలేకపోతున్నాడు. మానసికంగా కృంగిపోతున్నాడు.*

*పై ముగ్గురుకూడ తమకు తెలియకుండానే భూలోకంలోనే, బ్రతికిఉండగానే నరకంఅనుభవిస్తున్నారు. కాని పాపం వారికావిషయం తెలియడంలేదు. తప్పునుమాత్రం ఇతరులపై రుద్ది మరి కొంతవేదనచెందుతున్నారు. వారిని చూచి శిష్యుడు చాల జాలిపడ్డాడు. గురువు శిష్యునికి మామూలుదృష్టిని ఇచ్చాడు. శిష్యుని మనస్సులో అనేకమైన ఆలోచనలు మెదలసాగాయి. మానవుడు తనకుతానుగా, తన కోసమే బ్రతకరాదని తెలుసుకున్నాడు. పరోపకారం చేస్తూ, పరులకోసం జీవించడంలోనే ఆనందం ఉందని గ్రహించాడు. లోభత్వం మనిషిని పతనానికి తీసికొని వెళ్తుందని అర్థం చేసుకున్నాడు. పరిస్థితులను తనకు అనుగుణంగా మార్చుకుంటూ భూలోకంలోనే స్వర్గాన్ని అనుభవిస్తూ హాయిగా జీవించాడు. గురువు ప్రేమగా ఆశీర్వదించాడు.*

**వివేకానికి ఆత్మతో సంబంధం కలిగిఉంటుంది.**

ధారావాహిక : భక్తిగాథ-15

# భక్తుని జీవితం నిర్ద్వంద్వము, సహజం

విష్ణు సభాసదుడైన దేవర్షి వాణిలో అద్భుతమైన రసముంది. వారి మాటలు అందరి హృదయసాగరంలో విలీనమయ్యాయి. కొద్ది క్షణాలు అందరికీ భావసమాధి కలిగింది. క్రతుమహర్షి మాటలతో అందరూ చైతన్యవంతులయ్యారు. క్రతు మహర్షి ఇలా అన్నారు- "దేవర్షీ ! భక్తి అంతశ్చేతనలో లీనమైనపుడు లోకమూ, వేదమూ ఏదీ ఉండదు కదా ! వెంటనే పులహమహర్షి అది కూడ సంభవమే నంటూ ఇంకా ఇలా అన్నారు." భావుకత మహాభావములో సంవర్తనమై పరిపక్వ ప్రేమతో ప్రతిష్ఠితమైనపుడు విధి నిషేధాలంటూ ఏవీ ఉండవు. ఆత్మబోధ ప్రగాఢమై దేహబోధ మాయమౌతుంది. భక్తుడు భగవన్మయుడౌతాడు. అటువంటపుడు ఆచారవిధానాలెక్కడుంటాయి? కఠోరకర్మలు ఎలా చేయగలుగుతారు?

పులహ మహర్షి అడిగిన ఈ ప్రశ్నకు దేవర్షి మౌనం వీడారు. హృదయంలో ఝంకృతమైన భక్తి భావన వాక్కు ద్వారా వెలువడింది-

లోకోపి తీవదేవ జంతు భోజనాది-

వ్యాపారస్త్వా శరీరధారణా వధి (14)

"లౌకిక కర్మలు బ్రహ్మజ్ఞానము కలిగేవరకు విధి పూర్వకంగా చేయాల్సిందే. కానీ భోజనాదికార్యాలు శరీరమున్నంతవరకు జరుగవలసిందే." ఈ సూత్రాన్ని ఉచ్చరిస్తూ దేవర్షి ఋషులలోని దివ్యత్వాన్ని దర్శిస్తూ ఇలా అన్నారు "ఈ సూత్రము క్రిందటి సూత్రానికి ఉత్తరభాగము, ఈ రెండుసూత్రాలనుకలిపి తెలుసుకోవాలి. నియమాలను కానీ మర్యాదలను కానీ అవహేళన చేయరాదు. కానీ భావనామయమైన చేతన భక్తిలో ప్రతిష్ఠితమైనపుడు బాహ్యమైన ఆచారాలన్నీ వాటంతటవే విడిపోతాయి. శరీరమున్నంత వరకు శరీర రక్షణ కొరకు ఆహారవ్యవస్థ అవసరము."

దేవర్షి మాటలకు మహర్షులైన క్రతువు, పులహుడు తమ సహమతిని తెలిపారు. అప్పుడే హిమాలయాల్లో కూడ హిమపక్షుల కలరవ ధ్వని ప్రతిధ్వనించింది. వాతావరణం కోలాహలమైంది. గాయత్రీ మహాసిద్ధుడు బ్రహ్మర్షి విశ్వామిత్రునిలో ఉత్కంఠ కలిగింది. ఇది గమనించిన దేవర్షి విశ్వామిత్రుల వారితో ఇలా అన్నారు- "మహర్షీ! మీరు ఎన్నో రహస్యవిద్యలను తెలిసినవారు, మీ ప్రవచనంలో మమ్ము కృతార్థులను చేయండి."

దేవర్షి అభ్యర్థనను మన్నించి బ్రహ్మర్షి చెప్పడం మొదలు పెట్టారు- "వివిధములైన తపస్సులకన్న, విద్యలకన్న, భక్తిశ్రేష్ఠమైంది, భక్తిని మించినదేదీ లేదు. ఇటువంటి పరమభక్తుడైన అరణ్యకముని యొక్క భక్తిమయ జీవితానికి నేను సాక్షిని. వారి భక్తిమయ గాథను గురించి చెప్తాను. దానికి దేవర్షి మేమందరము ఆ పరమభాగవతుని కథ వినాలని ఆతురతతో ఉన్నాము. ఆ కథతో మమ్మల్ని ధన్యుల్ని చేయండి. అందరికీ ప్రీతికరములైన దేవర్షి మాటలతో విశ్వామిత్రులవారు గత స్మృతులలో లీనమయ్యారు.

గత స్మృతులను గుర్తుచేసుకుంటూ విశ్వామిత్రులవారు కథ నారంభించారు- "ఆ రోజుల్లో నేను మిథిలా నగర సమీపంలోని సిద్ధాశ్రమంలో తపస్సు చేసుకుంటున్నాను. అనేకములైన ఆధ్యాత్మిక ఆవిష్కారాలను చేశాను. అప్పుడే నాకు అరణ్యకమునితో పరిచయమైంది. వారు సిద్ధాశ్రమానికి కొద్ది దూరంలో సాధారణకుటీరంలో నివసిస్తుండేవారు. మాయావులైన రాక్షసులూ, నిశాచరులూ, దైత్యులూ తమ ఘాతుక చర్యలతో ఋషులనూ, మునులనూ, మనస్వులైన తాపసులను భయభ్రాంతులను చేసేవారు. ఎప్పుడు ఏమౌతుందోనన్న భయం. అందరూ సమూహంగా ఉండడం ఉచితమని భావించారు. చాలా మంది సిద్ధాశ్రమంలో ఆశ్రయం పొందారు. వారి ద్వారానే అరణ్యకముని నిశాచరుల దౌర్జన్యాలమధ్య ఒంటరిగా ఉన్నాడని తెలిసింది. వారి వద్ద అస్త్ర శస్త్రాలుగానీ, రక్షకులూ, సహాయకులుగానీ లేరు.

మునులమాటలు విని నేను స్వయంగ వారిని కలవాలని వెళ్ళాను. తేజోవంతుడూ, తపోనిష్ఠుడూ, పరమభక్తుడైన అరణ్యక మునిని చూశాను. పెదవులపై నిరంతరము భగవతి ధ్యానము, హృదయంలో కరుణామయి మాత సౌందర్యము. వారి రోమరోమాలూ భగవతి ప్రేమతో పులకించిపోతున్నాయి. వారి మనస్సులో ఎవరిని

**వివేకం ఆత్మయొక్క పిలుపు.**

గురించి ద్వేషముగానీ, రోషముగానీ లేవు. భయమనే తత్వము ఆయన వ్యక్తిత్వంలోనే లేదు. అద్భుతమైన ఆ ముని శ్రేష్ఠుని చూచి ఆయనకు నమస్కరించాను. ఎంతో వినమ్రతతో వారు నన్ను గురించి తెలిసికొని పాదాభివందనం చేసి ఇలా అన్నారు– నేను జగన్మాత యొక్క అబోధ బాలకుణ్ణి. ఆ కరుణామయి మీ దర్శనం కలిగించడం నా భాగ్యము."

అరణ్యకముని కుటీరాన్ని నేను పరిశీలించాను. అక్కడ వస్తువులేమి లేవు బహుశ వీటిని సేకరించడం వారికిష్టముండక పోవచ్చు. కౌపీనమూ, ఒక రెండు వస్త్రాలు ఉన్నాయి. పరిస్థితిని చూచి నేను వారితో ఇలా అన్నాను– "మునివరా! మీరిచ్చట ఒంటరిగా ఉన్నారు. నిశాచరుల ఘాతుకాలు అరణ్యంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. మీరు కూడ అందరితోపాటు సిద్ధాశ్రమంలో ఉండండి. ఆ స్థలము సురక్షితమైంది. సాధనలు చేసుకోడానికి అనుకూలమైంది. అచ్చటైతే మీరు సుఖ పూర్వకంగా సాధన చేసుకోవచ్చు. ఏ విధమైన లోపమూ ఉండదు."

నా మాటలకు ఆయన చిరునవ్వుతో ఇలా అన్నారు– "మహర్షీ మీరు పరమజ్ఞానులు. సుఖ పూర్వక సాధన ఎక్కడైనా చేయగలమా? సుఖమూ, సాధనా ఈ రెండింటి కలయిక ఉంటుందా, ఇక నిశాచరులూ, మాయావులైన రాక్షసులూ వీరంతా మహా మాయ భగవతి కంటె కూడ మాయావులా? ఎవరి మాయయొక్క అతి చిన్న అంశతో ఇంతటి సృష్టి జరిగిందో, ఎవరి చైతన్యమునుండి ఒక కణము అందర్నీ చైతన్యవంతుల్ని చేసిందో అంతటి కరుణామయి మాత యొక్క బాలకుడు భయభీతుడవడం సిగ్గు చేటు. నేను జీవితంలో తపస్సును ఆర్జించలేదు. ఏ విధమైన విద్యలనూ అన్వేషించలేదు. కేవలము మాత యొక్క నామస్మరణ తీసుకున్నాను. ఇదే నా ధనము, నా జీవితము. ఏ దౌర్జన్యాలకో భయపడిగానీ, ఏ విధమైన సౌకర్యాల లోభముతోగానీ నేను నా భక్తినీ, నిష్ఠనూ కళంకితం చేయదలచుకోలేదు."

ఆ మహాభక్తుని వాణి ఎంతో తేజోద్దీప్తమైంది. దృఢమైన వాడు. ఇంత ఉన్నతమైన స్థితిలో కూడ ఆచార నిష్ఠత కలిగి నిత్యం నియమంగా చేసుకునే పనులను చాలా శ్రద్ధతో ఆచరించేవాడు. నెలల తరబడి భావసమాధిలో ఉన్నప్పుడు ఈ ఆచారనియమాలు శిథిలమయ్యేవి. శరీరరక్షణకు కొద్దిపాటి ఆహార వ్యవస్థ ఉండేది, శరీరరక్షణకు మీకు ఆహార వ్యవస్థ ఎలా జరుగుతుంది అని నేనడిగినప్పుడు ఆయన నవ్వి ఇలా అన్నారు "ఈ అఖిల విశ్వానికి వ్యవస్థాపకురాలైన జగదంబ నాకు తగిన రక్షణ చేకూరుస్తుంది.

## లక్ష్యం ఒక్కటే

*ఒకే పాఠశాలకు సంబంధించిన ముగ్గురు విద్యార్థులను మంచి చరిత్ర, మంచి ప్రవర్తన అన్న అంశంపై సన్మానించారు. ముగ్గురికి కలిపి ఒక నాణెమును బహూకరించారు. మీలోమీరు పంచుకోండి అన్నారు.*

*ఆ విద్యార్థులలో ఒకడు భారతీయుడు. రెండవవాడు పారసీ. మూడవ వాడు ఆంగ్లేయుడు. తన భాషలో నావాటా క్రిందనాకు "వాటర్ మెలన్" కావాలి అన్నాడు. పారసీ దేశస్తుడు తనభాషలో నాకు "హిందువానా" కావాలి అన్నాడు. భారతీయ విద్యార్థి "నాకు తరబూజా కావాలి" అన్నాడు. ఒకరిమాట మరొకరికి అర్థం కావటం లేదు. ఏంచేయాలో తోచక తికమక పడుతున్నారు.*

*చిట్ట చివరకు మూడు భాషలు తెలిసిన వ్యక్తి దగ్గరకు వెళ్లారు. తమ తమ కోరికలను తెలియచేశారు. అతడానాణాన్ని తీసికుని బజారుకు వెళ్లాడు. అదిపెట్టి తరబూజా పండు కొన్నాడు. ఇదిగో నీ 'వాటర్ మెలన్' అన్నాడు. అతడు సంతోషించాడు. ఇదే విధంగా మిగిలిన ఇద్దరిని పిలిచి వారి భాగాలు వారికిస్తూ 'ఇదిగో హిందువానా' 'ఇదిగో తరబూజా' అన్నాడు. ముగ్గురు బయటకు వచ్చి చూసుకున్నారు. వారికి ఆశ్చర్యం కలిగింది. ఆనందంతో ఎగిరిగంతేశారు. ముగ్గురి కోరికా ఒక్కటే. పగలబడి నవ్వుకున్నారు. చట్టాపట్టాలు వేసికొని వెళ్లిపోయారు.*

*ఈనాడు ప్రపంచ పరిస్థితికూడ ఇదే. ధ్యేయం అందరిదీ ఒక్కటే. కాని భాష, జాతి, దేశపు సరిహద్దులు చూచుకుంటూ భేద భావంతో రగిలిపోతున్నారు. ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారు. అందరిదీ మానవతావాదమే. ఈ భేదాలు మరచిపోయి మానవత్వానికి కట్టుబడిననాడు ఈ మారణకాండ ఉండదు.*

ఆ పరమభక్తుని మాటలు మహామంత్రంలాగ ఇప్పటికీ స్మరణలో ఉన్నాయి. ఆయన ఇలా చెప్పారు "ఎవరైతే అతి భయంకరమైన దుష్టులూ, కుట్రలుపన్నేవారు, శత్రువులూ ఐన వారి మధ్య నిశ్చింతగ, నిర్ద్వంద్వ భావంతో సహజమైన జీవనం జీవిస్తాడో అతడే నిజమైన భక్తుడు, మహర్షి విశ్వామిత్రుల అపూర్వవాణి అందరి మనస్సుల్లో భక్తి యొక్క పరమరహస్య మంత్రోచ్చారణలాగ తోచింది. అందరూ దీనినే మననం చేసుకుంటూ ఉండిపోయారు.

★★★

**బలంపై వివేకంయొక్క అదుపు అత్యవసరం.**

బోధకథ

# చిన్నపని చేయకూడదా?

1909 నాటి మాట. మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికాలో ఉంటున్న సమయం. ఆయనింకా స్వాతంత్ర్య సంగ్రామంలో అడుగుపెట్టనే లేదు. కాని సత్యాగ్రహ శాస్త్రాన్ని అక్కడే ప్రయోగించటం, సఫలత పొందటం జరిగింది. దాని ఫలితంగా దేశ విదేశాల్లో ఆయనను గురించిన చర్చలు ప్రారంభమయ్యాయి.

ఒకసారి గాంధీజీకి లండను వెళ్లే పని పడింది. అప్పటికే భారతీయ యువకులు లండనులో ఉన్నత విద్యల నభ్యసిస్తున్నారు. ఆయుధాలు లేకుండా పోరాడి విజయాన్ని సాధించిన భారతీయ సేనాని ఇక్కడకు వచ్చినాడన్న వార్త అంతా ప్రాకిపోయింది. ఆ అద్భుతసేనానిని చూడాలని, ఆయనతో ముచ్చటించాలని భారతీయ విద్యార్థి బృందం సంకల్పించింది.

భారతీయ విద్యార్థి బృందనాయకుడు వచ్చి గాంధీజీని కలుసుకున్నాడు. తాము జరుపబోయే సన్మానసభలో తప్పక పాల్గొనాలని చెప్పి ఒప్పించుకున్నాడు. అంతేకాదు, ఆ సభకు అధ్యక్షుడిగా కూడ ఉండాలని కోరాడు. వాళ్ల ఉత్సాహంచూచిన గాంధీజీ కాదనలేకపోయాడు. అన్నింటికీ సరేనన్నాడు. ఆనాటి సభకు విచ్చేసిన వారందరికీ విందుభోజనం ఏర్పాటు చేశారు. గాంధీజీ భోజనానికి రావటానికి అంగీకరించారు. కాని రెండు షరతులు పెట్టాడు. "పొరపాటున కూడ మాంసం అనేది ఉండనే కూడదు. మద్యం అనేది తేకూడదు" అని. వారా షరతులకు సరే నన్నారు.

సన్మానసభ నిర్ణయించిన రోజు రానే వచ్చింది. విద్యార్థులంతా తమ తమ పనులలో హడావుడిగా తిరుగుతూ ఉన్నారు. సన్మానాన్ని తలపెట్టిన బృందానికే వంట వండటంతో పాటు పాత్రలు శుభ్రం చేయటంలాంటి పనులను కూడ అప్పగించారు. ఆ బృందంతో పాటు బక్కపలచటి శరీరంతో ఒక భారతీయ యువకుడు కూడ పనిలో పాలు పంచుకుంటున్నాడు. గిన్నెలు, పళ్లాలు చురుగ్గా శుభ్రపరుస్తున్నాడు. వంట వండేవారికి ఏది కావాలంటే అది వెంట వెంటనే అందిస్తున్నాడు.

భోజనాలు ప్రారంభమయ్యాయి. ఇతర విద్యార్థులు కూడ అతిథిలుగా వచ్చి భోజనాలు చేస్తున్నారు. వారు తిన్న పళ్లాలను తెచ్చి కడిగేవారిదగ్గర పెట్టిపోతున్నారు. వారందరితోపాటు ఆ యువకుడు ఎంగిలి పళ్లాలను శుభ్రం చేస్తూనే ఉన్నాడు. పనుల హడావుడిలో ప్రక్కవాడిని గురించి ఒక్కరూ పట్టించుకోవటంలేదు.

ఇంతలో విద్యార్థి సంఘనాయకుడు వచ్చాడు. ఆ యువకుడు ఒక ఎంగిలి పళ్లెం కడుగుతున్నాడు. ముఖం అటువైపు తిరిగి ఉంది. "త్వరగా కానీయ్ ఫ్రెండ్. గాంధీజీ వచ్చేసమయమైంది. మనమందరం సిద్ధంగా కూర్చుని ఉండాలి." అన్నాడు ఆత్రంగా.

ఆ యువకుడు చేతిలో పళ్లెం కడిగి అక్కడపెట్టి చిరునవ్వుతో తలయెత్తి చూచాడు. అంతే ఆ యువకుడు అవాక్కయ్యాడు. దేహమంతా చిరు చెమటలుపట్టాయి. ఒక్కక్షణంలో తేరుకున్నాడు. రెండు చేతులు జోడించి నమస్కారం చేస్తూ "గాంధీజీ ! మీరు– మీరీ పనిని చేయటమేమిటి? మావాళ్లు తెలియక చేసిన పనికి క్షమించండి" –అంటూ చేయిపట్టుకుని వేదికపైకి తీసికొనివెళ్లాడు. ఇదంతా చూస్తున్న విద్యార్థులు గజ గజలాడి పోయారు.

వేదికపైకి చేరగానే విద్యార్థి నాయకుడు సభాముఖంగా గాంధీజీని క్షమాపణకోరాడు. "మిత్రమా ! బాధపడకు. నాకీ పనిని ఎవ్వరూ పురమాయించలేదు. నేనే స్వయంగా, ఇష్టపూర్తిగా ఎంచుకుని చేశాను. ఇక్కడి విద్యార్థుల ఉత్సాహం నన్నుకూడ ప్రోత్సాహపరిచింది. వారితోపాటు కలిసి పనిచేయాలన్పించింది. చేశాను. గతంలో ఎవ్వరూ నన్ను చూడకపోవటాన నన్ను గుర్తించలేకపోయారు. అంతే కాని మరేమీ లేదు. మనం మన కుటుంబాలలో ఈ పనులన్నీ చేసికుంటూనే ఉంటాము కదా ! ఇదీ ఒక కుటుంబంలా అనిపించింది. మనస్ఫూర్తిగా చేశాను. ఈ మాత్రం చిన్న పనిని చేయగూడదా? నీవు అనవసరంగా బాధపడకు" –అంటూ ఆతని వీపు తట్టి సముదాయించారు గాంధీజీ.

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత*
*ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

**బలానికి వివేకంతోడైతే వ్యవస్థ చక్కబడుతుంది.**

ధారావాహిక : దేవసంస్కృతీ సౌరభం-20

# కర్మకాండ, పూజాపద్ధతులు

**విగ్రహారాధన :** చిత్తాన్ని ఏకాగ్రపరచడానికి ఒక అమూల్యమైన సాధనం.

భారతీయసంస్కృతిలో ప్రతీకవాదానికి- విగ్రహాన్ని పూజించే పద్ధతికి- గొప్పస్థానంఉంది. అందరికి తేలికయిన, తిన్ననైన పూజాపద్ధతిని అందించిన కీర్తి భారతదేశానికే దక్కుతుంది. పూజాపద్ధతి, సరళమైనవిధానాలు హిందూధర్మంలో ఉన్నట్లుగా మరి ఏసంప్రదాయాలలోనూ లేవు. హిందువుల కుశాగ్రబుద్ధి, వివేకం, మనోవిజ్ఞానమునకుచెందిన అపూర్వజ్ఞానాలు హిందూధర్మమునకు చెందిన మూల వైజ్ఞానిక సిద్ధాంతాలలో కనబడతాయి. విగ్రహారాధన అటువంటి ప్రతీక అయిన పూజాపద్ధతియే.

విగ్రహారాధన అంటే ఏమిటి? రాయి, మట్టి, లోహం, చిత్రం మొదలైన వాటితో చేసిన బొమ్మను సాధనంగా చేసుకొని సర్వవ్యాపకమైన, అనంతం ఐన శక్తులతో, గుణాలతో కూడిన పరమాత్మను మనముందు దర్శించడం. నిరాకారబ్రహ్మయొక్క మానసచిత్రాన్ని రూపొందించడం చాలా కష్టం. గొప్పయోగులు, తత్త్వవేత్తలు, తపోమూర్తులు ఆ పని చేసిచూపించారు. కానీ సామాన్యులకు ఆపని అసాధ్యం. భావుకులైన భక్తులకు, ముఖ్యంగా స్త్రీలకు ఏదోవిధమైన విగ్రహం ఆధారంగా ఉంటేనే ఉపాసనలో గొప్ప సహాయం లభిస్తుంది. మనోచింతన, ఏకాగ్రతలకు సౌకర్యం కలిగించు తలపుతోనే ప్రతీకరూపంలో విగ్రహారాధన విధానం ఏర్పాటుచేయబడింది. సాధకుడు తన శ్రద్ధను అనుసరించి భగవంతునియొక్క ఏదో ఒక రూపాన్ని ఎంచుకొని సాధన కొనసాగిస్తాడు. ఆ మూర్తి మన అంతఃకరణలో భగవద్భావనలను, భక్తిని రేకెత్తిస్తుంది. కనుక దానికి ప్రాధాన్యతను ఇవ్వవలసిందే. ఆ విధంగా ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా భగవంతుని స్మరించుకోవచ్చును. ఐతే దేవాలయంలోని విగ్రహం ముందు సునాయాసంగా కలిగే ఆనందం మరెక్కడాకలుగదు. గంగాతీరంలో కూర్చున్నప్పుడు కలిగే పవిత్రశక్తి మరెక్కడ కూర్చున్నా కలుగదు.

విగ్రహారాధనతోబాటు ధర్మమార్గంలో సిద్ధాంతమయమైన ప్రగతిని సాధించడానికి మనవద్ద త్యాగానికీ, సంయమనానికి ఎక్కువ ప్రాధాన్యత నియ్యడం జరిగింది. పదహారు సంస్కారాలు, వివిధరకాలయిన ధార్మిక కర్మకాండ, వ్రతాలు, జపం, తపం, పూజ, అనుష్ఠానం, తీర్థయాత్రలు, దాన, పుణ్యాలు, స్వాధ్యాయ, సత్సంగాలు మొదలైనవి కూడా దివ్యమైన ప్రయోజనాలను కలిగిస్తాయి. వీటివల్ల మనిషిలో దివ్యత్వం, వ్యవస్థలు ఏర్పడతాయి, మనస్సు గట్టిపడి దివ్యత్వంవైపునకు సాగుతుంది. ఆధ్యాత్మికతయొక్క చెప్పుచేతలలో ఉండే అభ్యాసం కలుగుతుంది.

మూలము (వేరు) అన్నింటికీ ఆధారమన్నది ఆది గురువైన శంకరాచార్యుల మతం, ఆమూలాన్ని సేవించకపోతే ఏపనీ జరగదు. ఇతరుల ఆత్మ ప్రసన్నతకోసం, ఆ ఆత్మకు ఆశ్రయమైన జడశరీరాన్ని, దాని అంగాలను, సేవించవలసివస్తుంది. పరమాత్మను ఉపాసించడానికి కూడా ఆతనికి ఆశ్రయమైన జడప్రకృతిని పూజించవలసివస్తుంది. మనం గాలిని, నిప్పును, నీటిని, నేలను, వెలుతురును పూజించటం వల్ల ఎంతోలాభం పొందుతాం. అటువంటప్పుడు విగ్రహాన్ని పూజించడానికి ఎందుకు భయపడాలి? దాని ద్వారానే ప్రతి అణువులో వ్యాపించిన చైతన్య సచ్చిదానందాన్ని పూజించడం జరుగుతోంది. మీరు ఏ బుద్ధిలేక మనస్సునకు ఆధారమైన పరమాత్మ జడముకాదా? పరమాత్మకూడా జడప్రకృతిలేకుండా ఏమీ చేయలేదు, సృష్టికూడా చేయలేదు. దీనినిబట్టి జడ, చేతనాలకు పరస్పరసంబంధముంది అని తేలుతుంది. అటువంటప్పుడు పరమాత్మ ఏదైనా విగ్రహం లేకుండా ఎట్లా పూజింపబడతాడు?

విగ్రహాలు దేవాలయాలలో స్థాపింపబడతాయి. వాటిలో భావుకులైన భక్తులు పూజలు, వందనాలు, అర్చనలు జరపడానికి వెడతారు. అక్కడగల భగవానుని మూర్తియందు చిత్తాన్ని ఏకాగ్రం చేస్తారు. ఇంట్లో కుటుంబానికి చెందిన అనేక చింతలు మనసునిండా ఉండడంవల్ల పూజ, అర్చన, ధ్యానాదులు దేవాలయంలోని ప్రశాంత

మానసిక పరిపుష్టికి సాధనాలు-విద్య అంతర్ దృష్టి.

వాతావరణంలో జరిగినంత చక్కగా జరుగవు. మంచివాతావరణం యొక్క ప్రభావం మనలోని మంచి వృత్తులను శక్తివంతంచేస్తుంది. దేవాలయం యొక్క సాత్విక వాతావరణంలో చెడు వృత్తులు వాటంతట అవి నీరసపడిపోతాయి. అందువల్లనే హిందూసంస్కృతిలో దేవాలయాల స్థాపనకు ఎంతో ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. అది ఎంతో తగినదికూడా.

దేవాలయాలలో అనాచారాలు జరుగుతాయని కొందరంటున్నారు. రోజురోజుకీ వాటిసంఖ్య పెరిగిపోతోందనీ, వాటిమీద ఖర్చు ఎక్కువౌతోందనీ, వాటిని ఆపివేయాలనీ చెబుతున్నారు. వారు చెబుతున్నవాటిలో కొన్ని నిజమేకావచ్చు. కానీ దేవాలయాలను మూసివేయడంవల్లగానీ, లేక ప్రభుత్వం ద్వారా అవి నిర్వహింపబడడం వల్లగానీ తగిన మార్పులను, మంచి పద్ధతులను తీసుకురావాలి. ఈనాడు మన దేవాలయాలలో వాటి అవసరమెంతైనా ఉన్నది. దేవాలయాలు స్వచ్ఛమైన నైతిక శిక్షణాకేంద్రంగా మారాలి. దేవాలయాలలో చదువుకున్న పూజారులను నియమించాలి. వారు విగ్రహారాధన చేయడంతోబాటు ప్రజలకు ధార్మిక గ్రంథాలలో ఆచారశాస్త్రాలను, నీతి, జ్ఞానాలలో శిక్షణను ఇవ్వగలవారైఉండాలి. ఆ పూజారుల నడవడి ప్రజలకు ఆదర్శం కావాలి.

★★★

## మా గురువుగారికి కూడ కనపడాలి

*బీహారు ప్రాంతంలో మలిదాసు అనే పిల్లవాడు గోవులను మేపుతూ ఉండేవాడు. ఒకరోజు దాహంవేసి నదిదగ్గరకు వెళ్లాడు. అక్కడ ఒక బ్రాహ్మణుడు స్నానం చేసి, ఒడ్డున కూర్చుని, ప్రాణాయామం చేసుకుంటున్నాడు. బాలుడది వింతగా చూశాడు. పూర్తిఅయ్యేదాక అక్కడే కూర్చున్నాడు. బ్రాహ్మణుడు లేచిపోతున్నాడు. మలిదాసు వెళ్లి అతని కాళ్లను గట్టిగా పట్టుకున్నాడు. అయ్యా ! ఇప్పటిదాకా మీరు చేసిందేమిటి? ముక్కుమూసుకున్నారెందుకు? అని అడిగాడు. నేను ముక్కుమూసుకుని దేవుడిని ప్రార్థించాను అని చెప్పాడు. ఏమని ప్రార్థించారు? అడిగాడు బాలుడు. గాయత్రి మంత్రం చదివాను అన్నాడు. గాయత్రి మంత్రం అంటే ఏమిటి? అని అడిగాడు. అవన్నీ నీకు తెలియవు. నీకురావు అన్నాడు బ్రాహ్మణుడు. అయితే నేనేం చెయ్యాలో చెప్పండి. అందాకా వదిలిపెట్టను అన్నాడు. బ్రాహ్మణుడు విసుక్కుంటూ ముక్కుమూసుకొని నదిఒడ్డున కూర్చో అని చెప్పివెళ్లిపోయాడు.*

*వెంటనే మలిదాసు నదిలో కాళ్లు కడుక్కుని ఒడ్డున కూర్చున్నాడు. ముక్కు మూసుకున్నాడు. కొద్దిసేపు చూచాడు. దేవుడు రాలేదు. గట్టిగా మూసుకోవాలిగావచ్చు అనుకొని గట్టిగా మూసుకున్నాడు. ఊపిరి ఆడడంలేదు. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. దేవుడికి జాలివేసింది. శంఖం చక్రాలను ధరించిన విష్ణుమూర్తి వచ్చి ఎదురుగా నుంచున్నాడు. నువ్వు ఎవరు? అని అడిగాడు మలిదాసు. నేను దేవుణ్ణి అన్నాడు విష్ణువు. ఇద్దరం ఆడుకుందాంరా అన్నాడు. కాసేపు ఆనందంగా ఆడుకున్నారు. మరోరోజు ప్రొద్దున్నే వచ్చిమళ్లీ కూచున్నాడు. మళ్లీ వచ్చాడు దేవుడు. కొంచెంసేపు ఉండు. మా గురువుగారిని పిలుచుకు వస్తాను అన్నాడు. మళ్లీ వెనుకకు వచ్చి నువ్వు వెళ్లిపోతావేమో ! అంటూ ఆవుమెడలోని తాడు తెచ్చి చెట్టుకు కట్టి వెళ్లాడు. బ్రాహ్మణుణ్ణి వెంటబెట్టుకొని వచ్చాడు. గురువుగారూ ! దేవుణ్ణి ఈ చెట్టుకు కట్టివేశాను చూడండి అన్నాడు. బ్రాహ్మణుడికి దేవుడు కనిపించడంలేదు. మలిదాసుకు కన్పిస్తున్నాడు. మా గురువుగారు చెప్పినందుకే నిన్ను పిలిచాను. నాకు కనిపించి, ఆయనకు ఎందుకు కనబడవు? అని ప్రశ్నించాడు. అతని మనసునిండా గర్వం ఉంది. అదిపోతేగాని కనపడను అన్నాడు దేవుడు. ఆ మాటలువిన్నాడు బ్రాహ్మణుడు. ఒక్కసారిగా బాలుని పాదాలపై బడి ఏడ్చాడు. దేవుణ్ణి చూపించవా? అన్నాడు. మలిదాసు దేవుడితో "పాపం మా గురువుగారికి కూడకనపడు. లేకపోతే కట్టినతాడు విప్పనే విప్పను. ఇక్కడే ఈ చెట్టుకిందే ఆకలితో పడిఉండు" అన్నాడు. దేవుడు నవ్వుతూ బ్రాహ్మణుడికి కూడ దర్శనం ఇచ్చి వెళ్లిపోయాడు. మలిదాసు భక్తిమలినం లేనిది.*

**అదుపులో ఉన్న ఇంద్రియాలు మనిషికి నిజమైన మిత్రులు.**

తత్వచింతన

# మానవ జీవనం-ఈశ్వర విశ్వాసం

మహాభారత యుద్ధానికి ఇంకా కొద్ది రోజుల సమయం ఉంది. కౌరవులు, పాండవులు ఎవరి ఏర్పాట్లలో వారున్నారు. యుద్ధంలో తమవైపు రమ్మని రాజులను ఆహ్వానిస్తున్నారు. కృష్ణ భగవానుని ఆహ్వానించడానికి అర్జునుడు, దుర్యోధనుడు ఒకేసారి వచ్చారు. ఒకవైపు శస్త్రరహితుడినైన నేను, మరోవైపు అస్త్ర శస్త్రాలతో కూడిన నా సమస్త సైన్యం. ఎవరుకావాలో తేల్చుకోమని వారికే వదిలేశాడు. నిరాయుధుడైన శ్రీకృష్ణుని దుర్యోధనుడు స్వీకరించలేదు. శ్రీకృష్ణుడు తమవైపు ఉండటం చూసి అర్జునుడు లోలోపలే సంతోషించాడు. అర్జునుడు భగవంతుని తన సారధిగా ఎన్నుకున్నాడు. భీషణ సంగ్రామం జరిగింది. చివరికి పాండవులు గెలిచారు. కౌరవులు ఓడిపోయారు. యుద్ధం చేయకుండా కేవలం సారధిగా మాత్రమే ఉండి కృష్ణ భగవానుడు పాండవులను గెలిపించాడు. శక్తివంతమైన సైన్యాన్ని పొందికూడా కౌరవులు ఓడిపోవలసివచ్చిందనడానికి చరిత్రయే సాక్షి. భగవంతుని ముందు సైన్యబలము గొప్పదిగా భావించి భగవంతుని వదిలివేయడం దుర్యోధనుడుచేసినతప్పు.

కాని ఈనాడు మనమందరం కూడా దుర్యోధనుల లాగా తయారై నిరంతరం అదే తప్పు చేస్తూ ఉన్నాం. భగవంతుడ్ని ప్రక్కన పెట్టి సాంసారికశక్తులు, భౌతికసంపదల బలంతోనే జీవన సంగ్రామంలో విజయం సాధించాలని అనుకుంటున్నాం. మనం కూడా భగవంతుడు మరియు ఆయన భౌతిక-దైవీశక్తుల రెండింటిలోను దుర్యోధనుని లాగే ఆయనను ఉపేక్షించి సాంసారిక శక్తులకే ప్రాధ్యాన్యతనిస్తూ వస్తున్నాము. కాని దీనివలన కౌరవులలాగే అపజయం పాలుకాకతప్పదు.

నిజానికి భౌతిక శక్తులవరకే పరిమితం కాకుండా పరమాత్మను తమ జీవన రథసారథిగా చేసుకున్నవారినే విజయం వరిస్తుంది. ఆయననే జీవనభృతిగాచేసుకొని మనిషి జీవనసంగ్రామంలో విజయంసాధిస్తాడు. ఈశ్వరుని మరచిపోయి సంసార పడుగు పేకలను నేస్తూ, మనసులో గాలి మేడలు కట్టుకుంటూ. కాల్పనిక జగత్తులో ప్రపంచ సరిహద్దులను తొలిచే ప్రణాళికలు వేస్తూ ఉంటాము. కాని అడుగడుగునా ఎదురుదెబ్బలు తినవలసి వస్తూ ఉంటుంది. గాలి మేడలు ఒకే దెబ్బతో కూలిపోతుంటాయి. కల్పనల పరదా తొలగిపోతుంది. అంతా దిగజారిపోతుంది. చివరికి పశ్చాత్తాప పడవలసి వస్తుంది. దుర్యోధనుడు, రావణుడు, హిరణ్యకశిపుడు, సికిందర్ మొదలైన పెద్దపెద్దవారంతా పశ్చాత్తాపపడుతూనే వెళ్లిపోయారు. భగవంతుని ప్రపంచములోనే ఉంటూ ఆయననే మరచిపోయి, శక్తులకు ప్రాధ్యాన్యతనివ్వడం వల్ల ఏం లభిస్తుంది? సంసారరణరంగంలోదూకి మనం ఎంతగాఅంధులుగా తయారవుతామంటే ఈ సమస్త సృష్టికి స్వామి అయిన భగవంతుని ఆశీర్వాదం తీసుకునే మాట అటుంచితే కనీసం ఆయనకు స్మరించుకోను కూడా స్మరించుకోము. భౌతిక స్థూలశక్తులకే ప్రాధాన్యత ఇచ్చి పోరాడుతూ ఉంటాము. అలాంటి అహంకారులు ఎన్ని విజయాలు పొందినా వారి అంతిమ విజయం సందిగ్ధంగానే ఉంటుంది.

ఈనాడు మానవ జీవన దయనీయ స్థితికి లభిస్తున్న సంతాపం, దుఃఖం, అపజయాలకు మూలకారణం ఈశ్వర విశ్వాసం లేకపోవడం, మరియు భౌతిక సంసారిక ప్రాధాన్యత ఇవ్వడం.

ఈశ్వర విశ్వాసానికి శ్రద్ధ అనివార్యం. భౌతిక జీవనం మరియు శారీరిక క్షేత్రంలో ప్రేమకు పరిమితి ఉంటుంది. ఈ ప్రేమ ఆంతరిక లేదా ఆత్మిక క్షేత్రంలో పని చేయడం మొదలుపెడితే దానినే శ్రద్ధ అంటారు. ఈ శ్రద్ధే ఈశ్వరవిశ్వాసానికి మూలాధారము. శ్రద్ధ ద్వారానే ఆ విరాట్ అనుభూతి పొందగలం. శ్రద్ధ జీవన నౌకను భగవంతుని చేతిలో పెడుతుంది.. జీవితం భగవంతుని చేతిలో పడ్డాక వారికిక భయమెందుకు? భయంఅనేది బలహీనమైన తమకాళ్లుచేతులు మరియు సాంసారిక శక్తులను నమ్ముకున్న వారికే కలుగుతూ ఉంటుంది. భగవంతుని కొంగు పట్టుకొని నడిచేవారికి భయం ఉండదు. వాళ్ల జీవితమంతా భగవంతుని వెలుగుతో నిండిపోతుంది. జీవన వ్యాపారంలో ప్రతిమెట్టుకు ప్రభువు ప్రేరణ లభిస్తుంది. వారి చరిత్ర దివ్య గుణాలలో సంపన్నమవుతుంది. స్వయంగా పరమపితకు యువరాజుగా తయారవుతారు. వారికి

**అదుపులేని ఇంద్రియాలు మనిషికి బద్ధశత్రువులు.**

సంసారం అంతా చప్ప చప్పగా, నిస్తేజంగా, బలహీనంగా, క్షుద్రంగా కనిపిస్తుంది. కాని ఇదంతా శ్రద్ధతోనే సంభవం.

పరమాత్మ శక్తి, కృపల మీద అచంచలమైన విశ్వాసం ఉండటమే శ్రద్ధ. ఏ విధంగా ఈ విశ్వాసం కలుగుతుందో అదేవిధంగా ప్రభువు యొక్క విరాట్ స్వరూపం సర్వత్రా ప్రకాశిస్తూ ఉంటుంది.

స్థూల జగత్తులోని సమస్త కార్యాలూ ఈశ్వరేచ్ఛ మరియు విధానానికి అనుగుణంగానే జరుగుతూ ఉంటాయి. వైజ్ఞానికులు, దార్శనికులందరూ కూడా ఈ సత్యాన్ని ముక్త కంఠంతో అంగీకరిస్తూ ఉంటారు. చెప్పే పద్ధతులు వేరువేరుగా ఉండవచ్చు. కాని ఈ సమస్త వ్యాపారమంతా ఏదో ఒక అదృశ్యశక్తిద్వారా జరుగుతుందనేది సత్యం. మన జీవితం కూడ ఈశ్వరేచ్ఛారూపమే. కాబట్టి జీవితంలో ఈశ్వర విశ్వాసంతో పాటు సమస్త కార్యాలలో ఆయన ఇష్టానికే ప్రాధాన్యత ఇవ్వాలి.

మానవుని శక్తి అత్యల్పం. అది అహంకారశక్తి. కౌరవులు, బకాసురుడు, హిరణ్యకశిపుడు అనేక మంది అసురులు తమ సాంసారిక బలానికి, అహంకారానికి తల ఒగ్గి ఈశ్వరుని శక్తిని ఉపేక్షించారు. అందుకు చివరికి పశ్చాత్తాప పడుతూ నిష్క్రమించారు. మనం చైతన్యవంతులమై జీవన రథాన్ని భగవంతుని చేతులలో పెట్టాలి. పరమపిత సంరక్షణలో విజయ యాత్రకు సిద్ధం కావాలి. ప్రతి శ్వాస, ప్రతి గుండె చప్పుడులోనూ ఈశ్వరుని అమర సంగీతం వినిపించాలి.

★★★

## కర్మసిద్ధాంతం గంభీరమైనది

*మన ఆలోచనలే మన మనస్సును సంస్కరిస్తాయి. అవే మన జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. ఒక యువసన్యాసి ఇంటింటికి తిరిగి భిక్షతెచ్చుకొనేవాడు. ఒక వ్యాపారస్థుని ఇంటికి రెండు మూడుసార్లు భిక్షనిమిత్తం వెళ్లాడు. వ్యాపారి ఎప్పుడూ ధన సంపాదనలోపడి గ్రామాలు తిరుగుతూఉండేవాడు. ఆయన భార్య చక్కని చుక్క. వయస్సులో ఉంది. ఒకనాడు సన్యాసితో చిన్న చిన్న భిక్షలు ఎందుకు అడుగుతావు? నేను నీ వెంటరావడానికి సిద్ధంగా ఉన్నాను. నన్ను తీసికొనిపో అంది. సన్యాసి వివేకవంతుడు. కాని మనస్సులో కొద్దిపాటి కోరిక జనించింది. అయినా నిబ్బరంగా అన్నాడు– నాకు కూడ నువ్వంటే ఇష్టమే, కాని వివేకాన్ని, ధర్మాన్ని వదలను. నిన్ను నావెంట తీసికొనిపోలేను. కొంతకాలానికి ఇద్దరూ మరణించారు. కాని వారిమనసుల్లో కలిగినకోర్కెమాత్రం వారిని వెన్నంటేఉంది. ఆమె చేసిన పుణ్యకార్యాలఫలితంగా రాజకుమారిగా జన్మించింది. సన్యాసి తన అధ్యాత్మభావాలకు అనుగుణంగా సాధువుగానే జన్మించాడు.*

*ఒకనాడు సాధువు మహావీరుని వద్దకువెళ్లి సన్యాసం ఇవ్వమనికోరాడు. దానికి మహావీరుడు నీవు చేయాల్సినపని ఒకటి మిగిలిఉంది. అది పూర్తికాగానే ఇస్తాను అన్నాడు. ఏంచేయాలో తోచక సాధువు రాజుగారి తోటలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఇంతలో రాజకుమారి అటుగావచ్చి సాధువును చూచింది. చూడగానే ప్రేమపుట్టుకొచ్చింది. సాధువు పరిస్థితీ అదే. మాటలు కలిశాయి. ఇద్దరు వివాహం చేసికున్నారు. మహావీరునకు నమస్కరించారు. మహావీరుడు ఆశీర్వదిస్తూ– "మీరు చేసింది తప్పుకాదు. గతజన్మలో కలిగిన మీ కోరిక ఇలా సిద్ధించింది. గృహస్థ జీవితాన్ని కొనసాగించండి" అన్నాడు. కొంతకాలానికి కుమారుడు జన్మించాడు. 5 సంవత్సరాల వయస్సు వచ్చింది. ఆడుకుంటూ ఆడుకుంటూ తండ్రిదగ్గరకు వచ్చాడు. "నాన్నా ! ఎప్పుడుచూచినా ఎటో చూస్తూ కూర్చుంటావు. ఈ పూసల్నిదండగా గుచ్చి ఇవ్వవచ్చుకదా!" పూసలు, దారం చేతిలోపెట్టాడు. ఆసక్తిలేకుండానే గుచ్చడం మొదలుపెట్టాడు తండ్రి. పదహారు గుచ్చేసరికి దారం తెగిపోయింది. అయోమయంగా చూస్తున్నాడు. ఇంతలో మహావీరుడు అటుగా వచ్చాడు. విచారపడవలసిందేమీ లేదు. నీ భోగం పిల్లవానికి పదహారేండ్లు వచ్చేవరకే" అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు. తండ్రికి మనస్సులో ఏదో లీలగా మెదిలింది. చూస్తూ ఉండగానే పిల్లవానికి 16 ఏండ్లు నిండాయి. కుమారుని భార్యకు అప్పగించి సంతోషంగా సన్యాసం స్వీకరించాడు. పిల్లవానికి వివాహం జరిపించి తల్లికూడ సమాజసేవలో నిమగ్నమయింది.*

**మంచి-చెడ్డ ఎప్పుడూ మనస్సులోనే ఉంటాయి.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-38

# కళాసాధన

'కళ' అంటే 'కిరణం' అని అర్థం. సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రకాశం నుండి అంతకంటే సూక్ష్మతరమైన కిరణ సమూహాన్ని ఒక పద్ధతి ప్రకారం మనం అనుభవంలోనికి తెచ్చుకుంటాం. దానినే 'కళ' అంటారు. సూర్యుని నుండి సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రకాశ తరంగాలు భూమి మీదకు వస్తాయి. వాటిలో ఒక సమూహాన్ని మాత్రమే మనకళ్లు, మనం తయారు చేసిన యంత్రాలు భరించగలుగుతాయి. సూర్యకిరణాలలోని ఏడురంగులు మనకు తెలుసు. పరమాణువులలోని పరమాణువుల విద్యుత్తరంగాలు మన నేత్రాలను తాకినప్పుడు ఆ రంగుల రూపజ్ఞానం కలుగుతుంది. రూపాన్ని ప్రకాశవంతం చేసి ప్రకటించేపని కళ ద్వార జరుగుతుంది.

కళలు రెండు విధాలు: (1) ఆప్తి (2) వ్యాప్తి. ఆప్తి కిరణాలు ప్రకృతి యొక్క అణువులుగా ప్రకటితం అవుతాయి. వ్యాప్తికిరణాలు పురుషుని అంతరాళంలో ఆవిర్భవిస్తాయి. వానినే 'తేజస్సు' అని పిలుస్తారు. వస్తువులు పంచతత్వాలతో తయారవుతాయి. అందువల్ల పరమాణువు నుండి కదలివచ్చే కిరణాలు తన ప్రధానతత్వ విశేషాన్ని కలిగి ఉంటాయి. వాని విశేషతను రంగుద్వార గుర్తించ గలుగుతాం. ఏ వస్తువు రంగునైనా చూస్తే దానియందు పంచతత్వాలలో ఏ తత్వం ఎంత కలసి ఉందో చెప్పగలుగుతాం.

వ్యాప్తి ప్రతి మానవుని తేజస్సు నందు ఉంటుంది. ఈ తేజస్సు ముఖ పరిసరాలలో ప్రకాశమండలం వలె ప్రత్యేకంగా విశేష రూపంలో వ్యాపించి ఉంటుంది. అదేవిధంగా పూర్తి శరీర పరిసరాలలో ప్రకాశిస్తూ ఉంటుంది. దీనినే సంస్కృతంలో 'తేజోవలయం' అనీ, ఆంగ్లంలో 'ఆరా' అనీ అంటారు. దేవతల చిత్రాలను చిత్రించేటప్పుడు వారి ముఖం చుట్టూ ప్రకాశ పుంజాన్ని చిత్రిస్తారు. అది వారి కళలయొక్క చిహ్నం. అవతారానికి సంబంధించిన శక్తి సామర్థ్యాలు వారు చూపెట్టిన కళలద్వార అర్థం అవుతుంది. పరశురాముని యందు మూడు, రామచంద్రుని యందు పన్నెండు, కృష్ణుని యందు 16 కళలని చెప్పబడ్డాయి. దాని భావం ఏమంటే సాధారణ శక్తికి అన్నిరెట్లు వారిదగ్గర ఆత్మశక్తి ఉన్నదన్న మాట.

సూక్ష్మదర్శులైనవారు ఏవ్యక్తియొక్క గాని, వస్తువు యొక్క గాని ఆంతరిక స్థితిని గూర్చి వాని తేజోవలయం, రంగు, రూపం, ప్రకాశం, చైతన్యాలను చూచి తెలుసుకోగలుగుతారు. కళావిద్యను గురించిన జ్ఞానం భూమిలో అంతర్గతంగా దాగి ఉన్న పదార్థాలను, వస్తువులను, వానిలో దాగి ఉన్న గుణప్రభావ మహత్వాలను సులభంగా తెలుపుతుంది. ఏ మనుష్యుని యందు ఎన్ని కళలున్నాయి? వానిలో శారీరిక విశేషాలేవి? మానసిక విశేషాలేవి? ఆత్మిక విశేషాలేవి? ఏయే గుణ, దోష, యోగ్యతా సామర్థ్యములందు హెచ్చుతగ్గులున్నాయి? అనే విషయాలు సహజంగా తెలిసిపోతాయి. ఈ జ్ఞానం తెలియడంవల్ల ఏవ్యక్తితో ఎట్టి సంబంధాలను కలిగి ఉండాలో తెలిసివస్తుంది.

కళావిజ్ఞానం తెలిసిన వాడు తన శరీరమునందలి సాత్వికతలో హెచ్చుతగ్గులను తెలిసికొని దానిద్వార ఆత్మబలాన్ని సరిదిద్దుకుంటాడు. తన కళలకు సంబంధించిన పరిశోధన, పరిమార్జనలు చేసి వికాసం పొందుతాడు. కళయే సామర్థ్యం. తన ఆత్మిక సామర్థ్యం యొక్క, ఆత్మిక ఉన్నతి యొక్క పరిణామాలను, కళలను పరీక్షించి తెలిసికొని ఉన్నతి కలుగుతున్నదా? లేదా? అనే విషయాన్ని తెలుసుకుంటాడు. దానితో సంతోష జనకమైన సఫలత కలుగుతుందా? లేదా? అనేది తెలుసుకుంటాడు.

అన్ని వైపులనుండి చిత్తమును మళ్లించి, కన్నులు మూసికొని, భృకుటి మధ్యభాగంతో ధ్యానాన్ని కేంద్రీకరించి మస్తిష్కంలోనూ, చుట్టుప్రక్కలా రంగురంగుల రిబ్బన్ల వలె కాంతి ఎగిసిపడడం చూడవచ్చు.. ఈ రంగులు **ఆధార** తత్వంపై ఆధారపడి ఉంటాయి. పృథ్వీతత్వం రంగు పసుపుపచ్చ. **జలతత్వం** తెలుపు. అగ్నితత్వం ఎరుపు. వాయుతత్వం ఆకుపచ్చ. ఆకాశతత్వం నీలం. ఈ రంగుల కలయిక ఆధారంగా మనలో ఏ సమయంలో ఏతత్వం అధికంగా ఉన్నదీ, తక్కువగా ఉన్నదీ అనే విషయం తెలుస్తుంది.

ప్రతి ఒక్క రంగుకు తనదైన ప్రత్యేక విశేషత ఉంటుంది. పసుపుపచ్చ రంగులో క్షమత, గాంభీర్యం, ఉత్పాదన, స్థిరత్వం, వైభవం, సంపన్నత ఉంటాయి. తెలుపురంగులో శాంతి, రసికత, కోమలత, ఆకర్షణ, తృప్తి, సౌశీల్యం, సౌందర్యం, బుద్ధి, ప్రేమ

**జీవితంలో కష్టాలు లేకపోతే - దానికి చిల్లిగవ్వకున్న విలువ కూడా ఉండదు.**

ఉంటాయి. ఎరుపురంగులో వేడిమి, క్రోధం, ఈర్ష్య, ద్వేషం, అనిష్టం, శౌర్యం, సామర్థ్యం, ఉత్తేజిత, కఠోరత, కాముకత్వం, తేజం, ప్రభావశీలత, స్ఫూర్తి ఉంటాయి. ఆకుపచ్చ రంగులో చాంచల్యం, కల్పన, స్వప్నశీలత, చలనం, బిగుసుకుపోవడం, నొప్పినితగ్గించడం, ధూర్తత, కదలిక, వినోదం, ప్రగతిశీలత, ప్రాణం, పోషణ, పరివర్తన ఉంటాయి. నీలిరంగులో ఆలోచనా తత్పరత, బుద్ధి సూక్ష్మత, బాహుళ్యం, సాత్వికత, ప్రేరణ, వ్యాపకత, సంశోధన, సంవర్ధన, సించన, ఆకర్షణ ఉంటాయి.

జడములు కానీ, చేతనములు కానీ ఏ పదార్థమైనా ప్రకటించే వర్ణం దానిలో కదులుతున్న సూక్ష్మ ప్రకాశ జ్యోతిని బట్టి ఆ వస్తువు లేదా ప్రాణి యొక్క గుణ, స్వభావ, ప్రభావాలను తెలుసుకోవచ్చు. సాధారణంగా అవి పంచతత్వాల కళలే. వాని ద్వార కార్యనిర్వహణ జరుగుతూ ఉంటుంది. (1) వ్యక్తి లేక పదార్థమందలి ఆంతరిక స్థితిని తెలిసికోవడం (2) తన శారీరిక– మానసిక క్షేత్రమందలి అసంతులనం– గుణదోషవిచారణ (3) ఇతరుల శారీరిక, మానసిక వికృతులను సంశోధించి, సువ్యవస్థను స్థాపించడం (4) తత్వముల మూలాధారంవరకుపోయి, తత్వముల యొక్క గతి, విధి, క్రియా పద్ధతులను తెలిసికోవడం (5) తత్వాలపై అధికారాన్ని పొంది, ప్రాపంచికపదార్థాలనిర్మాణ, పోషణ వినాశాలను చేయడం జరుగుతుంది.

పైన చెప్పబడిన 5 లాభాలను వ్యవస్థీకరించడం వల్ల రిద్ధి, సిద్ధులవలె ఆశ్చర్యజనకాలు అవుతుంటాయి. ఈ పాంచభౌతిక కళలు రాజయోగి, హఠయోగి, మంత్రయోగి, తాంత్రికుడు మొదలైన వారు తనకు అనువైనరీతిని అనుసరించి ఉపయోగించుకుంటారు. సదుపయోగ, దురుపయోగాలను అనుసరించి మంచి, చెడు పరిణామాలు కలుగుతూ ఉంటాయి. కళ ద్వార ప్రాపంచిక వైభవం లభిస్తుంది. ఆత్మకళ్యాణం కూడ కలుగుతుంది. కొందరికి శాపంగా మారి బాధను కలిగించవచ్చు. పంచతత్వాలకళలు ఇలాంటి ప్రభావాన్ని కలిగిఉంటాయి.

ఆత్మిక కళలు మూడు. అవి (1) సత్వము (2) రజస్సు (3) తమస్సు. తమోగుణ కళకు మధ్యమ కేంద్రం శివుడు. రావణ, హిరణ్యకశ్యప, భస్మాసుర, కుంభకర్ణ, మేఘనాథ మొదలైన రాక్షసులు ఈ తామసికకళయందు సిద్ధులు. రజోముఖి కళలు విష్ణువునుండి లభిస్తాయి. ఇంద్ర, కుబేర, వరుణ, బృహస్పతి, ధ్రువ, అర్జున, భీమ, యుధిష్ఠిర, కర్ణ మొదలైన దేవతలయందు ఈ కళ విశేషంగాకనిపిస్తుంది. వ్యాస, వసిష్ఠ, అత్రి, బుద్ధ, మహావీర, జీసస్, గాంధీ మొదలైన వారికి సాత్విక కేంద్రం నుండి కళ లభిస్తుంది.

ఆత్మిక కళల సాధన గాయత్రీ యోగమునందలి గ్రంథిభేదనం ద్వార జరుగుతుంది. రుద్రగ్రంధి, బ్రహ్మగ్రంధి, విష్ణుగ్రంధి విడిపోవడం వల్ల ఈ మూడు కళలు సాధకునికి సాక్షాత్కరిస్తాయి. పూర్వకాలంలో ప్రజల శరీరంలో ఆకాశతత్వం హెచ్చుగా ఉండేది. అందువల్ల వారికి ఈ సాధన వల్ల ఆశ్చర్యకరమైన సామర్థ్యం అధికంగా కలిగేది. ఈ యుగంలో జనసముదాయానికి పృథ్వీతత్వం ప్రధానం. అందువల్ల అణిమ, మహిమ, లఘిమ మొదలైనవి లభించకపోయినా సత్వరజస్తమో గుణశక్తుల అధికతవల్ల నేడు గూడ ఆశ్చర్యకరమైన, హితకరమైన సాధన జరుగుతోంది.

★★★

## శ్రీ గాయత్రీశతకం

***శ్రీ జయ జనని గాయత్రి జేరియెవరు***
***జపము నొనరింతురో మూడు సంజలందు***
***వారి మదిలోని దురితముల్ పరిహరించు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత.***

***భావం :*** *వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. మంగళకరమైన మాతృమూర్తి. ఆ తల్లిని మూడు సంధ్యలయందు (ఉదయం గాయత్రిగా, మధ్యాహ్నం సావిత్రిగా, సాయంత్రం సరస్వతిగా) ఎవరైతే జపిస్తారో వారి హృదయాలలోని పాపాలను హరించివేస్తుంది. సుజనులుగా తయారుచేస్తుంది.*

*రచన*
*సహజకవి, సాహిత్యరత్న, శతకచతురానన,*
*పద్యకవితా సుధానిధి శ్రీ అయినాల మల్లేశ్వరరావు*

**పరమాత్మ, ఆత్మల సంబంధం న్యాయము, నియమములు రెండు పళ్లెములలో ఉన్న త్రాసువంటిది.**

సంస్కృతీమూర్తి-పరమపూజ్య గురుదేవులు

# పండగలకిచ్చారు చైతన్యాన్ని-సుసంస్కారాన్ని

భారతీయసంస్కృతి అంతా పండుగలమయమే. సత్-చిత్-ఆనందం అనేది ఈ సంస్కృతిఇచ్చే సందేశం మాత్రమే కాదు. దాని స్వభావం కూడ. పండుగలు-పర్వదినాల ద్వారా ఈ సాంస్కృతిక చేతన ఉల్లాసాలను, నిర్మల సంస్కారాలను ప్రవహింపచేస్తుంది. సంస్కృతీ పురుషుడైన పరమపూజ్య గురుదేవుల స్వరూప స్వభావాలు మన సంస్కృతీ విశేషాలకు అన్ని విధాలా అనుకూలంగా ఉన్నాయి. వారి ఉనికితోనే సత్-చిత్-ఆనందం, చైతన్యం, ఉల్లాసం ప్రతి అడుగునా వెల్లివిరుస్తున్నాయి. ఆయన పర్వదినాలు, పండుగలు పట్ల జనావళిలో ఉన్న జడత్వాన్ని రూపుమాపి చైతన్యవంతులుగానూ, సంస్కారవంతులుగానూ తీర్చిదిద్దారు.

సాధారణంగా పండుగలను ఎంతో ఆర్భాటంగా చేయడం ఆనవాయితీ అయిపోయింది. ఈ ఆర్భాటం యొక్క అర్థం దుబారా చేయాలనే పిచ్చి, దుర్వ్యసనాలపెంపుదల మాత్రమే అవుతుంది. గురుదేవులు పండుగలకు, పర్వదినాలకు ఒక సామాజిక సంస్కారప్రక్రియను ఇచ్చారు. జనాల భావనలను సంస్కరించడానికి, బహువర్ణశోభితమైన వ్యక్తిత్వవికాసం కోసం దేవసంస్కృతిలో పండుగలకు ప్రాధాన్యత ఇచ్చారు. మానవుని ఊహలు అణగద్రొక్కబడి వికృతరూపం దాలుస్తున్నాయి. అవే సంఘ వ్యతిరేకశక్తిగా తయారవుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన ఋషులు బాగా ఆలోచించి పండుగలను సామూహికంగా ఉల్లాసపూరితంగా తీర్చిదిద్దారు. వాటికి ఆధ్యాత్మికతను జోడించినట్లైతే సమాజం ఆరోగ్యవంతమవుతుంది.

ఇక్కడ విషయం - పండుగలు - పర్వాల ద్వారా సమాజాన్ని సంస్కరించడంవరకే పరిమితంకాదు. గురుదేవుల వ్యక్తిత్వం కూడ దీనితో సంబంధం కలిగిఉంది. వారు తమ మార్గదర్శిని వసంతపంచమినాడే కలిశారు. అందువల్ల ఆ శుభదినాన్ని గురుదేవులు గొప్ప పండుగలాగా జరుపుకునేవారు. ఋతువులన్నింటిలో వసంత ఋతువు రాజుగా పరవశించిపోతుంది. పశుపక్ష్యాదులు చెట్లు-చేమలు నూతనోత్సాహంతో విరాజిల్లుతాయి. మానవ జీవితంలోని సాంస్కృతిక చైతన్యానికి అధిష్ఠాత్రి అయిన సరస్వతీదేవి అవతరించినరోజు కూడ ఇదే. ఇది మానవునిలో సంస్కృతి - సంస్కారాలను ప్రవేశపెట్టినరోజు. గురుదేవులు వసంతపంచమిని తన ఆధ్యాత్మిక జన్మదినంగా ప్రకటించుకున్నారు. ఆయన ఏ శుభకార్యం ప్రారంభించినా వసంతపంచమినాడే ప్రారంభించేవారు.

గురుదేవుల జీవితంలో అత్యంత ప్రధానమైన రోజు వసంతపంచమి. మొదటి వసంతపంచమి 1926 లోను, చివరి వసంతపంచమి 1990 లోను జరుపుకొన్నారు. చివరి పండుగనాడు తన ఆత్మీయ శిష్యులను, స్వజనాన్ని స్వయంగా పిలిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన శిష్యులను, స్వజనులను భౌతికంగా చివరిసారిగా కలిశారు. ఈ పండుగ రోజున ఆయన ఒక సందేశాన్నిచ్చారు. "వసంతపంచమి రోజు మహాకాలుని సందేశం" అన్న పేరుతో కరపత్రాలుగా ముద్రించారు. ఈ కరపత్రంలోని శీర్షికను గమనిస్తే 1926లో ఒక సాధకుడు 1926లో ప్రారంభించిన ప్రయాణాన్ని 1990 వసంతపంచమినాడు మహాకాలుని రూపంలో ముగించినట్లు తేలిగ్గా అర్థమవుతుంది.

వసంతపంచమిలాగానే గాయత్రీ జయంతికి కూడ గురుదేవుల జీవితంలో ప్రత్యేక స్థానమున్నది. పర్వదినాలు - పండుగలు భౌతికంగా అందరికీ ఒకేలా అనిపిస్తాయి. కాని అప్రత్యక్షంగా వేటి ప్రత్యేకత వాటికే ఉంటుంది. గాయత్రీ జయంతి యుగశక్తి గాయత్రి యొక్క అవతరణదినం. సంస్కృతీ పురుషుడైన పరమపూజ్య గురుదేవుల యొక్క అవిరామ, కఠోరమైన తపోసాధనకు ప్రసన్నురాలైన గాయత్రీదేవి మానవీయ చేతనత్వరూపంలో అవతరించాలని నిర్ణయించుకున్నది.

"మానవుని జన్మ, మృత్యువు రెండూ ఆనందించే పండుగలే. కాని వాటిని అనుభవించే కళనేర్వాలి" అంటారు గురుదేవులు. ఈ సూక్తిని ఆచరణరూపంగా ఋజువుచేశారు. వసంత పంచమి రోజున వారు జీవితాన్ని ప్రారంభించి గాయత్రీ జయంతి రోజున ఉత్సాహంతో ముగించారు.

గురుదేవులు అఖండజ్యోతి సంస్థానంలో ఉండే రోజుల్లో ఆయనతో ఉన్న పరిజనుడు చెప్పిన మాటలు- గురుదేవులు ఒకరోజున మథురలోని గాయత్రీ తపోభూమికి వచ్చారు. ఆ రోజు గాయత్రీ జయంతి. అంతటా ఆనందపూరిత వాతావరణమే కనిపిస్తోంది. గురుదేవులు కుర్చీలో కూర్చుని ఉన్నారు. వచ్చిపోయే పరిజనులు ఆయనను కలుస్తున్నారు. నేను కూడ ఆయన

**సమృద్ధి, ఆనందం, ఆరోగ్యం అపరిమితంగా ఉన్నాయి ప్రకృతిలో.**

పాదాలనుస్పృశించాను. గురుదేవా ! ఈ రోజు ప్రతిదీ స్వర్గతుల్యంగా ఉంది అన్నాను. దానికి గురుదేవులు నాయనా ! పండుగలు - పర్వాలు వచ్చేదే మన జీవితాలను స్వర్గతుల్యం చేయడానికి. వీటిని సరిఅయిన పద్ధతిలో జరుపుకుంటే అంతరంగం కూడ స్వర్గతుల్యం అవుతుంది. పండుగల్లో అంతర్లీనంగా ఉన్న ప్రేరణ మనలోనికి నింపుకోవాలి" అన్నారు.

గురుదేవులు ఎంతటి గురుభక్తులో అంత శిష్యవాత్సల్యం కలవారు. దానిని తెలియచేసే పండుగే గురుపౌర్ణమి. గురుపౌర్ణమి వారి జీవితంలో గొప్ప స్థానాన్ని పొందింది. ఆ స్థానం వర్ణించడానికి అలవికానిది. "నేను ఈశ్వరుడినే గురువురూపంలో భావించాను. పొందాను." అని ఒకచోట వ్రాసుకున్నారు. ప్రత్యేకంగా జరిపే గురుపూర్ణిమ నాకుకూడ అలాంటి అనుభూతిని ఇవ్వాలన్న కోరిక కలుగుతోంది. ఇది 1980లో జరిగిన సంఘటన.

ఎవరైనా పనిని ఆలస్యం చేసినా, బద్ధకం చూపించినా గురుదేవులు విసుగుపడుతూ ఉండేవారు. ఒకసారి ఒక వ్యక్తి తనకు అప్పగించబడిన పనిని కష్టపడి పూర్తిచేసి వారిదగ్గరకు వచ్చాడు. గురుదేవులు చాలా సంతోషించారు. ఆనందంగా "నీవు ఈరోజు చాల బ్రహ్మాండంగా పనిచేశావు" అన్నారు. ఆ ప్రశంస విని అతడు ఉబ్బి తబ్బిబ్బు అయ్యాడు. చనువుగా గురుదేవా ! మీరు కోపగించినప్పుడు చాల భయమేస్తుంది" అన్నాడు. వింటూనే గురుదేవుల కళ్లు చెమ్మగిల్లాయి. "నాయనా ! నేను మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నానో మీకు తెలియదు. తిడతానంటే అలా నటిస్తానన్నమాట. ఎందుకో తెలుసా, మీ ప్రగతి ఆగిపోకూడదని." ఇది వారి శిష్యవాత్సల్యానికి ప్రత్యక్ష నిదర్శనం. వారికి గురుపూర్ణిమను ఉల్లాసభరితంగా చేసికోవడం, ఆ సందర్భంగా గురువుగారికి అర్పణ చేసికోవడం, శిష్యులపై ప్రేమవర్షం కురిపించడం వారికి చాల ఇష్టం.

గాయత్రీ జయంతి, గురుపూర్ణిమ, వసంతపంచమి ఈ మూడు పండుగలే కాకుండ కొన్ని ప్రేరణాత్మక పండుగలను జరుపుకోవాలని ప్రోత్సహించారు. అవి (1) శ్రీరామనవమి (2) శ్రావణపూర్ణిమ (3) చైతన్య నవరాత్రులు (4) శ్రీకృష్ణ జన్మాష్టమి (5) మహాలయ అమావాస్య (6) శరన్నవరాత్రులు (7) విజయదశమి (8) దీపావళి (9) గీతాజయంతి (10) మహాశివరాత్రి (11) హోలీ మొదలైనవి. పైన తెలిపిన పండుగల్లో భారతీయ సంస్కృతీ సారం నిండిఉంది అంటారు. మన సంస్కృతీస్థాపన మానవుని సంస్కారవంతునిగా చేయడమే కాక, సామూహిక చేతనాశక్తిలో విలీనం అయ్యేలా ఏర్పాటు చేయబడింది.

## సాధనతో సాధించలేనిది ఏమీ లేదు

*మిథిలానగర ప్రాంతాన్ని పాలించిన వారిలో అధ్యాత్మిక సాధకులు ఇద్దరున్నారు. (1) జనక మహారాజు (2) రామేశ్వర ప్రసాదసింహ్. ఆ రోజుల్లో దరభంగానది వారి భూములను సస్యశ్యామలం చేసే మహానది. రామేశ్వరప్రసాద్ సింహ్ తంత్రశాస్త్రంలో మహానిపుణుడు. ఆయన విద్యాభ్యాసమంతా ఇంగ్లండులోనే నడిచింది. భారతదేశం తిరిగి వచ్చాక భారతీయ వాఙ్మయాన్ని అధ్యయనం చేశాడు. 'సర్ జాన్ ఉదరఫ్' ప్రోత్సాహంతో రామేశ్వరప్రసాద్ దృష్టి తంత్రశాస్త్రం వైపు మళ్లింది. కలకత్తాలో ఆనాటి హైకోర్టు జడ్జి శివచంద్ర భట్టాచార్య దగ్గర తంత్రశాస్త్రం నేర్చుకున్నాడు. తరువాత కుండలినీ యోగాన్ని గురించి ఒక పుస్తకాన్ని (సరపెంటాయిన్ ఫాయర్) రచించాడు. ఆయన అన్ని తీర్థస్థలాలు పర్యటించాడు. వెళ్లిన ప్రతిచోటా దరభంగానది పేరుతో ఒక్కొక్క భవనం నిర్మింపచేశాడు. ఆయన పాలనలో దాదాపు 1000 పండిత సభాభవనాలుండేవి. వాటిల్లో సమాజకల్యాణం కొరకు అన్ని వేళలా ఉపాసనా కార్యక్రమాలు జరుగుతుండేవి. ఆయన ఏ సాధన చేసినా సమాజ కల్యాణానికే చేస్తుండేవాడు. ఆయన తన పుణ్య ఫలాన్ని ప్రజలకే పంచిపెట్టేవాడు. ప్రజాక్షేమమే తన క్షేమంగా భావించేవాడు. ఒకరోజున దరభంగా నదిలో స్నానం చెయ్యాలని వెళ్లాడు. ఆ సమయంలో నేపాలు నుండి వరద నీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. నది పొంగి పొర్లుతోంది. రాజును నదిలో దిగవద్దని ప్రజలు అడ్డుతగిలారు. నది నా తల్లిలాంటిది" అంటూ నది ఒడ్డున అటూ-ఇటూ తిరుగుతున్నాడు. దాదాపు మూడుమైళ్లవరకు నడిచాడు. మనస్సులో ఏమి సంకల్పించుకున్నాడో తెలియదు. క్రమంగా నది వరద తగ్గిపోసాగింది. దరభంగా తీరప్రాంతమంతా వరదనుండి రక్షింపబడింది. సాధనలో శక్తి ఉంది. తలచుకుంటే సాధన ద్వారా ప్రకృతిని కూడ శాసించవచ్చు.*

ఈ పండుగలు - పర్వదినాల సాంస్కృతిక వైభవాన్ని తిరిగి అందించిన గురుదేవులను 'యుగ ఋషి' అనడంలో అతిశయోక్తి లేదు. వారిలో ఋషి-మహర్షుల యొక్క సమన్విత చేతన పనిచేస్తూ ఉన్నది. అందువల్లనే ఆయన చెప్పిన ప్రతీమాటలో విభిన్న ఋషి పరంపరల స్వరూప స్వభావాలు దర్శనమిస్తూ ఉంటాయి.

★★★

ప్రకృతిలో నిజమైన సౌందర్యం ఉంది.

ఆచరణలో అధ్యాత్మ

# నైతికమూల్యాలు-సర్వాంగీణత

అనాది కాలంనుండి ఆధునిక కాలం వరకు మానవత్వానికి ఇరుసుగా మానవుడే నిలబడ్డాడు. మానవత్వం వికసించేదెలా? అందరికీ సమ్మతమైన మానవత్వం ఏమిటి? మానవీయ మూల్యాలనెలా స్థాపించాలి. మొదలైన ప్రశ్నలన్నింటికి ఒకే ఒక సమాధానం వస్తుంది. అదే నైతికత.

నైతికత వికాసమాన స్వరూపమే ధర్మం. ధర్మంలో నైతికతను మించిన అంశం అంటూ మరొక్కటిలేదు. ఐనప్పటికీ నైతికత-ధర్మం ఒకదానికొకటి పర్యాయపదాలు అని మాత్రం చెప్పలేం. కాని నైతికతను ధర్మంలో విడదీయరాని అంగంగా చెప్పాల్సి ఉంటుంది. ప్రపంచ ధర్మాలన్నింటిలో నైతికత ఏదో ఒకరూపంలో దర్శనమిస్తూనే ఉంటుంది.

సుప్రసిద్ధ విద్యాంసుడు ఎ క్రైంపవేల్‌గారవేట్ "ది మోరల్ నేచర్ ఆఫ్ మేన్" అనే తన గ్రంథంలో క్రైస్తవ ధర్మంలోని నైతిక విషయాలపై చర్చించారు. నైతికభావాలవల్లనే భ్రాతృత్వం వెల్లివిరిస్తుందని తెలిపారు. ఇతరులమేలునుచూడటమే ప్రధాన లక్ష్యంగా చెప్పబడింది. "మానవుడు సిద్ధులు పొందడంలో గొప్పేమీ లేదు. పరోపకారం చెయ్యాలన్న భావనయే గొప్ప." అని బైబిల్లో వ్రాయబడి ఉంది.

ఇదేవిధంగా చైనాధర్మంలో కూడ నైతికత ఆధారంగానే మహాత్మునిగా ఆరాధిస్తారు. కన్ఫూసియస్‌సిద్ధాంతం ప్రకారం మనిషిని నైతికవిలువలఆధారంగా మనీషిగా చేయడమే మానవసేవ అనిపించుకుంటుంది. చైనా దర్శనాలలో కూడ పరమేశ్వరుని అనుగ్రహాని కన్నా మానవుని నియమ-నీతి-నిష్ఠలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇక్కడ నైతికతకు మూలసూత్రం జైనసూత్రాలైన ప్రేమ-సౌహార్ద్రాలే. ఇదే మానవుని సర్వశ్రేష్ఠ గుణం. ఈ విధమైన గుణాలు పరిపూర్ణంగా ఉన్నవాడే పూర్ణమానవుడు. అతడే మహాత్ముడు. అతడే ఆదర్శ పురుషుడు. "లిన్‌యూతాంగ్" తన గ్రంథం "విజడమ్ ఆఫ్ కన్ఫూసియస్"లో ఇదే విషయాన్ని వ్రాశారు. సంపూర్ణ మానవత్వాన్ని సాధించిన వ్యక్తియే ఆదర్శ శాసకుడౌతాడు.

చైనా దర్శనాలు, ధర్మాన్ని అనుసరించి యే గౌతమబుద్ధుడు నైతికతకు జీవితంలో ప్రధాన స్థానాన్ని కల్పించాడు. బౌద్ధ ధర్మానికి ఆధారభూతమైనది ఇదే. 'సామయుక్తనికాయ్' లోని చతుర్థభాగంలో నైతికతకు 8 సోపానాలు చెప్పబడ్డాయి. అవి (1) సమ్యక్ దృష్టి (2) సమ్యక్ విచార్ (3) సమ్యక్ వాణి (4) సమ్యక్ వ్యవహారం (5) సమ్యక్ జీవనం (6) సమ్యక్ కృషి (7) సమ్యక్ చింతన (8) సమ్యక్ ఏకాగ్రత.

ఇదేవిధంగా తత్వార్థ సూత్రంలో సమ్యక్ శ్రద్ధ, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ వ్యవహారం అనే మూడింటిని జైన రత్నాలుగా చెప్పాడు. ఈ మూడింటిలో సమ్యక్ వ్యవహారానికి పెద్ద పీట వేశాడు. ఈ మూడింటిని గూర్చిన వివేచనయే ఒక నీతిశాస్త్రం.

ఇతర ధర్మాలను గురించి తెలుపుతూ ఎ.సీ. బౌకేట్ తన గ్రంథం 'కన్సర్వేటివ్ రిలీజన్'లో "ఇస్లామ్‌కూడ నీతికి ప్రముఖస్థానం ఇచ్చినట్లు, అనుశాసనాన్ని ఆదరించినట్లు ఖురాన్‌లో ఆధారాలున్నాయి. ఖురాన్‌లోని సూరా 2 :174. 196 పేజీలలో **"తూర్పు ముఖంగా కూర్చున్నావా? పడమటి ముఖంగా కూర్చున్నావా? అన్నదాంట్లో పవిత్రత లేదు. దీనులకు, దరిద్రులకు, యాత్రికులకు ఎంత సహాయం చేశావు? ఎంత సేవలు చేశావు? అన్నదానిమీదనే పవిత్రత ఆధారపడి ఉంటుంది."** అని స్పష్టంగా వ్రాసి ఉంది. "తనకోసం కోరుకున్న దానిని తన సోదరునికోసం కూడ కోరనివాడు ధర్మపరుడుకాడు." అన్న సూక్తి ఇస్లాంలో ప్రసిద్ధమైనది.

ఈవిధంగా వివిధధర్మాలలో వర్ణింపబడిన సూత్రాలు నీతి నియమాల సార్వభౌమికత్వాన్ని సూచిస్తున్నాయి. అన్నింటిలోను ఏకసూత్రభావన కన్పిస్తుంది. గీతలోని సూత్రాలన్నీ దాదాపు నైతికతను కేంద్రంగాచేసికొని చెప్పబడినవే. దీని ఆధారంగానే 17వ అధ్యాయంలో నీతి- అనీతి గురించి చర్చించబడింది.

డా. రాధాకృష్ణన్ తన గ్రంథం "ఇండియన్ ఫిలాసఫీ"లోని ప్రథమ ఖండంలో వివరించారు. "ఋగ్వేదంలో విశ్వవ్యవస్థకు సంబంధించిన "ఋత్" నైతికమూల్యాలను స్పష్టంచేస్తోంది. నైతికశిక్షణ అనేది సృష్టి ఆరంభంనుండి ఉన్నదే. కాకపోతే దేశకాల పరిస్థితులను బట్టి మూల్యాలలో అవసరమైన మార్పులు చేర్పులు జరుగుతూనే ఉంటాయి."

ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వమానవత అశాంతితో అలమటిస్తున్నది. నైతికత అనేది కేవలం అవసరమేకాదు. తప్పనిసరి. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు ఒప్పుకుని తీరవలసిందే. అందులో సందేహమేలేదు.

★★★

కర్మరేఖలు దైవీషార్ట్‌హాండ్ వంటివి.

ప్రత్యేక వ్యాసం

# కంచిమీదుగా నా అరుణాచలయాత్ర-2

ఎత్తైన తాటిచెట్లు ఇరువైపులా నిలిచి ఉన్న రోడ్డు మీద ప్రయాణం చేసి, వెల్లవేసిన గోడలతోనూ, ఎరుపురంగు కప్పులతోనూ, ఇరుకువాడలతోనూ కనపడుతున్న చెంగల్పట్టులో ప్రవేశించాం మేము. బండి దిగి ఊరి మధ్యకు చేరుకున్నాము. అక్కడ జనం గుంపులు గుంపులుగా గుమికూడి ఉన్నారు ఒక చిన్న విడిదికి తీసుకొని వెళ్లారు. నన్ను అక్కడ స్వామి వారి అనుచరులలో కొందరు, కుంభకోణం వదిలినప్పటి నుంచీ స్వామి వారి పేర వచ్చిన 'టపా'నంతా పరిశీలిస్తున్నారు. దాని కానుకుని ఉన్న చిన్న గదిలో మేము నిలబడి నిరీక్షిస్తుండగా, వేంకటరమణి స్వామివారి దర్శనం కోరుతూ, ఒక అనుచరుణ్ణి లోనికి పంపించారు. ఒక అరగంట గడిచిన తరువాత స్వామి వారి దర్శనం నేను కోరుకున్న విధంగా లభించదని మాకు వర్తమానం వచ్చింది. స్వామివారితో సంభాషించవలెనని అప్పటికే రెండు వందలకు పైగా బయట వేచి ఉన్నారు. అటువంటప్పుడు ఒకానొక పాశ్చాత్యుడికి వెంటనే దర్శనం లభించటం స్వామి వారికి సమ్మతం కాకపోయింది. అవాల్టికి అక్కడే ఉండిపోయి మరుసటిరోజు స్వామిని దర్శించి భాషించవలెనని ఎందరో ఉండిపోతున్నారక్కడ. ఈ కబురు తీసుకొని వచ్చిన స్వామి అనుచరుడు చాలా చాలా నొచ్చుకున్నాడు.

ప్రాప్తమింతే కాబోలుననే దృష్టితో నేను సరిపుచ్చుకున్నాను. కాని వేంకటరమణి స్వామి వద్ద తనకున్న చనువూ స్వాతంత్ర్యాలను ఉపయోగించి ఎలాగైనా స్వామి సన్నిధికి నన్ను తోడ్కొనిపోయి, వారి దర్శన భాగ్యాన్ని కలిగిస్తానని అన్నారు. వేంకటరమణి తన ఆధిక్యతను, ప్రత్యేకతను ప్రదర్శించుకుంటూ స్వామి వారి వద్దకు చొచ్చుకొనిపోతూ ఉంటే అక్కడ చేరిన జనం తమ అసమ్మతిని గుసగుసలతోను చెవులు కొరుక్కోడాలతోను వ్యక్తం చేయకపోలేదు. చాలా శ్రమపడి ప్రాధేయపడి ఒప్పించి, ఎలాగో వేంకటరమణి చిరునవ్వు పెదవులపై చిందులాడుతూ ఉండగా, జయసూచకంగా తిరిగి వచ్చాడు.

"మీ కొరకుగాను స్వామి వారు తమ కార్యక్రమాన్ని మార్చుకున్నారు. మీ పట్ల కొంత ప్రత్యేకతను కనపరచారు. ఒక గంటలో స్వామి మీకు దర్శనం కలుగచేస్తారు."

ఆ తరువాత కాలక్షేపం కోసం ఆ చెంగల్పట్ ఇరుకు వీధుల్లో కాస్సేపు అటూ ఇటూ తిరిగాను. స్వామి పరిచారకులు ఏనుగులను, ఒంటెలను, నీళ్లు త్రాగించటానికి తీసుకొని పోతుంటే చూశాను. అందులో ఒకరు శ్రీవారు ఎక్కేఏనుగునుచూపారు నాకు. అంబారీతో ఉన్న ఆ ఏనుగుపై స్వామి అప్పుడప్పుడు సంచారం చేస్తారు. ఆ ఏనుగును సర్వాలంకృతం గావిస్తారప్పుడు. తొండాన్ని గంభీరంగా ఊపుకొంటూ కదులుతున్న ఆ ఏనుగును చూస్తూ కాస్సేపు గడిపాను. మహాత్ములను, పెద్దలనుదర్శించేటప్పుడు పత్రమో, పుష్పమో, ఫలమో తీసుకొని పోవాలన్న సంప్రదాయం మననం చేసుకుంటూ కంటికి కనపడ్డ నారింజ (కమలా) పండ్లు, పువ్వులూ తీసుకుపోగలిగినన్ని సంగ్రహించాను.

అయితే స్వామివారి విడిదిలోకి ప్రవేశించేముందు ఒక ఆచారంమరిచిపోయాను. ఆ జనసందోహాన్ని ఒత్తిగిస్తూ పోవటంలో వేంకటరమణి జోళ్లు విప్పి వేయమని హెచ్చరించటంతో స్వామి సన్నిధి నుండి తిరిగి వచ్చి మళ్లీ వేసుకోవచ్చునన్న ధీమాతో బయట వీధిలోనే వాటిని వదిలేశాను.

చిన్నద్వారంగుండా, సన్ననిదారిగుండా ఒక గదిలో ప్రవేశించాం మేము. అటువైపున కొంచెం వెలుగును ప్రసాదిస్తున్న చిన్న ద్వారం ఇంకొకటి ఉన్నది. ఆ ద్వారం ప్రక్కన బదుగు దేహంతో కూర్చున్న మూర్తినొకరిని దర్శించాను. వారు ఆసీనులై ఉన్న ప్రదేశంలో పూర్తి వెలుగు లేదు. నేను ఆ మూర్తిని దగ్గరగా సమీపించి తెచ్చిన పండ్లూ, పూలు ముందుంచి వంగి నమస్కరించాను. ఇలా నమస్కారం చేయటంలో ఏదో ఒక ఆకర్షణతో కూడిన అంతర్యం ఉందనిపిస్తుంది నాకు. అవతల వ్యక్తి పట్ల మనకున్న భక్తి గౌరవాల వ్యక్తీకరణేకాక, కేవలం శాస్త్రార్థపు సంప్రదాయంగానేకాక ఏదో మహత్తరమైన ఆకర్షణ ఉందనిపిస్తుంది సాష్టాంగ నమస్కారం చేయటంలో. క్రైస్తవ మతాచార్యుడైన 'పోప్' తో శ్రీవారికి సాపత్యం లేకపోయినా చాలామందికి ఆచార్యస్వామి మతగురువు అన్న విషయం స్పష్టమే. ముఖ్యంగా దక్షిణ భారతానికంతకూ వారు పరమాచార్యులు.

నిర్నిమేషంగా నిశ్చలంగా వారి వేపు చూశాను. పొట్టిగా కావి బట్టలతో మనోజ్ఞంగా ఉన్న స్వామిమూర్తిని చూశాను. వారు నలుబదవ పడిలో ఉన్నారని విన్నాను. వారి జుట్టు పండి పోవటం నాకు ఆశ్చర్యంఅనిపించింది.

కమనీయమైన ఆ ముఖవర్చస్సూ, విభూతితో ప్రకాశిస్తున్న ఆ ఫాలతలమూ, నా స్మృతి పథంలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

**ప్రారబ్ధ ఫలం ఆకస్మికంగా వస్తుంది - రోగం, మరణం, ప్రమాదం రూపాల్లో.**

నిజమైన ఆధ్యాత్మిక సంపద అంతా మూర్తీభవించినట్లుగా ఉన్నారు శ్రీవారు. వారి సంభాషణ అంతా మృదువుగాను, మనోజ్ఞంగానూ ఉంది. వారి కళ్లు అనిర్వచనీయమైన ప్రశాంతికి, సౌందర్యానికి, ఉనికిపట్లుగా ఉన్నాయి. నాసిక సమమై కొనదేరి, పరమ సుందరంగా ఉన్నది. వారి చుబుకమూ, నోరూ కూడా, గొప్ప ప్రశాంతతను సూచిస్తున్నాయి. మధ్య యుగంలో అవతరించి క్రిష్టియన్ మతాన్ని పరిపూతం చేసిన మహాపురుషులదేమో ఈ ఆకృతి అనిపించింది నాకు. అయితే ఆ మహా పురుషులకన్నా కూడా వీరి "ధీ" విశేషం గమనించదగ్గది. కేవలం పాశ్చాత్య దృష్టితో చూసి చెప్పమంటే ఆధ్యాత్మికశిక్షణా, వాసనలూ లేని మేము, ఆ కళ్లేవో స్వాప్నిక జగత్తులో విహరిస్తున్నాయని మాత్రమే చెప్పగలం. కాని, నాకు స్వాప్నిక జగత్తు కాక, ఆ కళ్ల వెనక స్వర్గధామాలేవో ఉన్నట్లనిపించింది.

'మీరు నా యందు చాలా అనుగ్రహం కనపరిచారు' అన్నాను పరిచయం చేసుకుంటూనే. స్వామి నా మిత్రునివైపు తిరిగి ప్రాంతీయ భాషలో ఏదో చెప్పారు. కాని వారు చెప్పింది నేను సరిగా గ్రహించగలిగాను. వేంకట రమణి నాతో ఇట్లా అన్నాడు.

'శ్రీవారికి మీరు ఇంగ్లీషులో మాట్లాడితే తెలుస్తూనే ఉంది. వారు ఇంగ్లీషు మాట్లాడితే మీకు, ఉచ్చారణాది భేదం వల్ల అర్థం కాదేమోనని సంకోచంగా ఉంది. కాబట్టి నన్ను అనువాదం చెయ్యమంటున్నారు తాము చెప్పే సంగతులను.'

నేను స్వామి వారి వద్ద వ్యక్తిగత విషయాలకు సంబంధించి మాట్లాడిన సంగతులు విస్తరించి చెప్పటం నా కిష్టం లేదు. తరువాత స్వామి వారు, ఈ దేశంలో నేను పొందిన అనుభవాలను గూర్చీ, ఈ దేశీయులూ, వీళ్ల సంస్కృతీ నాపై చూసిన ప్రభావాన్ని గూర్చీ విశదంగా తెలుసుకోవడానికి చాలా ఆసక్తిచూపారు. నిస్సంకోచంగానూ, మనస్ఫూర్తిగానూ నేను చూసిన మంచి చెడ్డలను గూర్చి శ్రీవారితో ప్రస్తావించాను.

తరువాత మా ఇద్దరి మధ్య ప్రసంగం బహు విషయాలపైకి మళ్లింది. శ్రీవారు ఇంగ్లీషు వార్తాపత్రికలను క్రమం తప్పక చదువుతారన్న విషయం తెలుసుకొని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. అంతేకాక, ప్రపంచంలోని వివిధ దేశాలలోని వర్తమాన పరిస్థితులను గూర్చి వారికి గల అపారమైన అవగాహనకు అబ్బురమున్నూ కలిగింది నాకు. 'వెస్ట్ మినిష్టర్ ఆబీ'లో ఏ విషయాలు చర్చించబడుతున్నాయో, యూరపులోని ప్రజాస్వామికావశ్యకత ఎట్టి దుర్భర స్థితిలో ఉన్నదో, శ్రీవారికి పూర్తిగా ఆకళింపే.

ఇంతకు పూర్వమే శ్రీవారు గొప్ప ప్రవక్త అనీ, త్రైకాలిక జ్ఞాన సంపన్నులనీ, వేంకటరమణి గాఢంగావిశ్వసిస్తున్నట్లు నేను గ్రహించిఉన్నందున, ప్రపంచపు భవిష్యత్తునుగూర్చి శ్రీవారి ముఖతః వినాలన్నఆసక్తిని నేనణుచుకోలేకపోయాను.

'ఎల్లెడలా ఆర్థికంగానూ, రాజకీయంగానూ, సంక్షుభితమై పోయిన పరిస్థితులు ఎన్నడు చక్కబడతాయి?' అని అడిగాను.

'ఎప్పుడైనా మంచి జరగడానికి చాలా ఆలస్యం అవుతుంది. ఇదంతా క్రమ పరిణామమే. మంచి నెలకొనడానికి కొంత వ్యవధి కావాలి. ప్రతి దేశం కూడా ప్రతి సంవత్సరమూ పోటీలుపడుతూ, మారణాస్త్రాలను ఉత్పత్తి చేయటంలో నిమగ్నమై ఉంటున్నదే ఇక శాంతి, సౌమనస్యం, ఎలా నెలకొంటాయి? ఎట్లా ఈ పరిస్థితులు చక్కబడతాయి?'

'అయినప్పటికీ నేడు నిరాయుధీకరణమూ, నిర్యుద్ధ ఒడంబడికలు గూర్చి ఎక్కువగానే వినవస్తున్నాయి కదా! అవి ఈ పరిస్థితులపై ప్రభావాన్నేమీ చూపలేవా?'

'యుద్ధనౌకలు భగ్నం చేసీ, టాంకులకు తుప్పు పట్టించినంత మాత్రం చేత యుద్ధ ప్రజ్వలన ఆగిపోదు. కర్రలతో, కత్తులతోనైనా సరే మనుషులు యుద్ధం చేస్తారు.'

'కాబట్టి ఈ పరిస్థితులు మారిపోయి మంచిరోజులు రావాలంటే ఏం చేయాలి?'

'దేశ దేశాల మధ్య జాతుల మధ్య పరస్పరం సమ్యగవగాహన ఉండాలి. ఒక ఆధ్యాత్మిక దృక్పథం వాళ్ళను చేరువగా తీసుకొని రావాలి. దేశాల మధ్యనే కాకుండా ఒక దేశంలోని హెచ్చుతగ్గులు సాధ్యమైనంతవరకు తగ్గాలి. ధనవంతుడికీ పేదవాడికీ మధ్య ఒక ఆధ్యాత్మికానుబంధం నెలకొనాలి. అటువంటి పరిస్థితులు కుదురుకొన్ననాడు నిజమైన శాంతి సౌభాగ్యాలు నెలకొంటాయి.'

'ఆ పరిస్థితులు చాలా దూరంగాఉన్నాయనిపిస్తుంది. అందువల్ల ఇప్పుడిక మనకు ముక్తి లేనట్లేనా?'

స్వామి వారు తమ ప్రక్కనే ఉన్న ఆసనంపై బరువుగా చేయి మోపారు.

'భగవంతుడొకడు ఉన్నాడు' అన్నారు నిబ్బరంగా.

'నిజంగా ఉండేఉంటే, ఆ భగవంతుడు మనను గూర్చి తలంచనే తలంచడేమో అనిపిస్తున్నది. ఆయనకూ మనకూ మధ్య చాలా దూరం ఉందనిపిస్తున్నది.'

'భగవంతునికి మానవాళిపై అమితమైన ప్రేమానురాగాలు తప్ప మరేమీ ఉండవు' అని మృదువుగా శ్రీవారు అన్నారు.

'ఇవాల్టి ఈ విపత్కర విషమ పరిస్థితులను బట్టి చూస్తే, భగవంతునికి మానవులపై చాలా నిరాదరణ తప్ప మరేమీ లేదని అనిపిస్తున్నది నాకు' అని నా అసహన భావాన్నంతా వ్యక్తం చేశాను.

**కష్టం ఎప్పుడూ జీవిత సుఖాన్ని పెంచడానికి ఉపకరిస్తుంది.**

దైవం పట్ల వ్యంగ్య ధోరణి, నిరసనా, కసీ, కోపమూ, నా స్వరంలో చోటు చేసుకొని ఉంటాయి. శ్రీవారు నా వైపు వింతగా చూశారు. నా తొందరపాటుతనానికి నొచ్చుకున్నాను వెంటనే.

'నెమ్మదిగా ఆలోచించి చూడగలవారి దృష్టి గాఢంగా ప్రసరించగలదు. పరమేశ్వరుడు మానవుణ్ణి ఉపకరణంగా చేసుకొని తన సంకల్పం ఎలా ఉందో అలా నడిపిస్తూ ఉంటాడు. దేశాల మధ్య సంక్షోభం, మానవులలో నృశంసత్వం, అగతికులైన దీన మానవుల ఆర్తనాదాలూ, ఏ మహాపురుషుడి అవతారానికో హేతుభూతాలవుతవి. భగవంతుడే అట్టి మహాత్ముణ్ణి ఎన్నిక చేసి రక్షణ కొరకు పంపుతూ ఉంటాడు. దీనిని పురస్కరించుకొనే ప్రతి దేశంలోనూ, ప్రతి జాతికీ, ఒక్కొక్క కాలంలో ఒక అవతార మూర్తి ఉద్భవించటం మనం చూస్తూ ఉన్నాము. ఈ పరిణామం భౌతిక శాస్త్ర సిద్ధాంతం లాంటిదే. పతనావస్థ ఎంత తీవ్రంగా ఉంటే, ఆధ్యాత్మిక దారిద్ర్యం ఎంత వ్యగ్రంగా ఉంటే, భౌతిక సుఖాల వైపు మొగ్గు ఎంత బలంగా ఉంటే, ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి ఉద్భవించే మహాత్ముడు కూడా మరిన్ని దివ్య శక్తులతో మరింత మహాత్ముడుగా పుట్టి లోకాన్ని ఉద్ధరిస్తాడు.'

'అంటే శ్రీవారు, ఇప్పుడు కూడా అలాంటి మహానుభావుడు పుట్టి లోకోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించగలడని అనుకుంటున్నారా?'

'ఈ దేశంలోనే కాదు. ఈ లోకంలోనే ఇప్పుడా అవసరం ఎంతైనా ఉన్నది. ఒక కారణజన్ముడు వచ్చి ఈ ధర్మచ్యుతిని ఈ కమ్ముకుంటున్న చీకట్ల నుండి రక్షించవలసిందే.'

'అంటే మానవుడు మరింత పతనావస్థకు దిగజారిపోతాడనా తాము సెలవిస్తున్నది.'

'అట్లా ఎప్పుడూ కాదు. అంతరాంతరాలలో మానవ హృదయంలో భగవదంశ ఉండనే ఉన్నది. ఆ చిదంశ సాయంతోనే మానవుడు దైవసాన్నిధ్యానికి రాగలడు'

'కాని మా దేశాల్లోని మహా నగరాల్లో కొందరు పరమ దుర్మార్గులు ఉన్నారు. వాళ్లను చూస్తూ ఉంటే వాళ్లలో భగవదంశకాక రాక్షసాంశ ఉంటుందేమో అనిపిస్తుంది' అన్నాను, ఆధునిక నాగరికతను ఆసరా చేసుకొని అభివృద్ధి సాధించామని భావించే కొందరు ధనికులను మనసులో పెట్టుకొని.

'ఎప్పుడూ వ్యక్తులను మాత్రమే తప్పుపట్టి నిరసించకూడదు. వాళ్ళు జన్మించిన పరిస్థితులు, పెరిగిన వాతావరణం, పొందిన శిక్షణ మొదలైన అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది మానవ ప్రవృత్తి. మానవుడు దుర్మార్గుడు కావడానికి విపరీతమైన పరిస్థితులు కూడా కొంత కారణమే అనిపిస్తుంది. ఈ విషయంలో లోకంలో ఎక్కడా కూడా అపవాదం లేదు. ప్రాచ్య ఖండంలోనైనా సరే, పాశ్చాత్య దేశాల్లోనైనా సరే. మహత్తరమైన ఆదర్శాలకు అనుగుణంగా సాంఘిక ధర్మాలు దిద్ది తీర్చబడాలి. ప్రాపంచిక సుఖాలగవేషణకు మహత్తరమైన ఆదర్శాలు ఆనకట్టగా ఉండాలి. ప్రాపంచిక సుఖాలాలసతను ఆదర్శమైన ధర్మబుద్ధి అణచి ఉంచాలి. ప్రపంచంలో నేటి సంక్షోభ పరిస్థితులను చక్కదిద్దే ఇంకొక మంచి మార్గం లేనేలేదు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న దయనీయమైన పరిస్థితులే మనం మంచి మార్గాన్ని వెతుక్కునేట్లుగా ప్రేరేపించగలవు. అపమార్గమని తెలిసిన తరువాత పోవలసిన దారేదో తెలుసుకునే ప్రయత్నం చేస్తాము కదా.'

'అంటే ప్రాపంచిక వ్యవహారాలలో కూడా ఆధ్యాత్మిక వాసనలు ప్రవేశించాలని మీ అభిప్రాయం లాగా ఉన్నది.'

'అవును. అలా చేయటం అసంభవమేమీ కాదు. ఎందుకంటే అదొక్కటే రాజమార్గం కనుక మానవ ప్రవృత్తిలో కనుక మార్పు వస్తే ఆ మార్పు స్థిరంగా ఉండే అవకాశం ఉన్నది. పైపై వైద్యాల వల్ల ఏమీ ప్రయోజనం లేదు. ఆధ్యాత్మిక సంపద ప్రపంచ వ్యాప్తంగా పెంపొందిన నాడు ఈ సంక్షోభం, దుఃఖం, అసంతృప్తి తొలగిపోతాయి. అప్పుడు ఎల్లెడలా శాంతీ, కాంతీ నెలకొంటాయి. ఈ దేశంలో ఇప్పుడు కూడా ఆధ్యాత్మిక వాసనలు ఒక విధంగా గౌరవింపబడుతూనే ఉన్నాయి. ప్రపంచమంతటా కూడా ఈ స్థితి ప్రాచుర్యం పొందాలి. అప్పుడు కలతలూ, కల్లోలాలూ నశించి, ధనధాన్య సమృద్ధిగానూ, శాంతితోనూ దేశ దేశాలు విలసిల్లుతాయి.

ఈ విధంగా మా సంభాషణ కొనసాగింది. శ్రీ వారితో సంభాషిస్తూ నేను ఒకటి గ్రహించగలిగాను. ఈ దేశంలోని ఇతర మతాచార్యులవలె కాకుండా, శ్రీవారు పాశ్చాత్య సభ్యతను, మతధర్మాన్నీ చిన్నచూపు చూడటం లేదు. అక్కడా కొన్ని మేలుకీళ్ళున్నాయనీ, ఇక్కడా అలాగే కొన్ని కీళ్ళున్నాయనీ శ్రీవారి అభిప్రాయం. స్థూలంగా ధార్మిక జీవనం, సత్య, శౌచ, శమ, దమ, క్షమాదులు మొదలైన వానిని పురస్కరించుకొని చూస్తే, రెండు సభ్యతలూ సమానమైనవే అనిపిస్తుంది అని శ్రీవారు అంగీకరిస్తారు. ఇంకా వివేకం బాగా పెరిగి ఈ రెండు సభ్యతలలోని మేల్తరములైన అంశాలను కలిపి వేసి, సామరస్యాన్ని బాగా సాధిస్తారనే శ్రీ చరణుల ఆశంస.

★★★

**జీవితం దుఃఖమయం కాదు. ఈ సంసారమే దుఃఖమయం.**

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-58

# మెరిసింది సరికొత్తవెలుగు-1

## మారిన భావనా సరళి

తమ ఆశ్రమంలో ధ్యానం, ఉపాసన, ప్రార్థన దినచర్యలో అంతర్భాగాలుగా ఉండాలని శ్రీరామ్ భావించారు. ఆయన ఒక అనుశాసనాన్ని కూడ రూపొందించారు. భవిష్యత్తులో తాము నెలకొల్పే ఆశ్రమంలో సాధ్యమైనంత వరకు పై నియమాలు అమలు జరగాలని ఆయన నిర్ణయించారు. పొరపాటున కూడా ఏ నియమమూ ఉల్లంఘించబడకూడదని ఆయన భావించారు.

అరవింద ఆశ్రమంలో రెండు రోజులు గడిపి, ఆశ్రమ జీవితాన్ని అధ్యయనం చేసిన తర్వాత- శ్రీరామ్ తమ అనుభవాలనూ, ప్రతి స్పందనలనూ లిపిబద్ధం చేశారు. ఆ వ్యాసంలో పై వాక్యాలను పెద్ద అక్షరాలలో వ్రాశారు. 'సైనిక్' పత్రిక సాప్తాహిక అనుబంధంలో ఆ వ్యాసం ప్రచురితం అయింది. 'నవ యుగ కా వితాన్' (నవ యుగం రూపురేఖలు) అనే శీర్షికతో ముద్రించబడిన ఆ వ్యాసంలోని కొన్ని భాగాలు ఆతర్వాత ఇతరత్రా కూడ ప్రచురితం అయినాయి. అధ్యాత్మనూ, జీవితాన్నీ సమన్వయపరచాలనే ఏకాగ్రత అరవింద ఆశ్రమంలో అనుభవంలోకి వచ్చింది. దానిని సాధకులలో ఎలా నిర్మాణం చేయాలన్న మీమాంస వారి మనస్సులో చెలరేగింది. మనస్సులోని ఒక పొర అనుకూలంగా ఉంది. మరో పొర వ్యతిరేకంగా ఉంది. మనస్సులోని వివిధ పొరలలో ఆలోచనా మథనం జరుగసాగింది. ఈ మథనంలోనుండి మార్గం వెలికివచ్చింది.

ఆగ్రాకు తిరిగివచ్చిన తర్వాత శ్రీరామ్ గతంలోవలె తన పనులలో నిమగ్నం అయినారు. అయితే కొత్తది ఏదోఒకటి చేయాలనే సంకల్పం ఆయనలో ఏర్పడసాగింది. రాజకీయ వాతావరణం చల్లబడింది. దక్షిణ భారత యాత్ర పూర్తయింది. ఆతర్వాత- వార్తా ప్రపంచానికే పరిమితం కాకూడదన్న భావన ఆయనలో మరింత బలపడింది. వార్తలలో అర్థం లేదు. వార్తలు కొన్ని విషయాలను తెలుపుతాయి. కొద్దిసేపు ఆవేశాన్ని కూడ కలిగించగలుగుతాయి. కానీ దానివల్ల ఆశయం నెరవేరదు.

శ్రీరామ్ ఏ ఆశయాన్ని సాధించదలచారు? లోపల కూర్చున్న మరో శ్రీరామ్ ప్రశ్నించారు. సమాధానమేదీ రాలేదు. చాలాసేపటి వరకు మౌనం రాజ్యమేలింది. ఈ మీమాంస, ఈ ద్వంద్వం, ఈ తర్జనభర్జన చాలారోజులు కొనసాగింది.

మరోప్రక్క రాజకీయ కార్యకలాపాలు మందగించాయి. ఒక కుహనా ఉత్సాహమే కానవస్తోంది. దానిలో నివేదించవలసినదేదీ లేదు, రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలను నడుపుతోంది. ఈ దశను ఒక మోస్తరు సాఫల్యంగా పరిగణించినప్పటికీ- ఒకటి మాత్రం నిజం. బ్రిటిషు ప్రభుత్వమూ, కాంగ్రెసూ పరస్పర మద్దతుతో నడుస్తున్నాయి. మరోవిధంగా చెప్పాలంటే- దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఈ భాగస్వామ్యపు ఫలితాలు ఎలా ఉంటాయో ఇద్దరిలో ఎవరికీ తెలియదు.

ఇరు పక్షాలూ తమ పాత చరిత్రను మరచిపోవాలని పత్రికలు వ్రాయసాగాయి. అందులో తగాదాలూ, వాటివల్ల జనించిన వైమనస్యాలూ తప్ప మరేవీ లేవనీ, ఇద్దరూ కలసి పనిచేయడం వల్ల ఇప్పుడు అడ్డుగోడలు తొలగిపోతున్నాయనీ వివరించసాగాయి.

మహాత్మా గాంధీ ఆంతరంగిక కార్యదర్శి శ్రీ ఘనశ్యామ్‌దాస్ బిర్లాకు ఒక లేఖ వ్రాశారు. 'అహ్మదాబాద్ కమిషనర్ గైరెట్, మురార్జీ దేశాయికి స్వాగతం చెప్పడానికై రైలు స్టేషన్‌కు వచ్చాడు. ఆయనతోపాటు చాలా దూరం మూడవ తరగతి పెట్టెలో ప్రయాణం చేశాడు. దీన్ని గురించి కొంచం ఆలోచించండి- అని ఆ లేఖలో ఉంది.

## మనస్సులో ఉద్విగ్నత, అఖండ దీపంనుండి ప్రేరణ

ఈ లేఖ పత్రికలలో ప్రచురితమయింది. కాంగ్రెసు కార్యకర్తలు ఇలాంటి వర్ణనలకు ఉబ్బి తబ్బిబ్బు అవుతున్నారు. శ్రీరామ్‌కు ఈ ధోరణి నచ్చలేదు. ఇలాంటి సాఫల్యం మిధ్య అనీ, ఇసుక మేడలా ఏ క్షణంలో అయినా కూలిపోవచ్చుననీ ఆయన భావించారు. సెప్టెంబరు నెలాఖరువరకు ఆయన ఎంతో ఉద్విగ్నంగా ఉన్నారు.

**పరమేశ్వరుని పుణ్యభూమిలో దుఃఖం అణుమాత్రమయినా లేదు. మన అజ్ఞానమే మనకు దుఃఖం.**

ఆశ్వయుజ నవరాత్రులు ఆరంభం అవుతున్నాయి. ఆ ముందు రోజు సాయంత్రం వారు నవరాత్రి విశేషపూజకు సంకల్పం చేసి నిద్రపోయారు. ఈ ద్వంద్వ స్థితినుండి బయటకు తేవలసిందిగా ఇష్ట దేవతకు ప్రార్థన ఆ సంకల్పంలో జోడించబడింది.

మరునాడు ఉదయం వారు నిద్రలేచారు. స్నానాదులు ముగించి సాధనకు కూర్చున్నారు. 12 సంవత్సరాల క్రితం వెలిగించినదీపంపై వారి దృష్టి నిలచింది. వారు తమను తాము ఆ వెలుగులో విలీనం చేసుకున్నారు. ఉపాసన ముగిసింది.

వారి దృష్టి తిరిగి ఆ దీపంపై లగ్నమయింది.

దీపం.... అఖండ దీపం. ఆ తర్వాత వారి చిత్తంలో శబ్దాలు ఇలా పెల్లుబికాయి.

జ్యోతి–దీపపు జ్యోతి–అఖండ దీపం–దీపపు 'అఖండ జ్యోతి'.

ఈ పేరుతోనే ఒక పత్రికను ప్రారంభించాలి.

పూజాగృహంలో వెలుగుతూన్న దీపం అక్కడి వాతావరణాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంతివంతం చేస్తోంది. దాని ప్రేరణతోనే ఉద్భవించిన పేరు 'అఖండ జ్యోతి' పత్రికను వెలువరించాలనే తమ నిర్ణయాన్ని కొద్ది రోజులలోనే తన సహచరులకు తెలిపారు.

'సైనిక్' పత్రికలో పని చేస్తూన్నప్పుడు అందుతూవచ్చిన జీతం ఖర్చులకు సరిపోయేది. ఏమీ మిగిలేది కాదు. స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనే సమయంలో అనుష్ఠానంలో, మహాపురశ్చరణలో కొన్ని జరపడానికి మార్గదర్శక సత్తా సడలింపులు అనుమతించారు. ఆ గడువు ముగిసింది. ఇప్పుడు పూర్వంలోవలె కఠోరమైన అనుష్ఠానాన్ని వారు స్వీకరించారు. జపతపాలు ఇంతకు ముందుకూడా సాగుతూవచ్చాయి. భోజనం, నిద్ర, మేలుకొనడం, జన సంపర్కములపై మరింతగా అదుపు చేశారు. ఇందువల్ల కూడ సాధనాలను సమీకరించడానికై అదనంగా చేయదగినది ఏదీ లేకపోయింది.

శ్రీరామ్ స్వగ్రామం ఆవల్‌ఖేడా వెళ్లారు. తాఈజీకి తమ నిర్ణయాన్ని తెలిపారు. ఆమె ఒకేఒక ప్రశ్న వేశారు– "ఇది మీ గురుదేవులు చెప్పారా?"

శ్రీరామ్ అవునన్నట్లు తల ఊపారు.

తాఈజీ ఇలా తియ్యంగా ఎత్తిపొడిచారు–

"మరి స్వరాజ్యం సంగతి ఏమిటి? దానికోసం ఇక పనిచేయవా?"

శ్రీరామ్ ఇలా జవాబు చెప్పారు–

"అమ్మా ! స్వరాజ్యం కొద్ది సంవత్సరాలలో వస్తుంది. ఇక నేను రామరాజ్యం కోసం పనిచేయాలి. గురుదేవులు ఇదే చెప్పారు."

ఆ మాట విన్న తాఈజీ రామరాజ్యాన్ని ప్రస్తావనచేసే ఈ చేపాఈని నెమరువేసుకున్నారు–

**దైహిక దైవిక భౌతిక తాపా ।**

**రామరాజ్ నహి కాహుహి బ్యాపా ।**

"ఈ రామరాజ్యమేనా" –అని ఆమె అడిగారు.

**తాఈజీకి లభించింది మనశ్శాంతి**

ఇలా చెపుతూ ఆమె శ్రీరామ్‌కు దృష్టి తీశారు. (బలైయావీ) పత్రిక ప్రచురణకు సన్నాహాలు జరపడానికి అనుమతి ఇచ్చారు. శ్రీరామ్ ఇక ఉద్యమాలలో, ధర్నాలలో చిక్కుకోరని ఆమె సంతోషించారు. ఇక ఉరుకులూ పరుగులూ ఉండవు, అరెస్టు నుండి తప్పించుకునే అవసరం ఉండదు– అని ఆమె భావించారు. ఆమె ఇలా అన్నారు–

"భగవంతుడు నీకు అప్పగించిన పనికి నా ఆశీస్సులు ఉన్నాయి. నా కోరిక చాలా చిన్నది. అది నీకు తెలుసు."

శ్రీరామ్ ఇలా అన్నారు–

"అవునవును. నాకు తెలుసు. నేను మిమ్మల్ని వదిలి వెళ్లడమూ లేదు. మిమ్మల్ని ద్వారకాధీశుని స్థలం వ్రజభూమి నుండి బయటికి తీసుకువెళ్లము."

రాక పోకలకు అవకాశం ఉన్న కొత్త విషయం వచ్చినప్పుడల్లా తాఈజీ పట్టుదల ఒక్కటే– ఆయన సన్యాసుల్లో కలియకూడదని. ఆ సంగతి ఈసారికూడ ఆయనకు గుర్తుచేయాలని ఆమె అనుకున్నారు. ఆమె అడగకుండానే శ్రీరామ్ తన మాటకు కట్టుబడి ఉంటానని మరోమారు చెప్పారు.

ఆవల్‌ఖేడాలో ఆయన మరి మూడు రోజులు ఉన్నారు. తన పథకాలపై చర్చించదగిన వ్యక్తులు గ్రామంలో లేరు. చర్చకు ఇది అనుకూల విషయం కాదు. కాని, ఏకాంతంగా చింతన చేయడానికి చాలా అనుకూలం ఇది. ఆలోచనకూ, ఆత్మసమీక్షకూ, మౌలిక చింతనకూ ఇంతకుమించిన ఆదర్శ పరిస్థితి ఉండబోదు.

## అఖండ జ్యోతికి రూపకల్పన

శ్రీరామ్ తమ పథకాలను లిపిబద్ధం చేస్తూ వచ్చారు. పెక్కు కాగితాలమీద వ్రాశారు. వాటిని పారవేశారు. పత్రికలోని విషయ

విధానం లేకపోతే - విద్వాంసునికీ, మూర్ఖునికీ తేడా తెలియదు.

సామాగ్రి, వాటి ఎంపిక, వాటిని ఎడిట్ చేయడం, పంపిణీ వ్యవస్థ, ప్రసారం వంటి అన్ని కోణాలపై ఆలోచన సాగించారు. పని అంత సులువైనది కాదని గుర్తించారు. సహచరులు లేకుండా ఒక అడుగయినా ముందుకు వేయడం సాధ్యపడదు. సహచరులకు కొద్దో గొప్పో అనుభవం ఉండాలి. కొద్ది పరిజ్ఞానం కలిగిన వ్యక్తులతో కొత్త పత్రికను నడపలేము. ఇందుకు పరిష్కారం ఆయన లోపలనుంచే వచ్చింది. ఆగ్రా వెళ్లి వాకబు చేయాలి. పత్రికా రంగంలో ఏర్పడిన మాంద్యస్థితి వల్ల పలువురు కొత్త అవకాశాల కోసం వెదుకుతూ ఉండవచ్చనే ఆలోచనకూడ వచ్చింది. వారిని సహచరులుగా చేసుకోవచ్చు.

శ్రీరామ్ ఇలా చింతన-మననాలలో మునిగి ఉండడం చూచి, తాఈజీ ఇలా అడిగారు-

"నిన్నటి నుంచీ చూస్తున్నా- ఇంత పరధ్యానం ఎందుకు? ఏదైనా ఇబ్బంది ఉందా?"

శ్రీరామ్ ఇలా అన్నారు-

"లేదమ్మా ! మనస్సు అలసిపోయి ఉంది. అందువల్ల మౌనంగా ఉన్నాను."

తాఈజీ ఇలా అన్నారు-

"అయితే విశ్రాంతి తీసుకో. రామరాజ్యాన్ని ప్రారంభించడానికి చింతించవలసిన అవసరం లేదు. సాధనాలన్నీ సమకూరుతాయి. నేను సమకూర్చుతాను. తండ్రి తాతలు సంపాదించిన ఈ ఆస్థి మరెప్పుడు ఉపయోగపడుతుంది?"

ఆమె శ్రీరామ్ తలపై చేయి ఉంచారు. ఆయన తలను కొద్దిగా ఊపారు. ఆయన ఎదురుగా కూర్చున్నారు. ఆ తర్వాత ఇలా అడిగారు-

"కోడలినీ, ఓమ్‌నూ అక్కడికి తీసుకువెళతావా?"

శ్రీరామ్ తల్లిగారి ముఖం చూస్తూ ఉండిపోయారు. తాఈజీ ఇలా అన్నారు-

"ఇంతవరకు పత్రికలో పలువురు వెంట ఉన్నారు. హాయిగా పని సాగిపోయేది. కొత్త పని ప్రారంభిస్తే ఒంటరివాడివి అయిపోతావు, చేదోడు వాదోడుగా ఎవరు ఉంటారు."

తాఈజీ కొద్ది క్షణాలు ఆగారు. తిరిగి ఇలా అన్నారు-

"ఇలా చెయ్యి. కోడలినీ, శ్రద్ధనుకూడా తీసుకువెళ్లు. ఓమ్‌నూ, దయనూ ఇక్కడ వదిలివెళ్లు. వారిద్దరి సంగతి నేను చూచుకుంటాను. శ్రద్ధ చిన్న పిల్ల. దానికి తల్లి అవసరం అవుతుంది."

## ఆగ్రా ప్రయాణానికి సన్నాహం

తాఈజీ మాటకు శ్రీరామ్ సమాధానం చెప్పలేదు. ఆమెయే ఇలా అన్నారు-

"స్వరాజ్యం వచ్చేవరకూ పిల్లలను ఇక్కడే ఉంచమని నేను నీకు చెప్పిఉన్నాను. నీవు దాని విషయం ఆలోచిస్తున్నావేమో, నేను నా మాటకు కట్టుబడి ఉంటాను. నీ బాగోగులు చూచుకోవడానికి కోడలు ఆగ్రాలో ఉంటుంది. నాకు ప్రతినిథిగా ఉంటుంది."

ఈ మాటకూడ శ్రీరామ్ మౌనంగా విన్నారు. ఆ మౌనం అంగీకారమేనని ఆమె భావించారు. ఆ ప్రకారం ఆగ్రాలో ఉండడానికై ఉప్పూ, పప్పూ, పాత్ర సామాను, ప్రక్క బట్టలు, దుస్తులు, ఇతర సామాను సేకరించి ఒకచోట ఉంచడం ఆమె ప్రారంభించారు. తాను సకుటుంబంగా వెళ్లడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని శ్రీరామ్ గ్రహించారు. ఆగ్రాలో తాను ఉన్న ఇల్లు ఇప్పుడు చాలదు. 'అఖండ జ్యోతి' పత్రికను ప్రారంభించడానికి ప్రత్యేకంగా ఒక గది అవసరం అవుతుంది. తాను భార్యతో, పిల్లలతో కలసి ఉండాలని తాఈజీ చేసిన నిర్ణయం సరైనదే అని ఆయనకు అనిపించింది. అయితే ఇంటి విషయంలో మరికొంత పని జరగాలి. కొద్ది రోజులు ఆగవలసిందిగా ఆయన కోరారు. తాఈజీ సరే అన్నారు.

★★★

## అందరికీ ఆహ్వానం

గాయత్రీ చేతనాకేంద్రం హైదరాబాదు 3వ వార్షికోత్సవం 8-02-09 నాడు నిర్వహించబడుతుంది. ఉదయం 9 గంటలనుండి సామూహిక సత్యనారాయణవ్రతం, గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడతాయి. భోజన ప్రసాదవితరణ ఉంటుంది. అందరు ఆహ్వానితులే.

**మీ అశ్విని సుబ్బారావు**
*ఆంధ్రప్రదేశ్ సంయోజకులు*
*హైదరాబాద్*

**అవిద్య అంటే జీవన లక్ష్యం లోపించడం.**

మనం-మన ఆరోగ్యం

# పంచ మహాభూతాలు-వాయుతత్వం-ఆయుర్వేదం-2

ఆయుర్వేదంలో వాయుతత్వచర్చను గురించి తెలుసుకున్నపుడు, దానిని ఆధునిక జీవనశైలితో పోలిస్తే ఈ అభివృద్ధి చెందిన ఆధునికతలో మనం వాయుకాలుష్యాన్ని పెంచి పోషిస్తున్నామని తెలుస్తుంది. వాయువు ద్వారా ప్రసరించే ఎపిడెమిక్స్, ఎలర్జీ ఇందులోనే వస్తాయి. ఈ పారిశ్రామిక విశ్వంలో ఇది మహమ్మారిలాగా శ్వాస సంబంధమైన రోగాల్నీ, రోగుల్నీ పెంచుతోంది. క్రిందటి సంచికలో వాయు సంబంధమైన ఆయుర్వేద చర్చ విపులంగ తెలుపబడింది. ఈ సంబంధంగా లోక శిక్షణ అత్యంత ఆవశ్యకము. ఇప్పుడు నిర్మాణమవుతున్న ఇళ్లల్లో గాలి, వెలుతురు వ్యవస్థ సరిగ ఉండడం లేదు. ఈ విషయంలో ఆయుర్వేదం చాలా విషయాలను గురించి బోధపరిచింది.

## గాలి రాక, పోకల వ్యవస్థ (వెంటిలేషన్)

చదువుకున్న వారిలోనూ, కొద్ది సాధనాలున్న వారిలోనూ, చిన్న చిన్న ఇళ్లలో ఉన్న వారిలో కూడ వెంటిలేషన్ గురించిన జ్ఞానముండడంలేదు. ఎయిర్ కండిషనర్, కూలర్ల సంస్కృతి రకరకాల శ్వాస రోగాల్నీ, సైనొసైటిస్, బ్రాంకైటిస్, ఆస్మా, టెంషన్స్ మొదలైన రోగాలకు కారణమౌతోంది. ఇళ్లలో ఏ విధమైన ఆటంకము లేక వచ్చిపోయే గాలిని వెంటిలేషన్ అంటారు. ఎన్ని ఎగ్జాస్ట్ ఫాన్స్ పెట్టుకున్న కూడ శుభ్రమైన తాజా గాలి ననుభవించే ఆనందం ఎక్కడుంటుంది? గృహాల్లో కానీ, గ్రామాల్లో కానీ, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, నగరాల నిర్మాణం వాస్తురీత్యా గాలి నిరాటంకంగ ప్రసరించే విధంగ ఉండాలి. క్రాస్‌వెంటలేషన్ అవసరం. నివాసస్థానాల వద్ద ఫాక్టరీలు చిన్నవి కానీ, పెద్దవి కానీ వాయువును కాలుష్యం చేసేవి ఉండకూడదు. వెంటిలేషన్ రెండు విధాలుగ ఉంటుంది.

రెండు రకములైన ప్రక్రియలు.

1) బాహ్య వెంటిలేషన్ (ఎక్స్‌టర్నల్ వెంటిలేషన్)

2) లోపలి వెంటిలేషన్ (ఇన్‌టర్నల్ వెంటిలేషన్)

బాహ్య వెంటిలేషన్ ఏమిటంటే నగరాలు, కాలనీలు, వీధులు, గ్రామాల్లో నలుదిక్కులా గాలి ఎక్కువగ ప్రసరిస్తుండాలి. అలాకాకపోతే ఇళ్లలో వెంటిలేషన్ ఉండడం అసంభవం. వాటికొరకు క్రింద సూచింపబడిన పద్ధతులను అవలంబించాలి.

(1) పల్లెలు, పట్టణాలు, కాలనీలలో మైదానంలో శుద్ధమైన వాయువు ప్రసరించాలి. ఆరోగ్యకరమైన వృక్షాల్ని పెంచాలి. ఆరోగ్యకరమైన స్థానాల్లో ఇళ్లు నిర్మించబడాలి. ఇప్పుడు జరుగుతున్నది ఏమిటంటే పట్టణంలోని మలిన పదార్థాలన్నిటిని బయట కుప్పలు పోస్తున్నారు. కొద్దికాలం తర్వాత అక్కడ కాలనీలు కట్టడం, నగర విస్తారణ జరుగతోంది. అస్వాస్థ్యకరమైన ఈ ప్రక్రియ అన్ని నగరాల్లోనూ కనబడుతోంది. ఈ సంబంధంగ వాస్తు శాస్త్రజ్ఞులతో, ఆరోగ్యసంబంధమైన అధికారులతో కలసి ఒకచోట కూర్చొని నగర ప్రణాళికను తయారు చేయాలి. సిటి స్లమ్ ఏరియాస్, గ్రామాలు కూడ పట్టణాలను అనుకరిస్తూ ఇళ్లు కట్టుకుంటున్నారు. వీటిని నిరోధించాలి. ప్రణాళిక ఇలా ఉండాలి–

(2) ప్రతి ఇంటికి నాలుగువైపులా ఖాళీ ఉండాలి. కనీసం రెండు వైపులైనా ఖాళీ వదలాలి. ఇంట్లో ఖాళీ స్థలం ఉండి తులసి మొదలైన మొక్కలుండేలా చూడాలి.

(3) వీధులు విశాలంగ ఉండి, రోడ్లుకూడ విశాలంగ ఉండాలి. వాహనాలు వచ్చి పోవడానికి వీలుగ ఉండాలి. ఈ విషయంలో భారతదేశప్రజలు ప్రపంచంలో అందరికంటె వెనుకబడి ఉన్నారు. ఇదివరకటి నగరాలను గురించి వదలివేసినా, ఇప్పుడు కూడ నగరాలు దీని మీద ధ్యాస పెట్టడం లేదు.

(4) గ్రామాల్లోనూ, నగరాల్లోనూ తోటలూ, ఉద్యానవనాలు ఉండాలి. పండ్లనిచ్చేవృక్షాలూ, ఔషధప్రధానమైన వృక్షాలు తప్పని సరిగ ఎక్కువ సంఖ్యలో ఉండాలి. వీటిల్లో వాకింగ్ (తిరగడానికి) కావలసిన వ్యవస్థ ఉండాలి. ఈ స్థలాలను ఎవరూ ఆక్రమించకుండా చూడాలి. కాలనీలలో ఖాళీస్థలాల అవసరం ఉంటుంది.

(5) ఇంటిపైకప్పులు చాలా ఎత్తుగ ఉండాలి. పూర్వం ఇళ్లు అలాగే ఉండేవి. దీనివల్ల ఎక్కువ వేడిగానీ, చలిగానీ ఉండదు. ప్రకృతి సంబంధమైన వెంటిలేషన్ ఎప్పుడూ ఉండేది.

(6) కార్ఖానాలను ఇళ్లకు దూరంగా నిర్మించాలి. నివాసస్థలాల వద్ద చిన్నవిగానీ, పెద్దవిగానీ ఏ విధమైన ఫాక్టరీలకు అనుమతి ఇవ్వకూడదు.

(7) వీధులు ఎప్పటికప్పుడు శుభ్రంగ ఊడుస్తూ ఉండాలి. ఇందుకొరకు ప్రజలే ముందుకు వచ్చి శ్రమదానం చేయాలి.

బ్రహ్మజ్ఞానబోధయే ప్రపంచంలో అన్నింటినీ మించిన దానం.

మలమూత్రవిసర్జనకు సెప్టిక్‌టాంకులు మొదలైన వాటి సముచిత వ్యవస్థ ఉండాలి.

**లోపలి వెంటిలేషన్ –** లోపలి వెంటిలేషన్ అంటే పరిశుభ్రమైన గాలి లోపలికి వచ్చేదిగా, అపరిశుభ్రమైన గాలి బయటికి పోయేదిగా వ్యవస్థ ఉండాలి. బయట వెంటిలేషన్ బాగుంటే లోపల కూడ వెంటిలేషన్ బాగుంటుంది. కాంపౌండ్‌వాల్, కిటికీలు, గవాక్షాలు (వెంటిలేటర్స్) తగినన్ని ఉండాలి. పేకమేడల్లాంటి ఇళ్లు నిర్మాణ మవుతున్నప్పుడు వెంటిలేషన్ వ్యవస్థ ఎక్కడుంటుంది? ఇక స్లమ్స్ విషయానికొస్తే అక్కడి బస్తీలను గురించి మన ఆయుర్వేద ఋషులు ఊహించను కూడ ఊహించి ఉండరు.

ఇళ్లలో శ్వాస నిశ్వాసలు, వంట చేసినందువల్ల వచ్చిన పొగ, అగర్‌బత్తీల గాలి వేడై పైకి పోతుంది. కార్బన్ డై ఆక్సయిడ్ వంటి కలుషిత గాలి కూడ పైకి పోయి నిలుస్తుంది. ఇంటి పై భాగంలో గవాక్షాలు ఉంటే కలుషితమైన గాలి బయటకు వెళ్లిపోయి, పరిశుభ్రమైన గాలి లోపలికి వస్తుంది. క్రింద కిటికీలు, పైన గవాక్షాలు ఉంటే లోపల వెంటిలేషన్ బాగా ఉంటుంది. ఇప్పటి పరిస్థితుల ప్రకారం వంటగదిలో గ్యాస్‌కుకింగ్‌రేంజ్, శౌచాలయంలో ఎక్సాస్ట్ పంఖాలు ఉండితీరాలి.

## కావలసిన కొన్ని యంత్రాలు

ప్రతి వ్యక్తికీ ప్రతి గంటకు 3000 ఘనపుటడుగుల శుద్ధ వాయువు తప్పనిసరిగ కావాలి. రోగులకూ, కష్టపడి పనిచేసే వారికీ ఇంకా ఎక్కువ శుద్ధమైన గాలి అవసరం. అటువంటప్పుడు బయట, లోపల కూడ వెంటిలేషన్ వ్యవస్థ తప్పనిసరిగ ఉండాలి. ఇప్పుడు చాలా రకాలైన వెంటిలేటర్స్‌ను తయారు చేస్తున్నారు. సివిల్ యంత్రాలలో మహత్వపూర్ణ విషయం ఇది. వీటిల్లో కొన్ని హింక్స్ వర్ఢ్స్ విండో, లోయర్ వెంటిలేటర్, కూపర్స్ విండో వెంటిలేటర్, హోపర్ విండో వెంటిలేటర్, టావిస్‌వాల్, ఎలీసన్స్ బ్రింక్, సేవివిల్లరూఫ్ వెంటిలేటర్, వీటన్నిటివల్ల బయటినుండి శుద్ధ వాయువు లోపలికి, లోపలి అశుద్ధ వాయువు బయటికీ పోతుంది.

## వాయు శుభ్రత

ఎక్కువ ప్రెషర్‌తో శుద్ధవాయువు లోపలికి వచ్చేవిధంగా చేస్తే వాయువు శుభ్రపడుతుంది. ఆయుర్వేదం కొన్ని మొక్కలద్వారా ఈ పని జరుపవచ్చని తెలియ చేసింది. కర్పూరం, అగరు, నిమ్మ, దేవదారు, చందనం, తేజపత్రం, గంధకం, గుగ్గిలం, శాకల్యం మొదలైన వాటిని ప్రజ్వలింపచేసి నపుడు వాయువు శుభ్రపడుతుంది. రూమ్ ఫ్రెషనర్ స్థానంలో ఈ ప్రాకృతిక ప్రయోగాలు చేస్తుంటే ఆరోగ్యకరం. అప్పుడప్పుడు ఇళ్లలో హవనం చేసినందువల్ల గాలి శుభ్రపడుతుంది. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలోని ఒక విద్యార్థికి దీనిపైన శోధగ్రంథం వ్రాసినందుకు పి.హెచ్.డి. డిగ్రీ లభించింది. అతను ప్రయోగం చేసి యజ్ఞం వల్ల గాలి శుభ్రపడుతుందనీ, చెడు కలిగించేది బయటికి వెళ్లిపోతుందని నిర్ధారించారు. ఈ పరిశోధనా గ్రంథం సంస్థయొక్క వెబ్‌సైట్‌లో లభ్యమవుతుంది. పరిశోధనను గురించిన చాలా పేపర్లు అంతర రాష్ట్రీయ పత్రికలలో ముద్రింపబడ్డాయి. యజ్ఞోపతి యొక్క అతిపురాతన విధానం అత్యధిక ఉపయుక్తకరం. దీనిని గురించి ముందు ముందు ఇంకా తెలుసుకుందాం.

★★★

## సచ్చిదానంద విజయం

*సంత్‌జ్ఞానేశ్వర్ తీర్థయాత్రలు చేస్తూ మహారాష్ట్రలోని నేవాగ్రామం చేరుకున్నాడు. ఆతని దగ్గరకు ఒక స్త్రీ భోరుభోరున ఏడుస్తూవచ్చింది. స్వామి కారణం అడిగాడు. ఆమె చనిపోయిన తన భర్తను బ్రతికించుమని కోరుకుంది. భర్త పేరును అడిగాడు స్వామి. 'సచ్చిదానంద్' అని చెప్పింది. 'సచ్చిదానందుకు మరణంలేదు. అతడు అమరుడు" అన్నాడు స్వామి. ఆమె ఎంతో ఆశతో ఒక్కఉదుటున ఇంటికి పరుగుదీసింది. మంచంమీద పడిఉన్న శవం అలాగే పడిఉంది. మళ్లీ పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆమె దుఃఖానికి అంతేలేదు.* జ్ఞానేశ్వర్ చిరునవ్వుతో ఆమెను ఓదార్చి, జననమరణ రహస్యాలను, ప్రకృతి సహజమైన సిద్ధాంతాలను చక్కగా విడమర్చి చెప్పాడు. ఆయన చెపుతూనే ఉన్నాడు. ఆమె వింటూనే ఉంది. చిట్టచివరకు ఆత్మయొక్క అమరత్వాన్ని అర్థం అయ్యేలా వివరించాడు. దానితో ఆమె దుఃఖం ఉపశమించింది. కన్నులు తుడుచుకుని కర్తవ్యాన్ని నిర్వహిస్తానంటూ ఇంటికి వెళ్లిపోయింది. ఆనాడు ఆయన చేసిన ఉపదేశాలు తరువాత "సచ్చిదానంద విజయం" అన్న పేరుతో గ్రంథం రూపంలో వచ్చాయి. అనేకమైన అద్భుతవిషయాలు, సంఘటనలు జ్ఞానేశ్వరుని ఉపదేశాలద్వార లభిస్తాయి. కాని ఈశ్వరభక్తి ద్వారా అద్భుతాలు ప్రకటించడం ఆయనకు ఇష్టంఉండేదికాదు. అద్భుతాల సృష్టి ఆత్మకల్యాణానికి ఆటంకంగా భావించేవాడు.

మనిషిని సన్మార్గంలోనికి తేవడానికి దుఃఖాన్ని మించిన వస్తువు లేదు.

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-29

# శక్తిపీఠాల స్థాపన-1

24 శక్తిపీఠాలు ఏర్పాటు చేయాలని గురుదేవులు సంకల్పించారు. వాటి ప్రారంభోత్సవాలకు నేను వెళ్లాలని సూచించారు. గురుదేవులు ఎక్కడకూ వెళ్లడంలేదు. వారు సూక్ష్మీకరణ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారు. సూక్ష్మీకరణ అంటే భౌతిక శరీరాన్ని అదృశ్య శరీరంగాను, కాంతిశరీరంగానూ మార్పుచేయడం. మొదటి శక్తిపీఠం గుజరాత్‌లోని శ్యామలాజీలో నిర్మాణం అయింది. ఈ శక్తిపీఠాన్ని నేనే ప్రారంభం చేయాలని గుజరాత్ కార్యకర్తలు నిర్ణయించారు. గత 7 సంవత్సరాలనుండీ, గురుదేవులు పర్యటనలకు వెళ్లలేదు. మధురలోని సంస్థపని మాత్రం నేను పర్యవేక్షిస్తున్నాను. గురుదేవులు మొదటిశక్తిపీఠం ప్రారంభోత్సవానికి కార్యక్రమం తయారు చేశారు. నేను, గురుదేవులు మాత్రమే అక్కడకు వెళ్లాలని వారినిర్ణయం. ఢిల్లీ వరకు కారులో ప్రయాణించారు. తర్వాత రైలులో మధుర వచ్చారు. మధుర నుండి గురుదేవుల వద్ద నేను కూర్చున్నాను. మధుర స్టేషనులో పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. గురుదేవుల దర్శనానికి. జనం సౌకర్యం కొరకు బండిని 15 నిమిషాలు పైగా అక్కడే ఉంచారు స్టేషనుమాష్టరు.

మామూలుగా ఆ బండి భరత్‌పూరులో ఆగదు. కాని అక్కడి ప్రజలు గురూజీ దర్శనం కోసం అక్కడ బండిని ఆపించారు. అక్కడ పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. అక్కడ నుండి ప్రతిచోట పెద్ద సంఖ్యలో జనం వచ్చి గురూజీ ఒక్క క్షణమయినా నిద్రించడానికి వీలులేకుండా చేశారు.

'కోట' స్టేషను వస్తుండగా గురుదేవులు కొంచంగా కళ్లు మూసుకున్నారు. ఒకటి, రెండు నిముషాలకన్నా అక్కడ బండి ఆగదని అనుకున్నాను. గేటుదగ్గర నిలబడ్డాను. ఒకటి రెండు నిముషాలు నేను జనంతో మాట్లాడుతూ ఉంటే బండి బయలుదేరుతుంది, గురూజీకి ఇబ్బంది కలుగదు అని. బండిఆగగానే నేనుఅనుకున్న విధంగానే, జనంతో మాట్లాడటం ప్రారంభించాను. ఇంతలో ఒక పోలీసు అధికారి వచ్చి, పండిట్‌జీ, గురూజీని నేను బాగా ఎరుగుదును. మాట్లాడుతూ మీరు ఇక్కడ నిలబడితే బండి బయలుదేరుతుంది. వారిని నేను చేయిపట్టుకొని ఇక్కడి వేదికపైకి తీసుకొని వస్తాను. అందరూ దర్శించుకుంటారు-" అన్నాడు. ఆ మాటలు విని నేనులోనికిపరుగెత్తి, 'గురూజీని లేపి, గురూజీ ఇక్కడ కూడా జనం చాలామందిఉన్నారు. మీరు బయటకు రాకపోతే అంతా లోనికివచ్చేటట్లుగా ఉన్నారు'- అన్నాను. గురుదేవులు బయటకు వచ్చి అందరికీ దర్శనం ఇచ్చారు. కొందరు బండిని 20 నిమిషాలు ఆగేవిధంగా ఏర్పాట్లు చేసారు. ఈ విధంగా ప్రతి స్టేషనులోనూ బండి ఆలస్యం అవుతూ ఉంది. బండి 'గోద్రా' చేరేసరికి, అక్కడ ప్రజాసమూహానికిఅంతులేదు. గురూజీతో అన్నాను-' గురూజీ ఈ జనసమూహాన్ని మీరే ఆపగల్గుతారు. గురూజీపైకి దండలు విసరడం జరిగింది. మా అందరికీ ఆహారం ఏర్పాట్లు చేసారు. ఆనంద్ స్టేషనులోనూ జనవాహిని. గురుదేవులు మాత్రమే జనాన్ని అదుపుచేయగలరు. అహమ్మదాబాద్‌లో జనాన్నిఆపడం నావల్ల కాలేదు. గురూజీతో, 'మీరేవెళ్లి వారిని అదుపుచేయండి. నేను సామానులు జాగ్రత్తగా చూసుకుంటాను' -అన్నాను. అదే ఆఖరు స్టేషను. దాదాపు గంటకుపైగా ద్వారంలో గురూజీ నిలబడ్డారు. 500 మంది పోలీసులు, 1000 మంది కార్యకర్తలూ జనాన్ని అదుపులో ఉంచలేక పోయారు. పోలీసులను బలప్రయోగం చేయవద్దని గురూజీ శాసించారు. వేదిక దగ్గరగా నన్ను రానీయండని గురూజీ సంజ్ఞ చేశారు. జనం దారి ఇచ్చారు. అక్కడ ఒక కారు ఆపిఉంది. గురూజీ దానిపైకి ఎక్కారు. సీ.బీ.ఐ. అధికారి 'పాండ్యాజీ' గురూజీతో ఉన్నారు. కారును త్వరగా పోనీయమని చెప్పారు. ఆ కారు వెంటనే బయలుదేరి త్వరగా అక్కడ నుండి వెళ్లింది. వేల సంఖ్యలో ప్రజలు పూలదండలతో, స్త్రీలు పూర్ణకుంభాలతో అక్కడ నిలబడి ఉన్నారు. అక్కడ ఒక గుర్రపు బగ్గీ కాచుకొని ఉంది. జనం రద్దీ తగ్గిన తర్వాత సామానుతో నేను దిగాను. గురూజీ బల్వంత్‌భాయ్ గృహంలో ఉండే ఏర్పాట్లు చేశారు. గురూజీ అక్కడకే వెళ్లి ఉంటారని అనుకున్నాను. జనం అందరూ అక్కడకు చేరారు. గురూజీ మూడో అంతస్తులోని గదిలోనికి వెళ్లారు. ప్రధాన ద్వారం మూసివేశారు. వెనుక రోడ్డునుండి నేను ఆ గృహంలోకి వెళ్లాను. బల్వంత్‌భాయ్ అక్కడ విస్తృతమైన ఏర్పాట్లు చేసారు. జనం

అహంకారం ఒకవిధమైన మానసికరోగం.

చెప్పులతో ఇంట్లోకి జొరబడి, అక్కడ అంతా మురికి చేసారు. అక్కడి అలంకరణ అంతా పాడైపోయింది. నేను గురూజీ దగ్గరకు వెళ్లి, 'మీరు దర్శనం ఇవ్వకపోతే జనం వెళ్లిపోరు– అన్నాను. పై అంతస్తునుండి జనానికినచ్చచెప్పాను. దగ్గరలో ఉన్న ఖాళీ స్థలంలో అందరూ కూర్చోండి. గురూజీ దర్శనం ఇస్తారు– అన్నాను. అక్కడ ఒకవేదిక ఏర్పాటుచేసారు. నేను గురుదేవులను అక్కడికి తీసికొనిపోయి అందరికీ దర్శనం ఇప్పించాను. బుద్ధాబాయ్ కూడా ఆ జనంలో ఉన్నారు. గురుదేవులు 'ఢిల్లీ' వెళ్లి, 'శ్యామలాజీ'లో శక్తిపీఠాన్ని ప్రారంభించాలి. బుద్ధాభాయ్‌నిపిలిచి, అక్కడి ఏర్పాట్లను గూర్చి అడిగాను. ఆయన నన్నుచూసి ఏడ్వడం ప్రారంభించారు. విషయం ఏమిటని అడిగితే ప్రక్కన ఉన్నవారు, ఆయన కుమారునికి దెబ్బతగిలి ఆసుపత్రిలో చేరాడనీ, అతని గొంతు మూగబోయిందనీ అక్కడి డాక్టర్లు ఆశలు వదలి పిల్లవానిని ఇంటికి తీసుకొని పొమ్మన్నారనీ చెప్పారు. ఈ విషయాలు గురూజీకి వివరించాను. గురూజీ వెంటనే ఆసుపత్రికి వెళ్లి, పిల్లవానిని చూసారు. డాక్టర్లంతా ఆక్కడకు చేరారు. గురూజీ మూడుసార్లు ఆ పిల్లవాని తలపై తన చేయి త్రిప్పి వానిని పిలిచారు. పిల్లవాడు కళ్లు తెరిచాడు. డాక్టర్లంతా ఆశ్చర్యపడ్డారు. గురూజీ పాదాలపై పడ్డారు. గురూజీ తపశ్శక్తి చాలా గొప్పది. అక్కడి నుండి 'శామ్‌లాజీ' వచ్చాము. అక్కడ జనం వేల సంఖ్యలో వచ్చారు. వారందరినీ చూసి 'యుగనిర్మాణం' తప్పనిసరిగా జరుగుతుందని అనుకున్నాను. చాలా ఆనందపడ్డాను. గాలిలో తేలుతున్నట్లుగా ఉంది నాకు.

గురూజీ నన్నుచూసి, ఏమిటి ఆనందంగాఉన్నావు? అని అడిగారు. 'గురూజీ ! 'యుగనిర్మాణం' అనేది ఒక మిధ్యగా తోచింది నాకు. కాని ఇప్పుడు పూర్తిగా నమ్మకం కుదిరింది. 'యుగనిర్మాణం' జరుగుతుందని– అన్నాను. 'నీకు ఎలా నమ్మకం కుదిరిందని అడిగారు. బండిలో కూర్చున్న దగ్గరనుండి లక్షల సంఖ్యలో జనాన్ని చూస్తున్నాను. శ్యామ్‌లాజీలో ఇంతమందిని చూస్తున్నాను. అందుకని నమ్మకం కలిగిందన్నాను. గురూజీ నవ్వారు. "ఇంత మంది జనంలో నుండి ఇద్దరు మన కార్యక్రమాలకు తోడునిలిస్తే మనం అదృష్టవంతులం. నువ్వే చూడు, నీవు వచ్చిన తర్వాత ఎంతపని జరిగిందో ఎంత వృద్ధి చెందిందో సంస్థ. ఎంత ప్రచారం జరిగిందో? ఈ జనానికి నా దర్శనం కావాలి. నా ఆశీర్వాదాలు కావాలి. నా ఆలోచనలు వారికి అక్కరలేదు. జనం ఎక్కువగా ఉంటే, అక్కడ మురికి ఉంటుంది. జనాన్ని చూసి సంతోషపడకు. ఈ జనంపై నాకు నమ్మకం లేదు. శక్తిపీఠం ప్రారంభోత్సవ సమయంలో ఆక్కడి వారితో చర్చ ఏర్పాటు చేయి. అందులో నుండి కార్యకర్తల కోసం వెతుకు" –అన్నారు. అప్పటినుండి కార్యకర్తలకోసం వెతకడం ప్రారంభించాను. జనంతో పని లేకపోయింది.

★★★

## గాంధారి చేసినతప్పు

*మహాభారత యుద్ధం ముగిశాక యాదవులు తమలో తామే కొట్టుకుచచ్చారు. శ్రీకృష్ణుని వంశం కూడ సర్వనాశనం అయింది. యమునానది ఒడ్డున కూర్చుని కృష్ణుడు ఆలోచిస్తున్నాడు. యాదవనాశనానికి కారణం గాంధారి ఇచ్చిన శాపమే అనుకున్నాడు. వందమంది కుమారులను కోల్పోయిన గాంధారిని పలకరించి వద్దామని ఆమెదగ్గరకు వెళ్లాడు. కృష్ణుని ప్రవేశంతో పుత్రశోకంతో కుమిలిపోతున్న ఆమె హృదయం భగ్గుమంది.*

*అమ్మా ! అక్కడే పొరబడుతున్నావు. కాలగతిని, కర్మ సిద్ధాంతాన్ని తప్పించడం ఎవరితరమూకాదు. నీ మటుకు నీవు జీవితకాలం కఠోరనియమాలతో, నిజాయితీగా కాలంగడిపావు. కళ్లకు గంతలుకట్టుకుని జీవితమంతా తపస్సు చేశావు. దుర్యోధనునిపక్షం కూడ ఎన్నడూ పలకలేదు. అవినీతిని ప్రోత్సహించలేదు. అయినా ఒక తప్పుచేశావు. కొడుకు కోరిన వైభవాన్నంతా ప్రసాదించావు. కాని ఒక్కసారన్నా మనసు నిండుగా దుర్యోధనుని, ఆతని సోదరులను ఆశీర్వదించలేదు. నీ శాపం కారణంగా నా వంశం సర్వనాశనమైంది. అదేవిధంగా నీ ఆశీర్వాదం ఉంటే నీ బిడ్డలు జీవించేవారు. మహాభారతయుద్ధం జరిగేతీరాలి. అవినీతి అంతరించిపోవాలి. యుగం మారక తప్పదు. ఇదే ఆ విధినిర్ణయం. నువ్వూ, నేనూ నిమిత్తమాత్రులం. దుఃఖపడవద్దు" –అని ఓదార్చాడు.*

ప్రకృతి దర్బారులో మాఫీలేదు.

సద్గుణ సంపద-1

# భౌతికతకు నైతికతతోడైతే ధార్మికత నిలుస్తుంది

భౌతికమైన అభివృద్ధిచాలదు. ఈనాడు అభివృద్ధి అంటే ఎవరైనా చెప్పేది ఏమిటి? భౌతిక సుఖసాధనాల సమృద్ధి. మనం ఏ ఊరికైనా వెళ్లి అక్కడి అభివృద్ధిని గురించి అడిగామనుకోండి. ఏం చెబుతారు అక్కడి నాయకులు? "అయ్యా ! లోగడ ఇక్కడ ఎలిమెంటరీ స్కూలు ఉండేది. ఇప్పుడది హైస్కూలు అయింది. కాలేజీ కూడ పెట్టారు. ఇదివరలో అన్నీ మట్టిరోడ్లే. ఇప్పుడు తారురోడ్లు, సిమెంటురోడ్లు వేశారు. ఇదివరకు బస్సులు లేవు. ప్రయాణం అంటే భయమయ్యేది. ఇప్పుడు ఎక్కడికైనా ప్రయాణం చెయ్యవచ్చు. బస్సులు వచ్చాయి. లోగడ చెరువునీళ్లేగతి. ఇప్పుడు మంచినీళ్లటాంకు కట్టారు. ఇంటింటికీ మంచినీళ్ల పంపులున్నాయి. ఊళ్లో కరెంటు దీపాలు పెట్టారు. టెలిఫోను ఎక్స్ఛేంజి పెట్టారు. ఫోను సౌకర్యం ఏర్పడింది. టి.వి. లు వచ్చాయి. కో-ఆపరేటివ్ సొసైటీ ఉంది. ఊళ్లో చదువుకున్నవారి సంఖ్య పెరిగింది. గ్రంథాలయం పెట్టారు. వార్తాపత్రికలుగూడ వస్తున్నాయి. మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు జరుగుతున్నాయి. వ్యవసాయంలో నూతన పద్ధతులు ప్రవేశపెట్టారు. ట్రాక్టర్లు పెట్టి దున్నుతున్నారు. పంట కాలువలు వచ్చాయి. దానితో వరి సాగు ప్రారంభమయింది." అంటూ ఎన్నెన్నో చెబుతుంటారు.

కాని మనం ఊళ్లోకి వెళ్లి కాస్త లోతుగా విచారించి చూస్తే తెలిసేదేమిటి? నాయకులమని చెప్పుకొనే వారిలో చాలమంది స్వార్థపరులు, అవినీతిపరులు, వంచకులు, కులాలపేరిట కుమ్ములాటలు రేకెత్తించేవాళ్లుగా కనిపిస్తారు. గతంలో లేని దొంగతనాలు ఇప్పుడు పెరిగిపోయినాయి. పోలీసుస్టేషను ఉన్నా లెక్కలేదు. కొత్తగా క్లబ్బులు పుట్టుకువచ్చాయి. క్లబ్బుల్లో డబ్బులు పెట్టి పేకాటలు సాగుతున్నాయి. జూదాలు సరేసరి. బ్రాందిషాపులు తెరుచుకున్నాయి. త్రాగుబోతుల సంఖ్య పెరిగిపోయింది. డబ్బున్నవాళ్లు లాడ్జీలు కట్టించారు. వ్యభిచారం మొదలైంది. ఎన్నికలు వచ్చాయి. వాటితోపాటే కొట్లాటలు ప్రారంభం. ఫలితంగా హత్యలు చోటుచేసికున్నాయి. పెద్దవారిపై గౌరవం లేదు. తల్లిదండ్రులపై బాధ్యతలేదు. ఉపాధ్యాయులమాటపై విలువలేదు. సమ్మెలు, విద్యార్థి సంఘాలు తయారైనాయి. ఆసుపత్రులు వెలిశాయి. రోగుల సంఖ్య పెరిగింది. కోర్టులు తెరిచారు. కేసులు వృద్ధిచెందాయి. పంతుళ్లు పాఠాలు చెప్పడం లేదు. డాక్టర్లు రోగాలు నయం చేయడంలేదు. లాయర్లు కేసులను ఒక కొలిక్కి రానీయరు. ప్రభుత్వోద్యోగులు ఫైళ్లు కదపరు. కదపాలంటే లంచాలు కావాలి. ఎటుచూచినా దగా, మోసం, దోపిడీ, నీతి-నిజాయితీ కనిపించకుండా పోతున్నాయి. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియడంలేదు.

సుఖ సాధనాలు పెరిగాయి. సుఖం మాత్రం లేదు. తినడానికి తిండి ఉంది. తినాలంటే భయం. డాక్టర్లు తినవద్దంటున్నారు. అన్నీ ఉన్నాయి. ఆనందంలేదు. సమస్తమూ ఉంది. శాంతి మాత్రం లేదు. అందరికీ హక్కులున్నాయి. ఎవరికీ బాధ్యత లేదు. ఎందువల్లో కారణం వెదకాలి.

ఒక్కటే కారణం. భౌతికంగా మాత్రమే అభివృద్ధి చెందాం. కాని నైతికంగా ఎదగలేదు. ఆర్థికంగా పెరిగాం. కాని ఆధ్యాత్మికంగా పెరగలేదు. మానవుల్లో నాగరికత పెరిగింది. సంస్కారం పెరగకపోగా తరిగిపోయింది. చదువు బాగానే ఉంది. సద్గుణాలు అసలేలేవు.

శోచనీయమైన విషయం. దేశానికి ప్రాణాధారం అయిన పల్లెల్లో భౌతిక అభివృద్ధీలేదు. నైతిక వాసనా లేదు. పైన చెప్పబడిన అవినీతి లక్షణాలన్నీ పల్లెల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## నైతికమైన అభివృద్ధికూడ ఉండాలి

నైతికత అంటే నీతినికలిగిఉండడం, నీతి అంటే రీతిని విడువకుండా ఉండడం. రీతి అంటే సద్గుణాలకు నిలయమైన విధివిధానం. సద్గుణాలు మానవునికి తరగని సంపద. అదే దైవీ సంపద. సద్గుణ సంపదకు మరియొక పేరు ధర్మం. ధర్మానికి లక్షణాలు 10. (1) ధృతి (2) క్షమ (3) అస్తేయం (4) శౌచం (5) ఇంద్రియ నిగ్రహం (6) లజ్జ (7) విద్య (8) సత్యం (9) అక్రోధం (క్రోధం లేకుండ ఉండుట) (10) భూతదయ. ఈ పది సద్గుణాల విలువలు మారవు. వీటిని గురించి నారదుని పరివ్రాజకోపనిషత్తులో ఉంది. మనుస్మృతిలో ఉంది. ఇది ధర్మానికి ఆచరణాత్మకమైన నిర్వచనం. వ్యావహారిక స్వరూపం. "ధర్మాన్ని మనం రక్షిస్తే మనల్ని ధర్మం రక్షిస్తుంది." అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అంటే ఏమిటి? మనం సద్గుణ సంపన్నులం అయితే, ఆ సద్గుణాల వల్ల మనం అభ్యుదయాన్ని సాధించగలుగుతాం.

పాపం ఒక అంటువ్యాధి.

శాశ్వతమైన విలువలుగల ఈ సద్గుణాలు మానవజాతితోనే ఆరంభమైనాయి. మానవ జాతి ఉన్నంతవరకు ఉంటాయి. కాని ఈ విలువల్ని దేశకాల పరిస్థితులు కోరుకోవడం లేదు. ఇవి సనాతనమైనవి. చిరపరిచితమైనవి. కొందరు ఈ విధంగా చెపుతుంటారు-

"ఇది వైజ్ఞానిక యుగం. యాంత్రికయుగం. కంప్యూటర్ యుగం. ఈనాటి స్థితిగతులను బట్టి జీవితం విలువలు కూడా మారుతాయి. మారితీరాలి." కాని బాహ్యరూపాలు మారవచ్చు. ఆచరణకు ఉపయోగించే సాధనాలు మారవచ్చు. పరిస్థితులు మారవచ్చు. స్థాయీభేదాలు ఉండవచ్చు. అయినా విలువలు మాత్రం మారవు. సద్గుణాల విలువలు ఊహలకు అందవు. పాత్రను మార్చినంత మాత్రాన పాయసం మారదు. కట్టెలు మార్చినంత మాత్రాన అగ్ని మారదు. దేవతా విగ్రహం మార్చినంతమాత్రాన పరమేశ్వరుని తత్త్వం మారదు. ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులు మారడం వల్ల జీవన మూల్యాలు మారవు. సద్గుణాల విలువ మారదు. ఎన్ని యుగాలు గడిచినా, నాగరికత ఎన్నిరూపాలు ధరించినా సూర్యుడు తూర్పుదిక్కునందే ఉదయిస్తాడు. భూమి క్రమం తప్పకుండా పయనం సాగిస్తూనే ఉంటుంది. ఋతుచక్రం యథాతథంగానే తిరుగుతూ ఉంటుంది. మనం కాళ్లతోటే నడుస్తాం. నోటితోనే తింటాం. కాకపోతే వేగం పెరగవచ్చు. విధానాలు మారవచ్చు. టెక్నాలజీ మారినంత మాత్రాన సహజ సిద్ధాంతాలు మారవు.

టెక్నాలజీ అభివృద్ధి చెందిన దానిగురించి ఒక తమాషా అయిన దృష్టాంతరం ఉంది. ఒకానొక ప్రొఫెసరు ఉపన్యాసం చెప్పడానికి వెళుతున్నాడు. ఆలస్యం అవుతోంది. ఎదురుగా ఖాళీగా ఉన్న ఆటో వస్తోంది. ఆతని ప్రాణం లేచివచ్చింది. ఒక్క ఎగురు ఎగిరి కూర్చున్నాడు. "పోనీ ! త్వరగా పోనీ ! హరియప్. బాగా స్పీడుగా పోవాలి." అన్నాడు రొప్పుకుంటూ. ఆటోడ్రైవరు ఆటోస్టార్టు చేసి స్పీడుగా పోనిస్తున్నాడు. ప్రొఫెసర్‌కు అప్పుడు గుర్తు వచ్చింది. తొందరగా పొమ్మన్నాడు గాని, ఎక్కడకు పోవాలో చెప్పలేదు. వెంటనే డ్రైవరును పెద్దగా కేకపెట్టి పిలిచాడు. "డ్రైవర్ ! నేను ఎక్కడకు పోవాలో నీకు తెలుసా?" అని అడిగాడు. ఆ డ్రైవరు ఇలా సమాధానం చెప్పాడు. "లేదు సార్. తెలీదు. మీరు త్వరగా పొమ్మన్నారుగదా! నాకు సాధ్యమైనంత స్పీడులో పోతున్నాను."

కేవలం వేగం పెరిగినంత మాత్రాన సరిపోదు. ఒక లక్ష్యం కూడా ఉండాలి. లక్ష్యశుద్ధిలేనిదే లక్ష్యసిద్ధి లభించదు. లక్ష్యం లేకుండా పరుగులుతీస్తే ఏక్సిడెంటులు జరుగుతాయి. దానివల్ల అనుకున్నది సాధించలేము. పైగా కొత్త ఇబ్బందులతో పాటు కొత్త కొత్త నష్టాలు సంభవిస్తాయి.

మనం ఎక్కడకు పోవాలి? ఏదారిన పోవాలి? ఎందుకుపోవాలి? పోయిన తర్వాత ఏంచేయాలి? ఎలాచేయాలి? మొదలైన ప్రశ్నలన్నింటికీ సమాధానాలను బుర్రలో సిద్ధంగా ఉంచుకోవాలి. ఎప్పటికీ వాటిని దృష్టిలో ఉంచుకోవడమే లక్ష్యశుద్ధి. ఆ ప్రణాళిక ప్రకారమే నడుచుకుంటే అనుకున్నది సాధించగలుగుతాం. ఆ ఫలితమే లక్ష్యసిద్ధి.

ఈ విధంగా మనం నైతికంగా కూడ వృద్ధిచెందిననాడు మాత్రమే అభివృద్ధి సాధించామని చెప్పుకోగలుగుతాము. అభివృద్ధికి భౌతికత, నైతికత రెండూ అవసరమే. రెండూ రెండు చక్రాల వంటివని మనం మరచిపోరాదు.

*(శ్రీ దోనేపూడి వెంకయ్య రచించిన "సద్గుణసంపద" గ్రంథం నుండి)*

★★★

# ప్రాంతీయ, జిల్లా సంయోజకులు, సహసంయోజకులు, ప్రముఖ కార్యకర్తలందరికి సూచన

యుగనిర్మాణ యోజనాకార్యక్రమాన్ని ముందుకు నడిపించేనిమిత్తం క్రింది విషయాలను అమలు చేయాల్సిఉంటుంది.

1. జిల్లాలో ప్రతినెల 10 ప్రజ్ఞామండళ్లు, మహిళామండళ్లు ఏర్పాటుచేయాలి. ప్రతి మండలికి కనీసం 20 మంది సభ్యులుండాలి.
2. జిల్లాలో ప్రతినెల 108 దీపయజ్ఞాలు మరియు జన్మదిన-వివాహదిన సంస్కారాలు జరిపించాలి.
3. జిల్లాలో ప్రతినెల 5 పంచకుండీయజ్ఞాలు, 24 కుండీ యజ్ఞం ఒకటి జరిపించాలి.
4. జిల్లాలో ప్రతినెల "యుగశక్తి గాయత్రి" పత్రికకు 108 చందాదారులను చేర్పించాలి.
5. ప్రతీ కార్యకర్త తప్పనిసరిగా నెలకు 200 రూపాయల సాహిత్యాన్ని అమ్మాలి.
6. పెద్దస్థాయిలో జిల్లాకు ఒకటిచొప్పున సాహిత్యస్టాలును తెరవాలి.

ఇట్లు
*ఆంధ్రప్రదేశ్ సంయోజకులు*
**అశ్విని సుబ్బారావు**

**ఆలోచనలను ఆలోచనలతోనే ఖండించాలి.**

# రోగనిర్మూలన-యోగసాధన

మానవ శరీరనిర్మాణం ఎంతో అద్భుతమైంది. విచిత్రమైంది, కష్టతరమైంది కూడ. శరీరంలో చాలా నాడులున్నాయి. ఈ నాడులన్నింటి సహకారంతోనే శరీరమనే యంత్రం చక్కగా నడుస్తోంది. ఏదేని ఒకనాడీవ్యవస్థ తగిన రీతిలో లేకపోతే అది ఇతర నాడులపై ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం చాలా కాలంవరకు ఉన్నట్లయితే రోగాలు ఉత్పన్నమౌతాయి. భిన్న భిన్న నాడులకు సంబంధించిన రోగాలు కూడ విభిన్నంగ ఉంటాయి. వీటిని ఆరోగ్యకరంగా ఉంచి చక్కగ నడపడానికి చాలా చికిత్సా పద్ధతులున్నాయి. యోగ పద్ధతి ద్వారా ఈ జబ్బులను పోగొట్టవచ్చు. వైజ్ఞానిక దృష్టితో చూచినట్లయితే ఈ వికృతులను అన్నింటినీ సమూలంగా నిర్మూలించవచ్చు.

శరీరంలోని నాడులన్నింటికీ విశిష్టమైన మహత్వముంది. కానీ జీవించడానికి శ్వాసక్రియ, భోజనం, మలమూత్రవిసర్జన అతి ముఖ్యమైన పనులు, దీని తర్వాత శరీరానికి ఆధారమైంది అస్థి నాడులు. వీటి చలనానికి ఆధారమైనవి కండరాలకు సంబంధించిన నాడులు. నరాలకు సంబంధించిన నాడులు సూచనలను పంపుతాయి. రక్తసంచారణ నాడులవల్ల జీవనం సహజరూపంలో నడుస్తుంది. ఇతరనాడులు కూడ తమతమ బాధ్యతలను నిర్వర్తిస్తాయి. ఈ నాడులన్నీ చాలా ఆరోగ్యంగా ఉండడం అవశ్యకం. లేకపోతే శరీరం రోగగ్రస్థమౌతుంది.

ఆహారాన్ని జీర్ణం చేసే ప్రక్రియను జరుపునాడులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు మనిషి  ఆరోగ్యంగా ప్రసన్నంగా ఉంటాడు. భోజనంలోని వివిధాలైన రుచులను కడుపులోకి చేర్చి మనస్సుకు తృప్తిని కలిగించేవి జీర్ణనాడులే. దీనిలో ఏ విధమైన మార్పయినా చాలా కాలం ఉన్నట్లైతే నానారకాలైన రోగాలు చుట్టుముట్టుతాయి. లావెక్కడం ఒక సామాన్యమైన జబ్బు, ఇదేకాక మమ్స్, హయిటస్, హెర్నియా, అల్సర్, హెపాటైటిస్, సిరోసిస్, పథరీ, హయివర్టికులోసిస్, కొలోన్‌కాన్సర్, పైల్స్, డయారియా, అజీర్తి, ఎసిడిటీ, ఎనోరేక్సియా లాంటి రోగాలు ప్రముఖమైనవి.

ఈ రోగాలన్నిటికీ యౌగిక మానేజ్‌మెంట్‌లో ఆసనాలు, ప్రాణాయామం, శోధనక్రియ, ధ్యానం లాంటి విధానాలున్నాయి. ఆసనాల్లో పవన-ముక్తాసనం (రెండు, మూడు), పశ్చిమోత్తానాసనం, భుజంగాసనం, గోముఖాసనం, అర్ధమత్స్యేంద్రియాసనం, మండూకాసనం, శశాంకాసనం, వజ్రాసనం మొదలైనవి ముఖ్యమైనవి. ప్రాణాయామంలో నాడీశోధన, భస్త్రికా, భ్రామరీ, శీతలీ, సీత్కారీ, అలాగే సూర్య భేదన ప్రాణాయామాలు ఉపయోగకరమైనవి. శోధనక్రియలో నేతి, వమనం, లఘుశంకా ప్రక్షాళనం, కపాలభాతి క్రియలు చేయబడుతున్నాయి. యోగనిద్ర, అజపాజపం కూడ ఈ రోగాలకు రామబాణం లాగ పనిచేస్తాయి.

శ్వాస ఆడుతుంటే జీవనం. ఆగిపోతే మరణం. జీవించడానికి శ్వాసక్రియ అవసరం. శ్వాసలోని తేడావల్ల రోగాలు వచ్చి చేరుతాయి. శ్వాస సంబంధమైన రోగాలు- జలుబు, ఇన్‌ఫ్లూఎంజా, సయినోసైటిస్, టాన్సిలైటిస్, ఫెరింజాయిటీస్, వెరింజయిటిస్, దిఫ్తీరియా, యాక్యూట్ బ్రాంకైటీస్, న్యూమోనియా, ఊపిరితిత్తుల వ్యాధులు- ట్యూబర్‌క్యులోసిస్, బ్రాంకియల్ కార్సినోమా మొదలైనవి. వీటికోసం గోముఖాసనం, భుజంగాసనం, ధనురాసనం చాలా ఉపయోగకరమైనవి. ప్రాణాయామంలో భ్రామరీ, భస్త్రికా, ఉజ్జాయీ, నాడీశోధన్, కపాలభాతి క్రియలు ముఖ్యమైనవి. నేతి, వమనము, అవసరాన్ని బట్టి లఘుశంకాప్రక్షాళనం కూడ చేయదగ్గవి. యోగనిద్ర కూడ ఈ రోగాలకు ఉపయోగకరమైంది.

జీర్ణంకాని నిస్సారభాగం మలమూత్రరూపంలో శరీరం లోనుండి విసర్జింపబడుతుంది. లేకపోతే ఈ మాలిన్యం వల్ల శరీరం రోగగ్రస్థమౌతుంది. ఈ క్రియ సక్రమంగ జరుగకపోతే కిడ్నీ స్టోన్, సిస్టాయిటిస్, గాఉట్, నెఫ్రాటైటిస్, నిరల్ రోగము మొదలైనవి వస్తాయి. వీటికి ప్రభావ వంతమైన ఆసనం సూర్య నమస్కారం, త్రికోణాసనం, వజ్రాసనం, ఉష్ట్రాసనం, తాడాసనం, తిర్యక్ తాడాసనం, కటిచక్రాసనం, పశ్చిమోత్తానాసనం, మండూకాసనం యోగముద్ర మొదలైనవి. నాడీ శోధన్, భస్త్రికా, ఉజ్జాయీ మరియు ఓంకార ఉచ్చారణవల్ల ఈ రోగాలను నియంత్రించవచ్చు. అగ్నిసారం, నౌలీ, వమనం, లఘుశంకా ప్రక్షాళన మొదలైన క్రియలు కూడ దీనికి ఉపయోగకరం. అశ్వినీముద్ర, ఉడ్డీయాన్, మూలబంధనం కూడ ఉపయోగకరం.

కంకాలనాడి చర్మసంబంధమైంది. చర్మసంబంధమైన రోగాలు ఓస్టియో పోరోసిస్, రికెట్స్, ఓస్టియో మెతేసియా, బోన్ ట్యూమర్, బోన్ ఇన్‌ఫెక్షన్ మొదలైన ఈ రోగాలను పవనముక్తాసనం, మార్జరీ, శశాంక్, భుజంగాసనం, సూర్యనమస్కారాలతో నివారించవచ్చు.

**లభించినదానిపట్ల అసంతృప్తి చెందడం మానవ స్వభావంలోని ఒక దౌర్బల్యం.**

నాడీశోధన్, భస్త్రికా ప్రాణాయామం వల్ల కూడ లాభం చేకూరుతుంది. నేతి, కుంజల్ కూడ ఉపయోగకరమైనవి. యోగనిద్ర, రిలేక్సేషన్ మొదలైనవి ఎముకల సంబంధమైన రోగాలను పోగొట్టుతాయి.

కండరాల నాడుల వల్ల నడవడం, దైనిక కార్యకలాపాలు జరుగుతాయి. వీటిలో తేడా వచ్చినప్పుడు మాయస్థేనియాగ్రేవీస్, మస్కులర్ డిస్ట్రాఫీస్ మాయోటోనిక్ డిస్ట్రాఫీ మొదలైన రోగాలు కలుగుతాయి. వీటిని పోగొట్టడానికి పవనముక్తాసనం, మార్జరీ, తాడాసనం, తిర్యక్‌తాడాసనం, కటిచక్రాసనం అభ్యసించాలి. దీనికి ప్రాణాయామం, షట్ కర్మలను ఉపయోగించుకోవచ్చు. ఎముకలు, కండరాల సంబంధం చాలా ఎక్కువగ ఉంటుంది. కనుక ఒకదాని ప్రభావం, ఇంకొక దానిమీద కూడ ఉంటుంది.

జలం శరీరం యొక్క ముఖ్యఅంశం. ఈ జలం విభిన్న ద్రవాలు అనగా రక్తం, ప్లాజ్మా మొదలైన రూపాల్లో శరీరంలోని కణాలన్నిటిలో ప్రవహిస్తుంది. వీటికి బాధ కలిగించే రోగాలు– రొమాటిక్ హార్ట్ డిసీజ్, ఎండోకార్డిటిస్, మాయోకార్డిటీస్, పేరీ కార్డిటీస్, ఎథిరీ క్లెరోసిస్, కొరోనరీ హార్ట్ డిసీజ్, హైపర్ టెన్షన్ మొదలైనవి. ఈ రోగాలనుండి విముక్తి పొందడానికి పవన ముక్తాసన్-1, శవాసనం, శశాంకాసనం, వజ్రాసనం, గోముఖాసనం, సర్పాసనం, యోగముద్ర అవసరం, ప్రాణాయామంలో నాడీ శోధనం, ఉజ్జాయీ, భస్త్రిక, కపాల భాతి, శీతలీ, సీత్కారీ లాభదాయకాలు. సోహం సాధన, ఓం కారం వలన బ్లడ్ ప్రెజర్ శీఘ్రంగా నయమౌతుంది.

జననేంద్రియాలకు సంబంధించినవి చాలా సున్నితమైన భాగాలు. దీనిలో రోగాలు సంక్రమించే ప్రమాదముంది. వీటికి సంబంధించిన రోగాలు– ఎన్‌లార్జ్‌డ్ ప్రొస్టేట్, ప్రొస్టేట్ కాన్సర్, సర్వైకల్ కాన్సర్, ట్రికోమోనాస్ సంక్రమణం, గెనేరియా, సిఫ్‌లిస్, జెనైటల్ హర్పీస్, ఎయిడ్స్, పెల్విక్ ఇన్ ఫ్లమేటరీ డిసీజ్, మెన్ స్ట్రు అల్ సిన్ డ్రోమ్ మొదలైనవి. ఆసనాల్లో శశాంక, భుజంగ, ధనురాసన్, పశ్చిమోత్తానాసన్, అర్థ మత్స్యేంద్రియం, పవన ముక్తాసన్-2, తాడాసన్, మార్జరీ, భద్రాసనం మొదలైనవి ఉపయోగకరం, క్రియలలో నేతి, జలనేతి, అగ్ని సారం ఉపయుక్తం, మూలబంధం, వజ్రోలీల ప్రభావం చాలా బాగా ఉంటుంది. నాడీ శోధనం, భస్త్రికా ప్రాణాయామం నిత్యం చేస్తే పుట్టుకతోవచ్చే రోగాలు పోతాయి. నాద యోగం, విశిష్టమంత్ర జపం వల్ల కూడ ఈ రోగాల ప్రభావం తగ్గిపోతుంది.

మన భౌతిక శరీరంలో ఇంద్రియాలు కూడ ముఖ్యమైనవి. వీటివల్లే మనకు వస్తువులను గురించి తెలుస్తుంది. ఇవి సరిగ పని చేయనపుడు కళ్ళల్లో, చెవుల్లో రకరకాలు రోగాలు ఉత్పన్నమౌతాయి. వీటికి కూడ యోగ క్రియలు మంచివి. సర్వాంగాసనం, విపరీత కరణీ ఆసనం, జలనేతి, కపాలభాతి, నాడీ శోధన్, భ్రామరీ ప్రాణాయామములు ఉపయుక్తములు, ఇదే విధంగా స్నాయు తంత్రములు ఇండోక్రాయినల్ సిస్టమ్, న్యూరో ట్రాన్స్‌మీటర్‌కు సంబంధించిన రోగాలు కూడ చాలా ఎక్కువగా ఉంటున్నాయి– వీటికి కూడ యౌగిక క్రియలు అన్వేషించవలసి ఉన్నది, దీనికి సంబంధించిన పరిశోధనలు కూడ జరుపుతున్నారు.

సామాన్యంగా ఉండే రోగాలకు యోగ ప్రక్రియ చికిత్స చెప్పడం జరిగింది. వేరే ఏదైనా ఇతరత్ర జబ్బులకు యౌగిక క్రియను తెలుసుకోవాలంటే యోగ్య మార్గదర్శకుని పరామర్శించ వలసి ఉంటుంది. వ్యక్తిగత సమస్యలకు కూడ నిపుణుడైన యోగ చికిత్సకుని వద్దకు వెళ్ళాలి. యౌగిక ప్రక్రియల ద్వారా రోగాలు నయమౌతాయి. యౌగిక ప్రక్రియల ప్రభావం రోగాల మీద నిశ్చయంగ పడుతుంది. ఈ ప్రభావం ఎలా పడుతుందనేది ప్రయోగం ద్వారా తెలుసుకోవచ్చు. సిద్ధాంత పరంగా తెలిసిన సత్యం ఏమిటంటే యమ, నియమ, ఆసన, ప్రాణాయామం, ధ్యానం, యౌగిక క్రియలు శరీరంలో ప్రాణప్రవాహానికి అడ్డు తొలగించి సరైన రీతిలో క్రియాశీలంగా చేస్తుంది. ప్రాణ ప్రవాహాన్ని సరైన రీతిలో సంచరింప చేయడానికి విభిన్న అంగాలకు విభిన్న ప్రక్రియలున్నాయి. దీనిని గురించి విశేషంగా తెలుసుకోదలచిన వారు దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలోని యోగవిభాగం వారిని సంప్రదించవచ్చు. వారు తమ పరీక్షలను వైజ్ఞానికంగా జరుపుతున్నారు.

వాస్తవంలో యోగ కేవలం చికిత్సా ప్రణాళికే కాదు దీని వాస్తవిక ఉద్దేశ్యం మానవ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతూ మానవీయ చేతనను ఊర్ధ్వగామి చేయడం, ఇదే యోగ యొక్క ప్రముఖ ఉద్దేశ్యం. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడం ఎంతైనా అవసరం ఎందుకంటే శరీర మాధ్యమంతోనే ఉన్నతమైన యౌగిక ప్రక్రియలను పొందవచ్చు. కనుక యోగ అనేది రోగాల్ని నిర్మూలించేదే కాకుండ మానవ చేతన ద్వారా అలౌకికమైన మణిమకుటాన్ని వెదకడం కొరకు. అందువలన యోగ రహస్యాన్ని తెలుసుకోవడం కొరకు శరీరాన్నీ, మనసునీ ఆరోగ్యంగా ఉంచుతూ దైవీచేతనలో కలసిపోవాలి. యోగ చికిత్స ద్వారా చైతన్యం యొక్క శిఖరాన్ని అధిరోహించే యాత్ర సాగించాలి.

★★★

**గుణవంతుడు కష్టాల్లోకూడ సుఖాన్నే అనుభూతి పొందుతాడు.**

నావారితో నామాట-1

# శతజయంతి ఉత్సవాలరూపురేఖలు

## ప్రారంభం వైభవోపేతంగా ఉంటే అద్భుతఫలితాలు అందితీరుతాయి

### ఇప్పటినుండే ఆలోచిద్దాం

2011 నుండి 2012 వరకు గల 365 రోజుల గురించి ఆలోచించాల్సిన శుభసమయం వచ్చేసింది. ఆ సంవత్సరం యుగపరివర్తనావత్సరంగా చెప్పుకోవడం జరిగింది. శ్రీ రామకృష్ణ పరమహంస జన్మించి 175 సంవత్సరాలు గడిచిపోతాయి. శ్రీ అరవింద మహర్షి చెప్పిన భవిష్యవాణిని దర్శించగలిగే సమయం వచ్చేస్తోంది. వారి మాటప్రకారం 2011 నుండే సత్యయుగపు లక్షణాలు కనిపించడం మొదలుపెడతాయి. భారతదేశం జగద్గురువుగా ప్రకాశిస్తుంది. 2011 నుండి 2020 వరకు దీని స్వరూపం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంవత్సరమే పరమపూజ్య గురుదేవుల శతజయంతి. ఆలోచనలో మార్పుతేవాలన్న వారి సంకల్పానికి జన్మశతాబ్ది. ఈ సమయం కోసమే ప్రపంచపు నలుమూలలనుండి కోట్లాది ప్రజలు ఎదురుతెన్నులు చూస్తున్నారు. అందువల్ల ఇప్పటికి మిగిలిఉన్న 738 రోజులు (1వ తేదీ ఫిబ్రవరి 2009 నాటికి) మహత్వపూర్ణమైనవని చెప్పక తప్పదు. ప్రతిరోజు మనం కౌంటుడౌన్ చేసికొని తీరాలి. ఎందుకంటే ఒక్కొక్కరోజు అత్యంత విలువైనది. చూస్తూఉండగానే రోజులు గడిచిపోతుంటాయి. సంకల్పసిద్ధులైన సాధకులు రెట్టించిన ఉత్సాహంతో, రెట్టింపు పరిశ్రమ చేయాల్సిఉంది. మన గురుదేవుల సత్తాను మనం నిరూపించితీరాలి. చేసితీరుతాం.

### చక్కని ఉదాహరణ

ఇటీవలనే ఆగష్టు 8 నుండి ఆగష్టు 24 వరకు చైనారాజధాని బీజింగ్‌లో ఒలంపిక్ క్రీడలు నిర్వహింపబడ్డాయి. మహా వైభవంగా జరిగిన వాటి ప్రారంభం, ముగింపులు రెండూ కూడ ప్రపంచ ప్రజల మనస్సులను పూర్తిగా దోచుకున్నాయి. నిజం చెప్పాలంటే చాల ఖర్చుతో గూడిన ప్రదర్శనలే. కాని దాని వైభవం ద్వారా చైనా తన బలాన్ని, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించి, ఒక్క వెలుగువెలిగింది. కేవలం ఏర్పాట్లలోనే కాదు. పతకాల సంఖ్యలోకూడ. 51 స్వర్ణపతకాలతో పాటు మొత్తం 100 పతకాలను స్వాధీనం చేసికుంది. ప్రపంచంలోనే ప్రథమస్థానాన్ని పొందింది. ఈ విజయం వెనుక సంవత్సరాల కృషి దాగిఉంది. అక్కడ అప్పగించిన పనిని నిష్ఠతో నిర్వహించే స్వయం సేవకులు లక్షల సంఖ్యలో ఉన్నారు. పక్షిగూటిని పోలిఉన్న పెద్ద స్టేడియం, ప్రపంచస్థాయిలోనే పేరుగాంచిన పెద్ద విమానాశ్రయం వారికృషికి నిదర్శనాలు. అనేకమైన వ్యవస్థలు సక్రమంగా నిర్వహించడానికిగాను 2000 సవత్సరంనుండే యోజనలు, ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. (మైనపావర్) ఆర్థికంగా సాధారణ స్థాయిలోనే ఉన్న చైనా 8 సంవత్సరాల కృషితో ప్రపంచానికి ఇంత గొప్ప విందును ఇవ్వగలిగింది. దీన వెనుక ఎంతటి పటిష్ఠమైన యోజన ఉందో అర్థం చేసికోవచ్చు. ఆ ప్లానింగు, ఆ చిరకాలస్వప్నం ఒలంపిక్ బాధ్యత పైబడగానే ప్రపంచానికి ఋజువుచేసి చూపింది. కృషితోనాస్తి దుర్భిక్షం.

### యోజన యొక్క ప్రారంభస్వరూపం

శతాబ్ది సంవత్సరానికి సంబంధించిన యోజన తక్కువేమీ కాదు. పూర్వయోజన, క్రియాపద్ధతి ఒకేరూపంలో ఆచరింపబడాలి. ఈ విషయాన్ని కార్యకర్తలు మరచిపోరాదు. మనకు అత్యధిక ఖర్చుతో కూడిన యోజన వద్దు. కాని లక్షల సంఖ్యలో, కోట్ల సంఖ్యలో కార్యకర్తలుకావాలి. వారందరినీ ఇప్పటినుండే తయారు చేయాలి. వారు నగరవాసులైనాకావచ్చు. గ్రామ వాసులైనాకావచ్చు. దేశీయులైనాకావచ్చు. విదేశీయులైనాకావచ్చు. వారంతా మన పరివార సభ్యులైఉండాలి. ఆలోచనా సరణిలో మనతో ఏకీభవించే వారై ఉండాలి. ఎంతో జాగ్రత్తగా దీనికి తగినయోజన చేయబడాలి. వెనువెంటనే ప్రారంభించాలి.

### 20-01-2010 నుండి 08-02-2011

08-02-2011 నాడు వసంత పంచమి. ఆ రోజున జన్మశతాబ్ది సంవత్సర ఉద్ఘాటన మహోత్సవం జరుపబడాలి. దానికంటే ముందు మనం 2010 ప్రారంభంనుండే, చిత్రపటాలద్వారా,

పవిత్రమైన మనస్సు రత్నాలకన్న విలువైనది.

నృత్యనాటకాలద్వారా, ఇంకా అనేకరకాల మనోరంజన కార్యక్రమాలద్వారా, రకరకాల సాధన సంపత్తి ద్వారా గురుదేవుల విరాడ్రూపాన్ని భారతదేశమంతటా త్రిప్పగలగాలి. 20-01-2010 వసంత పంచమి నుండి బృందాలవారీగా దేశమంతటా సంచారం మొదలుపెట్టాలి. 2009 వసంతపంచమినుండే దేవసంస్కృతి విశ్వవిద్యాలయం ద్వారా భారతదేశమంతటా ప్రచారం ప్రారంభంఅవుతోంది. ఈ కార్యాన్ని ప్రశంసిస్తూ అనేక ప్రాంతాలలో సినిమాలు, రథాలతోపాటు విభిన్న భాషల్లో రకరకాల ఛానల్స్‌ను ఏర్పాటుచేయాలి. ప్రజ్ఞాఛానల్ కాకుండ అనేక ఛానల్స్ ఉన్నాయి. వాటిల్లో 2 లేక 3 గంటల సమయం ఈ కార్యక్రమాలకు వినియోగించాలి. వాటిద్వారా ఒక ఉద్యమం ఆరంభంకావాలి. ఒక సంవత్సర కాలం పూర్తి భారతదేశంలోనే కాక ప్రపంచంలోని మహానగరాలలో గురుసత్తాను, వారి అమృతవాణి ద్వారా అందించిన సందేశాన్ని వినిపించగలగాలి. మనం కోరుకున్నవిధంగా ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిచెందుతుంది. దీనివల్ల దేశం మొత్తం మీద ఉన్నయువామండళ్లు, మహిళామండళ్లు ఉత్సాహంగా ముందుకు సాగుతాయి. దేశం మొత్తం మీద దాదాపు 50 వేల విద్యాలయాలలో సంస్కృతీ మండళ్లు కార్యరంగంలోనికి ప్రవేశిస్తాయి. వీటివల్ల మన అంతరాత్మలో ఒక విచిత్రమైన సాంస్కృతిక మథనం తనకు తానుగా బయలుదేరుతుంది. అదే జన్మ శతాబ్ది వత్సరానికి పునాదిగా నిలిచిపోతుంది.

## దేశమంతటా సాంస్కృతిక మథనం

2010 స్వరూప స్వభావాలను, గురుసత్తావిరాడ్రూపాన్ని మల్టీమీడియా సహాయంతో చిన్న చిన్న సినిమాల ద్వారా చూపించే ప్రయత్నం జరగాలి. క్షేత్ర స్థాయిలో, జోనల్, ఉపజోనల్ స్థాయిలో జరిగే కార్యక్రమాలను ప్రదర్శించగలగాలి. ప్రతి ఒక్కరిలో ఆలోచనా తరంగాలు నూతన విధానంలో నాట్యం చేస్తాయి. సప్త ఉద్యమాలు అందరిలో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. వెబ్‌సైట్ మీద ఈ కార్యక్రమాలన్నీ మనకు లభిస్తాయి. వెబ్‌మీడియా-వెబ్‌కాస్ట్ ద్వారా ఈ విషయాలన్నీ ప్రజలందరికీ చేరుతాయి. ముందుగానే పత్రికాలోకానికి ఈ విషయాలన్నీ అందించడం జరుగుతుంది. కవితలు, నాటకాలు, సీరియల్స్ మొదలైన ప్రక్రియల్లో గురుసత్తా ఆలోచనా సరణిని అందించడం జరుగుతుంది.

## ప్రారంభం ఎట్లాఉంటుంది?

శతజయంతి ఉద్ఘాటనా మహోత్సవాన్ని ఏ విధంగా ప్రారంభిస్తారు? అన్న ప్రశ్న తలెత్తుతుంది. అది సహజం. అదే విషయం ప్రస్తావిస్తున్నాము. మిషన్ యొక్క స్థాయిని అనుసరించి వైభవోపేతంగా మొదలౌతుంది. భవిష్యత్తులో కూడ మనకు సహకరించే ప్రముఖులు ఉద్ఘాటనలో పాల్గొంటారు. ఫిబ్రవరి 8వ తేదీన వసంతపంచమినాడు జరుగుతుంది. కొన్ని రోజుల వరకు జరుగుతుంది. ఎక్కడ జరుగుతుంది? అన్న విషయం ఇంకా నిర్ణయించబడలేదు. బాగా ఆలోచించి నిర్ణయించడం జరుగుతుంది. దీనితోపాటు అంతర్జాతీయంగా ఒక జ్ఞాన మండలిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉన్నది. దానిలో ధార్మికులు, సంప్రదాయ వాదులు, ప్రముఖ సాధుసంతులు భాగ స్వాములుగా ఉంటారు. పరమ పూజనీయ గురుదేవుల ఆలోచనా సరణిని అనుసరించి తమ తమ సలహాలనందించేందుకుగాను వేర్వేరు సమయాల్లో వారిని ఆహ్వానించడం జరుగుతుంది. దీనిలో తాత్కాలిక సమస్యలకు కూడ సమాధానాలు సూచించబడతాయి. ఈ జ్ఞానమండలిని పన్నెండు సంవత్సరాలకు జరిగే మహాకుంభమేళా యొక్క స్వరూపాన్ని చెప్పగలిగే విధంగా తయారు చేయాలి. (కుంభమేళా ఈసారి హరిద్వార్‌లో 2010 కి ముందే వస్తున్నది.) పూర్వకాలంలో తాత్కాలిక సమస్యలపై చర్చించడానికి ధార్మిక ప్రముఖులందరూ సమావేశమయ్యేవారు. అంతర్జాతీయ స్థాయిలో శాంతి స్థాపన నిమిత్తం ప్రార్థనలు ఏర్పాటు చేయబడతాయి. ఒకే వేదికపై ప్రపంచ జ్ఞానాన్ని పంచిపెట్టగల పరివారం సమావేశమౌతుంది.

## ఫిబ్రవరిలో విలక్షణమైన జ్ఞానమండలి

ఈ అవధిలో బ్రహ్మవర్చస్సులోను, దేవసంస్కృతీ విశ్వవిద్యాలయంలోను జరుపబడిన పరిశోధనా ఫలితాలను శాస్త్రజ్ఞుల సమక్షంలో ప్రకటించే ప్రయత్నం జరుగుతుంది. దీనితోపాటు వాఙ్మయంలో మిగిలిపోయిన (మొత్తం 108 ఖండాలు) 38 ఖండాలు కూడ ప్రచురించబడుతాయి. ఇవి విభిన్న భాషలలో ప్రచురించబడతాయి. ఎంపిక చేయబడిన 40 పుస్తకాలు దాదాపు 45 భాషల్లో అనువదించబడతాయి. డిజిటల్ ఒకటి, ప్రింటెడ్ ఒకటి, స్మరణిక వేర్వేరు ఖండాలలో ప్రకటించబడతాయి. వీటి ద్వారా అందరు గాయత్రీపరివార్ యొక్క విశ్వరూపాన్ని

కర్తవ్యాలను వదలివేయడం వైరాగ్యం కాదు.

తెలుసుకోగలుగుతారు. ఇతరులకు తెలియచేస్తారు. విశ్వవిద్యాలయము నందలి ముద్రణా సంస్థ అప్పటివరకు కొన్ని నూతన ముద్రణలను సమర్పించగలుగుతుంది.

2011 ఫిబ్రవరి నెల మనందరికీ అత్యంత ప్రధానమైనది. జన్మశతాబ్ది సంవత్సరం ప్రారంభమయ్యేది ఆ నెలలోనే. ఆ ప్రారంభంతో సంవత్సరమంతా సందడే సందడి. సంవత్సరమంతా సాగిన సాంస్కృతిక ఏర్పాట్లు శిఖరాగ్ర స్థానానికి చేరుకుంటాయి. ఈ కార్యక్రమాల ద్వారా భవ్య సమాజానికి నవ్యకాంతులు స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. దీనితోపాటు గాయత్రీ తపోభూమి మధుర, అఖండ జ్యోతి సంస్థాన్, జన్మభూమి అవల్‌ఖేడాలలో కూడ జన్మ శతాబ్ది వత్సరం ప్రారంభమౌతుంది. ఎవరికి అనుకూలత ఎక్కడ లభిస్తే అక్కడ భాగస్వామ్యం వహించవచ్చు. చూస్తూ ఉండగానే అద్భుతం జరిగిపోతుంది. యుగ పరివర్తన కన్నుల ముందు ప్రత్యక్షం అవుతుంది. దేవసంస్కృతి విశ్వవిద్యాలయం నుండి సమర్పించబడ్డ సమయదాతలు, కర్తవ్యనిష్ఠా గరిష్ఠులైన యువామండలి సభ్యులు తమ పాత్రను చక్కగా నిర్వహిస్తారు.

## మార్చి నెలను మహిళలకు సమర్పిద్దాం

వీటితోపాటు మార్చినెల కార్యక్రమాలను కూడ ప్రారంభించాలి. ఈ నెలలో దేశం మొత్తం మీద మహిళలందరు భాగస్వాములు కావాలి. ఎక్కడెక్కడ మాతృశక్తియొక్క విజృంభణ కనిపిస్తూ ఉందో అక్కడ నుండి ప్రముఖులను రప్పించి ఒక సమావేశం ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉంది. మహిళాభివృద్ధి, నారీ స్వశక్తితోపాటు మహిళలకు సంబంధించిన సమస్యలకన్నింటికీ పరిష్కార మార్గాలను చర్చిస్తారు. దేశం మొత్తంమీద ఉన్న మహిళామండళ్ళు, నారీ జాగరణ సంస్థలు, ఈ వైపుగా ఆలోచిస్తున్న మహిళాసంఘాలు ఒకేచోట సమావేశమై అన్ని కోణాలలో ఆలోచిస్తారు. తరువాత తమకు నిర్ణయించబడిన క్షేత్రాలలో, గ్రామాలలో, వాడలలో తిరుగుతూ మహిళా జాగరణ చేస్తారు. మహిళాభివృద్ధితోపాటు వరకట్న సమస్యను ఎదుర్కొనే ప్రయత్నాలు చేస్తారు. ఇదంతా గాయత్రీ పరివార్ ద్వారా నిర్వహింపబడుతుంది. ఈ విధంగా గాయత్రీ పరివార్ నిర్వహించే కార్యక్రమాల వివరణ ఇవ్వడం జరుగుతుంది.

## విధి నిర్ణయం

*బుద్ధుడు తన జీవితకాలంలో ఎవరితోను ప్రత్యేకంగా స్నేహం చేయలేదు. ఎవరినీ అభినందించి ఎరుగడు. తామరాకుమీద నీటిబొట్టులా ఉండేవాడు. ఒకానొక వ్యక్తి బుద్ధుడన్నా, బుద్ధుని మాటలన్నా చిరాకుపడేవాడు. ఆయన చెప్పిన ప్రతిదాన్నీ ఖండించేవాడు. తరువాత కొన్ని రోజులు బుద్ధుని సమీపంలో గడిపాడు. మెల్ల మెల్లగా బుద్ధునిపై గౌరవం పెరిగింది. ముందు భక్తుడుగా మారాడు. తరువాత శిష్యుడయ్యాడు. ఒకరోజున బుద్ధునికోసం కూరను వండాడు. పాపం ఆయనకు తెలియదు. అందులో విషం కలిసింది. బుద్ధుడు భోజనం చేశాడు. తనకు కాలం తీరిపోయిందని అర్థమయింది. వెంటనే ఆనందును పిలిచాడు. "ఆనంద్ ! బుద్ధుడు దేహాన్ని వదిలేస్తున్నాడన్న కబురు వెంటనే అందరికీ అందించు. నా ప్రాణాలు పూర్తిగా పోకమునుపే చెప్పేసెయ్. విషం కలిసిన విషయాన్ని బయటపెట్టవద్దు. అతను నిమిత్తమాత్రుడు. నాకు సమయం వచ్చేసింది. విధినిర్ణయాన్ని కాదనలేం. అనవసరంగా ప్రజలు అతన్ని బాధపెడతారు. ఆతని గౌరవాన్ని నిలబెట్టు. అతని జీవితాన్నినిలబెట్టు." అంటూ కన్నుమూశాడు.*

*మహాత్ముల మనస్సులు ఈ విధంగానే ఉంటాయి. వారి మనస్సుల్లో రాగద్వేషాలుండవు. వారికి తనవారు, పరాయివారు అంటూ ప్రత్యేకంగా ఉండరు. శుభం జరిగినా, అశుభం జరిగినా సమానంగా స్వీకరిస్తారు. మనస్సులో ఎలాంటి వికారాలు కలుగవు. విధినిర్ణయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. వారిదృష్టిలో అందరు నిరపరాధులే.*

విశ్వవిద్యాలయాలలో మహిళల కొరకు వృత్తి ప్రధానమైన విశేష పాఠ్యక్రమాన్ని ప్రవేశపెట్టాలి. ప్రజలందరు దానికి ఆకర్షితులై ఫలితాన్ని పొందగలగాలి. ఖచ్చితంగా గురుసత్తా యొక్క లక్ష్యం నెరవేరడానికి మైలురాయిగా ఈ ప్రయత్నం చేసి తీరుతుంది.

*మిగతానెలల కార్యక్రమాన్ని గురించి వచ్చే సంచికలో..........*

★★★

**వైరాగ్య రహస్యమంతా నిష్కామ కర్మయోగంలో దాగి ఉంది.**

సద్గురులీలామృతం

# గురుదేవుల అభయహస్తమే నన్ను నడిపించింది

నాన్నగారు బీహారులోని జసీరీహిలోని ఒక చిన్న దేవాలయంలో పూజారి. ఇల్లుగడవడమే కష్టంగా ఉండేది. దురదృష్టం కొద్దీ వారు కూడ పరమపదించారు. చాల చిన్న వాడిని. అదే మందిరంలో పనిచేసుకుంటూ కొంతకాలం గడిపాను. అదే కాలంలో గాయత్రీ సాహిత్యం చదివాను. అంతే. మనస్సు గురుదేవుల చుట్టూ పెనవేసికొనిపోయింది.

చదువుమీద ఆసక్తి పెరిగింది. చిన్న పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ నేనుకూడ బి.ఎ. పూర్తిచేశాను. నెలకు 140 రూపాయల జీతంమీద బిర్లాకంపెనీలో నౌకరీకుదిరింది. వివాహం కూడ చేసికున్నాను. బిర్లాకంపెనీతో స్పర్థలు వచ్చాయి. వదిలి వేశాను. అల్యూమినియమ్ గనిలో లీజ్‌హోల్డరును అయ్యాను. ఇప్పుడు నాదగ్గర 60 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈనాటి నా స్థాయి, హోదా, గౌరవప్రతిష్ఠలు, అనుకోని సంఘటనలు చెప్పాలంటే మాటలు చాలవు.

ఎక్కడ నుండి వచ్చి ఎక్కడకు చేరాను? ఈ సుదీర్ఘ ప్రయాణంలో అడుగడుగునా గురుదేవుల అభయ హస్తం నన్ను పట్టుకుని నడిపించింది. ప్రతీ క్షణమూ వారే నామార్గదర్శి.

ఇప్పుడిప్పుడే 400 టన్నుల కొత్త ఆర్డరు రైల్వే నుండి లభించింది. ఒక సమయంలో రైల్వేవారు విధించిన 8000 జరిమానా రద్దు చేయబడింది. చెప్పాలంటే ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఒడుదుడుకులను తట్టుకుంటూ ప్రగతి మార్గంలో పయనిస్తున్నాను. నేను గురుదేవుల వ్యక్తిని. వారు చూపిన మార్గంలోనే నడుస్తున్నాను. జీవించి ఉన్నంత కాలం వారి మార్గాన్ని వదిలిపెట్టను. వారి సాహిత్యాన్ని వదిలిపెట్టను.

*భవతీ ప్రసాద మిశ్ర – లోహరదగా – (రాంచీ).*

★★★

# అదే అసలైన పెద్దకారణం

ఒకసారి గురుదేవుల్ని చనువుగా ప్రశ్నించాను. "మీరింత కష్టపడి తపస్సు చేశారు. ఆ తపోబలాన్ని స్వీయముక్తికి ఉపయోగించుకోకుండా ఇతరుల భౌతిక లాభాలకోసం వెచ్చిస్తున్నారు. కారణం ఏమిటి? తెలుసుకోవచ్చా?"

వారు చిరునవ్వుతో సమాధానమిచ్చారు. తెలుసుకోవచ్చు. నా ఈ సహకారానికి కారణాలు రెండే రెండు.

(1) ఇతరులకు సహకరించేవిషయంలో ప్రేరణను ఇవ్వడం.

(2) అధ్యాత్మను జ్ఞానపక్షం నుండి విజ్ఞానం వైపుకు త్రిప్పడం.

ఎలాగో చెపుతాను విను. సమర్థుడైన వ్యక్తి తన సామర్థ్యాన్ని (ఏ రంగంలో అయినా కావచ్చు) ఇతరుల అవసరాలకు వినియోగించగలగాలి. "అది తప్పుకాదు. చేయకపోతేనే తప్పు" –అని క్రియారూపంగా నిరూపిస్తున్నాను.

ఈనాడు అధ్యాత్మవల్ల ఆత్మిక ఉన్నతిని మాత్రమే సాధిస్తున్నారు. కాని అధ్యాత్మవల్ల భౌతిక ఉన్నతికూడ సాధ్యమే అని నిరూపించగలగాలి. కేవలం ధర్మోపదేశాలు మాత్రమే నడుస్తున్నాయి. ఆచరణ శూన్యంగా ఉంది. అధ్యాత్మ ఆత్మిక ఉన్నతితో పాటు భౌతిక ఉన్నతిని కూడ కలిగిస్తుందన్న తథ్యాన్ని నిరూపించగలిగితే– జనాలకు దాని రుచి తెలిసివస్తుంది. అభిరుచి పెరుగుతుంది. అధ్యాత్మను అనుసరిస్తారు. ప్రయోజనాన్ని పొందుతారు.

ఈ రకంగా నాతపోశక్తిని లోకుల క్షేమానికి ఉపయోగిస్తూ వారిలో, వారి భావాలలో మార్పును తెచ్చే ప్రయత్నమే ఇది. అదే అసలైన పెద్దకారణం. ఆనందంతో చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకున్నాను.

*గిరిరాజకిశోర్ పరాశర్ – మీర్జాపూర్.*

★★★

ప్రేమ, ఆనందం ఆత్మయొక్క గుణాలు.

# ఏ పుస్తకంలో ఏముంది?

**సూర్య విజ్ఞానం**

హిందీమూలం : పండిత శ్రీరామశర్మ ఆచార్య

తెలుగు అనువాదం : డి.వి.ఎన్.బి. విశ్వనాథ్

పేజీలు : 152 వెల : రూ॥ 25-00

రాబోయే రోజులలో భూగర్భం నుండి లభ్యమవుతున్న బొగ్గు, క్రూడ్‌ఆయిల్ నిక్షేపాలు తరిగిపోయి, రాబోయే 50 సంవత్సరాలలో పెట్రోలు, డీజిల్ అంతమయ్యే రోజులు వస్తాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. వీటికి ప్రత్యామ్నాయం వెదుకవలసిన పరిస్థితి ఉన్నది. శాస్త్రజ్ఞులు సూర్యకిరణాల ద్వారా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే పరికరాలను తయారు చేయడం, వినియోగించటం చూస్తున్నాము.

రమణ మహర్షి శిష్యుడైన డా॥ పాల్ బ్రంటన్ తన ఇండియా యాత్రలో కలిగిన అనుభవాలు "A Search in Secret India" అనే పుస్తకంలో వివరించారు. వీరికి పరమహంస విశుద్ధానంద శిష్యుడైన పండిత గోపినాథ్ కవిరాజ్‌తో జరిగిన అనుభవము అత్యంత ఆశ్చర్యకరం. పండిత గోపినాథ్ కవిరాజ్, రకరకాల సువాసనలు సృష్టించారని, సూన్యం నుంచి ద్రాక్షపండ్లు, మిఠాయిలు ఒక భూత అద్దం ద్వారా సృష్టించి చూపారని చెప్పారు. "జాత్యంతర పరిణామః ప్రకృత్యాపురాత్" అనే పతంజలి యోగ సూత్రం ద్వారా ఒక వస్తువును ఇంకొక వస్తువుగా ఎలా మార్చవచ్చో వివరించారు కవిరాజ్.

ఋషులు అందించిన వెలలేని కానుక మధువిద్య. దీని వివరణ చాందోగ్యోపనిషత్‌లో మధువిద్య సవితా సాధనగా వర్ణించబడింది. మధువిద్య అంటే సూర్యకిరణ విజ్ఞానమే.

రిద్ధి సిద్ధుల ద్వారా నాభీకేంద్రమును, సూర్యచక్రములను ఎలా జాగృత పరచుకునే సాధనా పద్ధతులు ఈ పుస్తకంలో ఇవ్వబడ్డాయి.

పూజ్య గురుదేవులు అందించిన సూర్యవిజ్ఞానం గురించి అవగాహన చేసుకునే ప్రయత్నం చేద్దాం.

**గాయత్రి చిత్రావళి**

హిందీమూలం : పండిత శ్రీరామశర్మ ఆచార్య

తెలుగు అనువాదం : డా॥ తుమ్మూరి

పేజీలు : 56 వెల : రూ॥ 20-00

గాయత్రి మహిమ అపారం. అది భూలోకపు కామధేనువు గాయత్రీ మాత కృపతో తొలగింపబడని కష్టం లేదు. తీరని కోరిక ఉండదు. చిన్న చిన్న సాధనా పద్ధతులతో, సామాన్యమానవులు ఈ పుస్తకములో ఇయ్యబడ్డ సాధనా పద్ధతులను అనుసరించి మహత్వపూర్ణ ఫలితాలను సాధించుకోవచ్చు. ఈ పుస్తకంలో 24 చిత్రాలు ఇవ్వబడ్డాయి. వీటిలో కొన్ని పరమ పోషక వైష్ణవి, శాంభవి దివ్యశక్తి, ఉద్ధరించే మాతా, అనిష్ఠముల నివారణ, ప్రారబ్ధ పరివర్తనం, ఐశ్వర్య వర్ధిని లక్ష్మి, అదృశ్య సహాయం, సంతృప్తికరమైన దాంపత్య జీవనం, సత్సంతాన సౌభాగ్యం, కుటుంబంలో సుఖశాంతి ఈ చిత్రమాల క్రింద ఇచ్చిన విశేషమైన పేర్లు. ఎవరికి ఎలాంటి అవసరం ఉన్నదో, దానికి తగిన చిత్రాన్ని ఎంచుకొని, ఆ రూపాన్ని భావపూర్వకంగా ధ్యానం చేయాలి. ఆ కోరిక నెరవేరుతుంది. పాఠకులు ఈ పుస్తకంలో పూజ్య గురుదేవులు అందించిన సాధనా పద్ధతులు ఉపయోగించుకొని లాభం పొందగలగాలి. మీ అనుభవాలు తెలియచేయగోరుతున్నాం.

*లభించే చోటు :* **(1) గాయత్రి చేతనాకేంద్రం హైదరాబాద్.**

**(2) వేదమాత గాయత్రీట్రస్టు, గాయత్రీ శక్తి పీఠం, నారాకోడూరు - 522 212, గుంటూరు జిల్లా. ఆ. ప్ర. ఫోను : 0863 - 2534440**

## శాంతికుంజ్‌లో 9 రోజుల సంజీవని సాధనాశిబిరం తెలుగులో

21-04-09 నుండి 29-04-09 వరకు 9 రోజుల సంజీవని సాధనా శిబిరం తెలుగు వారి కొరకు తెలుగులో ప్రత్యేకంగా నిర్వహించబడుతుంది. జిల్లా కార్యకర్తలు ఈ విషయం అందరికి తెలియచేయవలసినది. పాల్గొనదలచిన వారు ముందుగా అనుమతి పొందవలసిఉన్నది. అనుమతి కొరకు మీ పేరు, చిరునామా, వయస్సు, వృత్తి వివరాలతో సంప్రదించండి.

Southindiacell, Haridwar-249411. Ph : 01344-260602, 326950 Ext-180,

E-mail ID : southzone@awgp.org

గాయత్రి చేతనాకేంద్రం హైదరాబాదునకు అనుమతిపొందిన వారి వివరములు తెలుపగలరు.

మీ

**అశ్విని సుబ్బారావు** *(ఆంధ్రప్రదేశ్ సంయోజకులు)*

*గాయత్రి చేతనాకేంద్రం, హైదరాబాద్*

ఉదారహృదయం బంగారంకన్న విలువైనది.

వార్తలు

# గాయత్రీపరివార్-జిల్లాసమావేశాలు-ఆంధ్రప్రదేశ్

గాయత్రీ తీర్థ్-శాంతికుంజ్ హరిద్వార్ మార్గదర్శనంలో 27-11-2008 నుండి 25-12-2008 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించబడ్డాయి. జిల్లాసమితి, మండలసమితి, టౌనుసమితి, ప్రజ్ఞామండళ్ళ, మహిళామండళ్ల కార్యకర్తలతో చర్చించడం జరిగింది. ప్రప్రథమంగా నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం మొదలైన జిల్లాలలో ఆంధ్రప్రదేశ్ సంయోజక్ శ్రీ అశ్విని సుబ్బారావు, శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది, గాయత్రీ చేతనాకేంద్ర ప్రతినిధి శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మహిళామండళ్ల, ప్రజ్ఞామండళ్ల సభ్యులతో బాధ్యతలు అప్పగించడంతోపాటు సేవాకార్యక్రమాలు నిర్వహించాల్సిన విధి విధానాలను చర్చించడం జరిగింది.

సాయంత్రం 4 గంటల సమయంలో కుటుంబ బాధ్యతల నుండి విడివడిన వారిని, ఉద్యోగవిరమణ చేసినవారిని ప్రతి జిల్లాలో సమావేశపరచడం జరిగింది. వారికి ఆంధ్రప్రదేశ్ సంయోజకులు శ్రీ అశ్విని సుబ్బారావు వానప్రస్థ ధర్మాన్ని గురించి, దాని అవసరాన్ని గురించి వివరించారు. "**యుగధర్మం సమయదానమే**" అన్న అంశాన్ని చక్కగా తెలియపరచారు. శాంతికుంజ్‌లో నిర్వహింపబడే వానప్రస్థుల శిబిరంలో పాల్గొనడానికీ, తరువాత యథాశక్తి సమాజసేవ చేయడానికీ వానప్రస్థులు సంకల్పం తీసుకున్నారు.

# జిల్లా సమావేశాల సంక్షిప్తవివరాలు-తేదీలవారీగా

**27-11-2008 :** నాడు మొట్టమొదటి సమావేశం కామారెడ్డిలోని వాసవీక్లబ్‌లో నిజామాబాద్ జిల్లా సమావేశం జరిగింది. మానవజీవన లక్ష్యాన్ని గురించి ఆంధ్రప్రదేశ్ సంయోజకులు శ్రీ అశ్విని సుబ్బారావు ప్రసంగించారు. శ్రీ ఉపేంద్ర గారి కార్యాలయంలో 5 కుండీల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. అందరు దానిలో పాల్గొన్నారు. "రిటైర్డ్ అసోసియేషన్" వారికి "హోలిస్టిక్ హెల్త్‌సెంటర్"లో సమావేశం జరిగింది. 50 మంది పెద్దలు, 15 మంది పరిజనులు పాల్గొన్నారు. వానప్రస్థ పరంపర గురించి శ్రీ అశ్విని సుబ్బారావు ప్రవచించారు. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది కార్యకర్తలకు కర్తవ్యాన్ని భోధించారు. సాయంకాలం 4 గంటలకు జిల్లా సంయోజక్ శ్రీ ఉపేంద్ర గారి కార్యాలయంలో సమావేశం జరిగింది. శ్రీ అశ్విని సుబ్బారావు దంపతులు, శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ పాల్గొన్నారు. రీజనల్ కమిటీ సంయోజక్ శ్రీ యుగంధర్ అధ్యక్షత వహించారు. జనవరి 10, 11 తేదీలలో నిజామాబాద్‌లో 24 కుండీల గాయత్రీ మహాయజ్ఞం చెయ్యాలన్న నిర్ణయం తీసికోవడం జరిగింది. దాని బాధ్యత శ్రీమతి దక్షాబేన్, శ్రీమతి సంగీతాబేన్, శ్రీ కేశవలాల్‌కు అప్పగింబడింది.

అదే రోజు సాయంత్రం 8 గంటలకు సిరిసిల్లలో కరీంనగర్ జిల్లా సమావేశం జరిగింది. 35 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా సంయోజక్ శ్రీ బాదం ప్రకాశ్ (రిటైర్డ్ మునిసిపల్ కమీషనర్) ప్రజ్ఞామండళ్ల, మహిళా మండళ్ల కార్యక్రమాల రిపోర్టును చదివి వినిపించారు. ముందు ముందు చేయాల్సిన కార్యక్రమాల గురించి ఆంధ్రప్రదేశ్ సంయోజక్ శ్రీ అశ్విని సుబ్బారావు వివరించారు. కార్యకర్తలకు వేర్వేరుగా బాధ్యతలను అప్పగించడం జరిగింది.

**28-11-2008 :** నాడు కరీంనగర్ జిల్లా జగిత్యాలలోని గీతాభవన్‌లో జిల్లా సమితి సమావేశం జరిగింది. 89 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దలు శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ వేర్వేరు ప్రవచనాలతో కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. 'యుగశక్తి గాయత్రి' మాసపత్రికకు, సంస్కృతీ జ్ఞానపరీక్షలకు, దేవసంస్కృతీ విశ్వవిద్యాలయం గురించి బాధ్యతలు అప్పగించడం జరిగింది. శ్రీ ఆడెపు గంగారాం, శ్రీ పులి సత్యనారాయణ, పెద్దలు జెడిగె కిషన్, శ్రీ బుచ్చిరెడ్డి మొదలగు వారు విశేష సహకారం అందించారు.

**29-11-2008 :** నాడు మంచిర్యాలలోని జిల్లా కన్వీనర్ శ్రీ రాజబాబు ఫ్లాట్ (ఎల్.ఐ.సి.కాలనీ)లో ఆదిలాబాద్ జిల్లా సమావేశం జరిగింది. 39 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. వేర్వేరు విభాగాలకు చెందిన వేర్వేరు బాధ్యతలను అప్పగించడం జరిగింది. శ్రీ వెంకటేశ్, టౌన్ కన్వీనర్ శ్రీ కోటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ శ్రీ రాజబాబు,

హృదయము, మనస్సుల ఏకత్వమే బుద్ధి వికాసం.

శ్రీలత విశేష సహకారాన్ని అందించారు. ఎల్.ఐ.సి. కాలనీలోని మహిళా మండలివారితో సమావేశం నిర్వహించబడింది. 25 మంది మహిళలు పాల్గొన్నారు. ఆ సమావేశంలో వానప్రస్థ జీవనం గురించి, జీవించేకళ గురించి శ్రీ అశ్విని సుబ్బారావు వివరించారు.

**1-12-2008 :** నాడు ఖమ్మంలోని సంఘకార్యాలయంలో జిల్లా సమావేశం జరిగింది. 18 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. వేర్వేరు విభాగాలలో వేర్వేరు బాధ్యతలు అప్పగించడం జరిగింది. జిల్లా కన్వీనర్ శ్రీ సతీశ్‌ఖండేల్‌వాల్, సహసంయోజక్ శ్రీ బాలకృష్ణ చౌదరి విశేష సహకారాన్ని అందించారు.

అదే రోజు సాయంకాలం 5 గంటలకు 'రిటైర్డ్ అసోషియేషన్' సభ్యులకు సమావేశం జరిగింది. 36 మంది పెద్దలు పాల్గొన్నారు. శ్రీ అశ్విని సుబ్బారావు జీవన్ముక్తి గాయత్రీ సాధన, 'వానప్రస్థ ఆశ్రమ లక్ష్యాలు-అవసరం' గురించి వివరించారు. గురుదేవుని సాహిత్యం కొనాలనీ, శాంతికుంజ్‌లో 9 రోజుల శిబిరంలో పాల్గోవాలనీ సంకల్పం తీసుకున్నారు.

**2-12-2008 :** నాడు సంగారెడ్డిలోని విజ్ఞానహాలులో మెదక్ జిల్లా సమావేశం జరిగింది. 10 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. బాధ్యతలు అప్పగించడం జరిగింది. మెదక్ జిల్లాకు శ్రీ దత్తాత్రేయ చౌహాన్, శ్రీ రామిరెడ్డి సంయోజకులుగా నిర్ణయించబడ్డారు. శ్రీ దత్తాత్రేయ చౌహాన్, శ్రీ పెంటోజీ, శ్రీ శివరామసింహ్ విశేష సహకారాన్ని అందించారు.

**9-12-2008 :** కర్నూలులోని దేవీ ఫంక్షన్‌హాలులో కర్నూలు జిల్లా సమావేశం జరిగింది. 48 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. రీజనల్ కమిటీ సంయోజక్ శ్రీ వెంకటేశులు, కర్నూలు జిల్లా సంయోజక్ శ్రీ గురురాజారావు విశేష సహకారాన్ని అందించారు. "యుగశక్తి గాయత్రి" పత్రికాసంయోజక్ శ్రీ సుబ్బారాయుడు, ప్రజ్ఞామండల్ సంయోజక్ శ్రీ గురురాజారావు, శ్రీ శ్రీనివాసరావు, సంస్కృతీజ్ఞానపరీక్షా సంయోజక్ శ్రీ మల్లికార్జున్ సహసంయోజక్ శ్రీమతి కృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

**10-12-2008 :** వాసవీ కల్యాణమండపంలో అనంతపురం జిల్లా సమావేశం జరిగింది. 30 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీ సి.వి.రామన్న, శ్రీ మంగీలాల్ రాజపురోహిత్, శ్రీ వేణు, శ్రీమతి దేవయాని, శ్రీ సత్యనారాయణ గారు సహకరించారు.

**11-12-2008 :** రామదేవు మందిరంలో కడప జిల్లా సమావేశం జరిగింది. 16 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. కమలాపురం మహిళామండలి, ప్రజ్ఞామండలి సభ్యులు, శ్రీ విజయభాస్కరరెడ్డి, శ్రీ మోహన సింహ్ రాజపురోహిత్, శ్రీ మధుసింహ్ రాజపురోహిత్, శ్రీ రాజోలు వీరారెడ్డి మొదలైనవారు సహకరించారు.

**12-12-2008 :** దుర్గా కల్యాణమండపంలో చిత్తూరు జిల్లా సమావేశం జరిగింది. 50 మంది మహిళలు, 15 మంది పురుషులు పాల్గొన్నారు. శ్రీమతి ఇంద్రాణి, శ్రీమతి పుష్పమ్మ, జిల్లా సంయోజక్ శ్రీమతి జ్యోతి, ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళిగారి ధర్మపత్ని శ్రీమతి పద్మ మొదలైనవారు సహకరించారు.

**13-12-2008 :** గాయత్రీ పరివార్ కార్యాలయంలో నెల్లూరు జిల్లా సమావేశం జరిగింది. 19 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. మాసపత్రిక గురించి, సంస్కృతీ జ్ఞానపరీక్షల గురించి సంకల్పం తీసుకున్నారు. జిల్లా కన్వీనర్ శ్రీ భాస్కరనాయుడు, సంస్కృతీ జ్ఞానపరీక్షల జిల్లా కన్వీనర్ శ్రీమతి భువన, టౌనుకన్వీనర్ శ్రీ తిరు నారాయణ మొదలైనవారు సహకరించారు.

**14-12-2008 :** చీరాలలో సాయిబాబా కల్యాణమండపంలో ప్రకాశం జిల్లా సమావేశం గోపూజతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్యకర్తలతో రెండు సమావేశాలు, ప్రత్యేకంగా మహిళా సమావేశం, వానప్రస్థుల సమావేశం, పట్టణ ప్రముఖుల సమావేశం, మరునాడు **AK & K** పబ్లిక్‌స్కూల్లో విద్యార్థుల సమావేశం వేర్వేరుగా, ఉత్సాహభరితంగా ముగిశాయి. ప్రతి సమావేశానికి 50 నుండి 100 మందిదాక కార్యకర్తలు పాల్గొనడం ఆనందోత్సాహాలను కలిగించింది. సమావేశాలలో సందర్భానుసారంగా ఆంధ్రప్రదేశ్ సంయోజక్ శ్రీ అశ్విని సుబ్బారావు హవనద్రవ్యం తయారుచేయడానికి-గోపంచితంతో ఔషధాల తయారీకి అశ్విని ప్రొడక్టువారు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గోవుయొక్క ప్రాధాన్యతను వివరించడం జరిగింది. స్వాధ్యాయ-సత్సంగాల మహత్తును వివరించారు. సమయదాన-అంశదానాల అవసరాన్ని తెలియచేశారు. మహిళలను, వానప్రస్థులను వేర్వేరుగా ప్రోత్సహించారు. హైస్కూలు విద్యార్థుల ద్వారా రోజుకు 12 నుండి 15 వేలవరకు జరుగుతున్న మంత్రజపాన్ని, ప్రోత్సహిస్తున్న మేనేజ్‌మెంట్‌ను అభినందించారు, పిల్లలను ఆశీర్వదించారు. జరుగబోయే శక్తిపీఠ నిర్మాణానికి లోకల్ కమిటి

ప్రకృతి ఆదేశాన్ని పాటించడం ఆరోగ్యానికి సర్వోత్తమ నియమం.

నిర్ణయంతీసికుంది. కార్యకర్తల సమిష్టికృషికి అభినందనలు తెలియచేశారు.

**15-12-2008 :** నారాకోడూరు శక్తిపీఠంలో గుంటూరు పరిసరప్రాంతకార్యకర్తల సమావేశం జరిగింది. 19 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీమతి రాజ్యలక్ష్మి మార్గదర్శనం చేశారు. గుంటూరు డివిజన్ కన్వీనర్ శ్రీ రంగనాయకులు బాధ్యతవహించారు.

**16-12-2008 :** నర్సరావుపేటలోని శ్రీ సత్యనారాయణస్వామి దేవాలయంలో గుంటూరుజిల్లా రెండవ సమావేశం జరిగింది. 89 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా సంయోజకులు శ్రీ పేరిశాస్త్రి, సహ సంయోజకులు శ్రీ రంగనాయకులు, మహిళా మండలి కార్యకర్తలు సహకరించారు. శ్రీ పేరిశాస్త్రి మహిళా మండళ్ల, ప్రజ్ఞామండళ్ల సహకారంతో "యుగశక్తి గాయత్రి"కి444 సంవత్సరచందాదార్లను చేర్పించారు. వీరు రాష్ట్ర కార్యకర్తలందరికీ ఆదర్శప్రాయులు.

**17-12-2008 :** దేవరకొండలోని కోదండరామాలయంలో నల్గొండ జిల్లా సమావేశం జరిగింది. 68 మంది పాల్గొన్నారు. జిల్లా సంయోజకులు శ్రీ నరసింహం, శ్రీ రాఘవులు, శ్రీ చంద్రమౌళి మొదలైనవారు సహకరించారు.

**21-12-2008 :** విజయవాడలోని గాయత్రీపరివార్ కార్యాలయంలో కృష్ణా జిల్లా సమావేశం జరిగింది. 31 మంది పాల్గొన్నారు. ప్రముఖ కార్యకర్తలు వేర్వేరు విభాగాలకు బాధ్యతలను స్వీకరించారు. రీజనల్ కన్వీనర్ శ్రీమతి రాజ్యలక్ష్మి, జిల్లాకన్వీనర్ శ్రీ మణికుమార్, శ్రీ వేణుగోపాలరెడ్డి, యోగమిత్ర శ్రీనివాసరావు (గుడివాడ కన్వీనర్) సహకరించారు.

**22-12-2008 :** అమలాపురంలోని వాసవీకన్యకాపరమేశ్వరీ కల్యాణమండపంలో ఈస్ట్ గోదావరి జిల్లా సమావేశం జరిగింది. 42 మంది పాల్గొన్నారు. ప్రముఖులు వివిధ బాధ్యతలను స్వీకరించారు. శ్రీ శ్యామలరావు (జిల్లా సలహాదారు) జిల్లా కన్వీనర్ శ్రీ స్వామి అధ్యక్షత వహించారు. కార్యకర్తలందరికి ఆశీస్సులు అందించారు. జిల్లా సహసంయోజకులు శ్రీ రామకృష్ణ, టౌను కన్వీనర్ మావుళ్లయ్య, శ్రీ అప్పలరాజు, ప్రముఖ కార్యకర్తలు శ్రీమతి గాయత్రి, శ్రీమతి నాగమణి సహకరించారు. శ్రీమతి నాగమణి చేసిన ప్రత్యేక కృషిని అందరు అభినందించారు.

**23-12-2008 :** విశాఖపట్టణంలోని గాయత్రీపరివార్ కార్యాలయంలో డా॥ బ్రిజమోహన్‌గౌర్ (దక్షిణ భారత్ ప్రచారక్) అధ్యక్షతవహించారు. వారు పూజ్యగురుదేవుల జన్మశతాబ్దిగురించి మాట్లాడుతూ 30 సంవత్సరాలపనిని 3 సంవత్సరాలలో పూర్తిచేయాలనీ, అందునిమిత్తం యుగనిర్మాణయోజనా కార్యక్రమాలు చేపట్టాలనీ, అందరూ సిద్ధం కావాలనీ ఉద్బోధించారు. జిల్లా కన్వీనర్ శ్రీ అవతారంరాజు, శ్రీ హేమచంద్రరావు, శ్రీ కాశీరామశర్మ, శ్రీ చంద్రశేఖరజైన్, శ్రీ వి.కె.మహేశ్వరి మొదలగువారు సహకరించారు. రీజనల్ కన్వీనర్ శ్రీమతి సౌజన్య జిల్లాను గాయత్రీమయం చేయాలన్న విషయమై మాట్లాడారు.

**24-12-2008 :** పార్వతీపురం ప్రజ్ఞాపీఠంలో విజయనగరం జిల్లా సమావేశం జరిగింది. 58 మంది పాల్గొన్నారు. మాసపత్రిక, జ్ఞానపరీక్షలు, దేవసంస్కృతీ విశ్వవిద్యాలయ కార్యక్రమాలపై సంకల్పం తీసుకున్నారు. జిల్లాకన్వీనర్ శ్రీ పి.వి.రమణమూర్తి, ప్రముఖ కార్యకర్త శ్రీ శంకర్రావు, శ్రీ హరినారాయణ, శ్రీ మహేశ్వరరావు, శ్రీ రాజారావు మొదలైనవారు సహకరించారు.

**25-12-2008 :** సాయంకాలం గం॥ 6-30 ని॥లకు విశాఖపట్టణంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో సెమినార్ జరిగింది. డా॥ బ్రిజమోహన్‌గౌర్ (దక్షిణభారత్ ప్రచారక్) "సమస్యలు-సమాధానాలు" అన్న అంశంపై మాట్లాడుతూ "సమస్యలు మానవుడు తనకు తానుగా సృష్టించుకున్నవే అనీ, సమాధానాలు కూడ అతని చేతిలోనే ఉన్నాయనీ, అన్నింటికీ ఆధ్యాత్మికతయే ఆధారమనీ ఉద్బోధించారు. అధ్యాత్మకు అసలు అర్థం కర్తవ్యపరాయణతయే" అని నొక్కివక్కాణించారు. ధీరగంభీర వచనాలతో సభ్యులను ప్రభావితంచేశారు.

**26-12-2008 :** కాకినాడలోని రామకృష్ణ ఆశ్రమంలో వివేకానందహాలులో కార్యవర్గసభ్యుల సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ సంయోజక్ శ్రీ అశ్విని సుబ్బారావు గాయత్రి మంత్ర మహిమగురించి, "మానవ జీవనలక్ష్యం-వానప్రస్థులు" అన్న విషయంపై ప్రవచనంచేశారు. రామకృష్ణాశ్రమం వైస్‌ప్రసిడెంట్ శ్రీ ఎ. శ్రీరామమూర్తి గాయత్రీపరివార్ లక్ష్యాలను కొనియాడి ఎప్పటికీ తన సహకారం ఉంటుందని ఆనందంగా ప్రకటించారు. శ్రీ యాళ్ల కృష్ణారావు ఈ సమావేశానికి మూలస్తంభంగా నిలబడ్డారు.

**ఆరోగ్యవంతమైన శరీరం అన్నింటికన్న విలువైనది.**

# రాష్ట్రంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు

## భీమిలిలో

12-12-2008 మార్గశిర పౌర్ణమి సందర్భంగా త్రికుండి గాయత్రి మహాయజ్ఞం దుర్గాగాయత్రి శక్తిపీఠం, భీమిలి యందు డా॥ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పూజ్యగురుదేవుల జన్మ శతాబ్ది కొరకు చేయవలసిన ప్రయత్నాలను వివరించారు. నెలలో రెండుసార్లు పౌర్ణమి అమావాస్యలలో సామూహిక గాయత్రిమంత్ర జపం చేయాలని విరివిగా దీపయజ్ఞాలు జరపాలని సంకల్పం తీసుకున్నారు.

## కామారెడ్డిలో

14-12-2008 కామారెడ్డి పద్మశాలి మందిరంలో నవకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ ఉపేందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివభక్త భజన మండలి, బీడికార్మికులు సహకరించారు. 400 మంది పరిజనులు పాల్గొన్నారు.

## యాప్రాలులో-నిత్యగాయత్రీ వేదపాఠశాల

ప్రముఖ కార్యకర్త శ్రీ హరిహరస్వామి, శ్రీ కూతాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిత్యగాయత్రీ ఉచిత పాఠశాలను 23-12-2008 నాడు ప్రారంభించారు. అచట పేదవిద్యార్థులకు గాయత్రీ మహామంత్రంతో పాటు హవనవిధి మంత్రాలను కూడ నేర్పుచున్నారు. ప్రస్తుతం ప్రతిరోజు విద్యార్థులు పాఠశాల నుండి వచ్చిన తరువాత సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు బోధన జరుగుచున్నది. ఇప్పటికి 12 మంది విద్యార్థులు శ్రద్ధతో, ఆసక్తితో నేర్చుకుంటున్నారు.

## అంతయ్యాపాలెంలో

25-12-2008 అంతయ్యాపాలెం, సమీర్‌పేట మండలం శాంతినికేతన్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ అంబారామస్వామి కాలేజి, గాయత్రి మందిరనిర్మాణం సంకల్పించిన సందర్భంగా 12 కుండముల గాయత్రి మహాయజ్ఞం జరిపించారు. సుమారు 100 మంది కాలేజి విద్యార్థినులు, కాలేజి అధ్యాపకులు పాల్గొన్నారు. శ్రీమతి అశ్విని మహేశ్వరి పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని శ్రీమతి అనసూయమ్మ, శ్రీ రఘు నిర్వహించారు.

## మంగళగిరిలో

26-12-2008 మంగళగిరి శ్రీ లక్ష్మినృసింహ స్వామి దేవస్థాన ఆవరణలో కార్తీకమాస సందర్భంగా 2400 దీపాలతో గాయత్రీ దీపయజ్ఞం శ్రీ డి.వి.యన్.విశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ బి.వి.యన్.మూర్తి, శ్రీ పేర్ల వెంకటేశ్వరరావు, శ్రీ బిచ్చా శివశంకరరావు సహకరించారు.

## సామూహిక గాయత్రీ మంత్రజపం

కుందురువారిపాలెంలో ప్రతినెల చివరి ఆదివారంనాడు ఉదయం 9 గంటల నుండి10 గంటలవరకు 50 మంది సభ్యులతో సామూహిక జపం జరగాలన్న నిర్ణయం జరిగింది. 28-12-2008 నాడు ప్రారంభమైనది.

రేచవరం గ్రామంలో 28-12-2008 నాడు 38 మంది సభ్యులతో గంటసేపు సామూహిక గాయత్రీ మంత్రజపం జరిగింది.

చాగంటివారిపాలెంలో 28-12-2008 నాడు 71 మంది సభ్యులతో గంటసేపు సామూహిక గాయత్రీ మంత్రజపం జరిగింది.

గాయత్రీ చేతనాకేంద్రం హైదరాబాదులో 2008 గాయత్రీ జయంతి నాటినుండి నెలకు రెండుసార్లు సామూహిక గాయత్రీ మంత్రజపం జరుగుచున్నది.

26-12-2008 నాడు సామూహిక జప సందర్భంగా ప్రముఖ కార్యకర్త శ్రీమతి బి.అనసూయమ్మ బృందం ఆలపించిన యుగ సంగీతం సి.డి.ని శ్రీమతి అశ్విని మహేశ్వరి ఆవిష్కరించారు.

## ఎర్రగడ్డలో

21-12-2008 హైదరాబాదు-ఎర్రగడ్డ, శాంతినికేతన్ పి.జి.కాలేజి నందు 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం శ్రీ జి.వెంకటనారాయణ, శ్రీ సోని, శ్రీ సంతోష్ నిర్వహించారు. సుమారు 300 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో

30-12-2008 హైదరాబాద్ కూకట్‌పల్లి కె.పి.హెచ్.బి. కాలనిలో ఒక లక్ష గాయత్రి జప పూర్ణాహుతిగా 3 కుండముల గాయత్రి మహాయజ్ఞం శ్రీ యమ్.వి.ఎస్.ప్రసాద్ శ్రీ శ్రీనివాస్ అయ్యప్పల సహకారంతో శ్రీ జి.వెంకటనారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60 మంది భక్తులు పాల్గొన్నారు.

★★★

**మహాపురుషులు దుఃఖాల ఊయలలో ఊగుతూ, ఆపదలను తలగడులుగా వాడతారు.**